కోసూరి ఉమాభారతి

# విదేశీ కోడలు (కథాసంపుటి)



# విదేశీ కోడలు

(కథాసంపుటి)

కోసూరి ఉమాభారతి

యాభై ఒకటవ ప్రచురణ

VANGURI FOUNDATION OF AMERICA, Inc
Houston, Texas

**VIDESEE KODALU** *(Anthology of Short Stories)*

*by* ***Kosuri Uma Bharathi***

First Edition : March 2013

ISBN : 1-892408-42-2

Library of Congress Control Number : 2013902630

\Publication # 51

© Author

Cover Design and Ilustrations : ***Bali***

Published by : Vanguri Foundation of America (Houston, TX)

P O Box 1948, Stafford, TX 77497 :: Phone: 832 594 9054

E-mail : vangurifoundation@gmail.com

Vanguri Foundation of America (Hyderabad)

Satya Sai Puram, Kuntloor Village, Hyderabad - 501 505

Phone : 98490 23852

For Copies (US, India & other Countries)

vangurifoundation@gmail.com

*Sole Distributors :*

**M/s. Navodaya Book House**
*H.No. 3-3-865, Opp. Arya Samaj Mandir,*
*Kachiguda, Hyderabad - 500 027*
Ph: 040 - 24652387

Designed & Produced by : Rachana Entinti Patrika, Hyderabad 500 044

Printed at : Charita Impressions, Azamabad, Hyderabad –500 020

Price : ₹ 150/-

Tax Deductible Donation : US $ 25.00

U.S Federal tax ID : 76-0444238

# అంకితం

ఉగ్గుపాలతో పాటు, జీవితం రంగరించి పోసింది అమ్మ శారద. కళ్ళల్లో కలలు నింపి, నా మనస్సులో ఆశయాలు పెంచి, అంతకు పదింతలు ఉత్సాహాన్ని పంచారు నాన్న.

నా ఎదుగుదలకి సంపూర్ణ తోడ్పాటునిస్తూ నా కళల కలలని సాకారం చేసుకోవడానికి సహకారాన్ని అందించారు. మనిషికి శక్తిసామర్థ్యాలే కాదు – పట్టుదల, స్థైర్యం అవసరమని తెలియజేశారు నాన్న. త్యాగం, బాధ్యత, బాంధవ్యాలకి అర్ధం చెప్పింది అమ్మ. జీవితాన్ని వీలుగా, అందంగా మలుచుకోవడం ఎంతేని అవసరం అనేది అమ్మ.

సంస్కృతీ సాహిత్యాలంటే వారికున్న మక్కువ, ఆసక్తులని వారసత్వంగా అంది పుచ్చుకుని, జాతీయ అంతర్జాతీయ శాస్త్రీయ నాట్య కళా రంగాన ఉన్నత శిఖరాలను అందుకున్న ఘనత నాకు దక్కినా, అందుకు స్థిరమైన పునాదులు వేసి, చేయి పుచ్చుకుని ఆ దిశగా

అడుగులు వేయించింది వారిద్దరే!

స్వయంకృషితో ఎదిగి, ఉన్నతాధికారిగా దేశానికి, ఆంధ్రప్రదేశానికి సేవలందించిన నాన్న తన తల్లి తండ్రులతో ప్రేమ వాత్సల్యాలతో మెలిగిన తీరు, అందించిన సేవలు కూడా నాకు మార్గ దర్శకాలే!

ఓ కళాకారిణిగా, వ్యక్తిత్వమున్న స్త్రీగా నా పురో గతికి, జీవన ప్రస్థానానికి కర్త కర్మ క్రియ తామే అయ్యి అడుగడుగునా చేయూత నందించిన నా తల్లితండ్రులు –



కీర్తిశేషులు శ్రీమతి శారద, మేజర్. ఆరె. సత్య నారాయణ గార్లకి శతకోటి ప్రణామాలతో నా మొదటి పుస్తకం *'విదేశీ కోడలు'* (కథాసంపుటి) సమర్పణ.

– కోసూరి ఉమాభారతి

*ఫిబ్రవరి 25, 2013*

# మా మాట........

శ్రీమతి కోసూరి ఉమాభారతిగారు 'నాట్యభారతి'గా ప్రపంచ ఖ్యాతి గాంచిన నర్తకీమణి. సుమారు మూడు దశాబ్దాలగా హ్యూస్టన్ మహానగరంలో తాము నెలకొల్పిన 'అర్చనా డాన్స్ ఎకాడెమీ' ద్వారా వందలాది యువతీయువకులకి కూచిపూడి, భరత నాట్యం, ఇతర భారతీయ నాట్య ప్రకియలలో శిక్షణ ఇస్తూ లబ్ధప్రతిష్టులయ్యారు. అమెరికా రాకముందు 'యమగోల' సినిమాలో ఎన్టీ రామారావుతో దేవకన్య ఊర్వశి గానూ, 'చిల్లర దేవుళ్ళు' సినిమాలో హీరోయిన్‌గానూ నటించి, అమెరికాలో కూడా సినీ నిర్మాతగా పేరుపొందారు. 1980 ప్రాంతాలలో హ్యూస్టన్‌లో ఉమాభారతిగారి మొట్టమొదటి ప్రదర్శన మా దీపావళి కార్యక్రమంలో ఏర్పాటు చెయ్యడం నాకు ఇంకా బాగా జ్ఞాపకం. ఇక ఉమాభారతిగారు, ఆవిడ మాటల్లోనే చెప్పాలంటే – 'సాహిత్య ప్రపంచంలోకి కొత్తగా ఆడుగెడుతున్న' రచయితే కానీ, ఈ సంపుటిలో ఉన్న కథలు చదివితే బాగా చేయి తిరిగిన రచయితల పరిపక్వత కనపడుతుంది. అందుకు ఉదాహరణ ఆమె రచించిన 'ముళ్ళగులాబి' కథ 2012లో – అంటే గత సంవత్సరం మేము నిర్వహించిన 17వ ఉగాది ఉత్తమ రచనల పోటీ 'నా మొట్టమొదటి కథ' విభాగంలో బహుమతి పొందింది.

కేవలం సంవత్సర కాలంలోనే కథారచన ఒక యజ్ఞంగా తలపెట్టి ఉమాభారతిగారు వ్రాసిన ఈ 'విదేశీ కోడలు' కథాసంపుటి ప్రచురించే సదవకాశం వంగూరి ఫౌండేషన్‌కు కలిగించిన ఉమాభారతిగారికి మా ధన్యవాదాలు. ఇది మా 51వ పచురణ. వాటిల్లో సగం పైగా అమెరికా కథకులు రచించిన సంపుటులూ, సంకలనాలూ కావడం విశేషం. మా ప్రచురణలు, సాహిత్య కార్యక్రమాల వివరాలు ఈ పుస్తకం ఆఖరి పేజీలలో పొందు పరిచాం.

ఇటు అమెరికా నేపథ్యంతోటీ, భారతదేశ ఇతివృత్తాలతోటీ మాత్రమే కాకుండా 'ఫేంటసీ' కథలు కూడా రచించగల నైపుణ్యం ఉమాభారతిగారు ఈ కథలలో చూపిం చారు. అందుకు ఆమెని అభినందిస్తూ, ఆమె కలం నిరాటంకంగా సాగాలని కోరుకుంటు న్నాం.

ఈ కథాసంపుటి ఉత్తర అమెరికాలోనే కాక అంతర్జాతీయ స్థాయిలో తగిన ఆదరణ పొందుతుంది అని ఆశిస్తూ, ఈ పుస్తకానికి రూపకల్పన చేసిన 'రచన' శాయి (హైదరా బాద్) గారికీ, చిత్రకారులు బాలిగారికీ, అందంగా ముద్రించిన చరిత ఇంప్రెషన్స్ వారికీ మా పత్యేక ధన్యవాదాలు.

ఫిబ్రవరి 4, 2013

– వంగూరి చిట్టెన్ రాజు
అధ్యక్షులు

# ఓ మాట

"ఇప్పుడిప్పుడే రాస్తున్నాను, నేను రాసిని ఈ కవిత చూడండి, ఈ కథ చదివి చెప్పండి, కాస్త ఎలా వుందో చెప్పరా?" అని అడిగి ఎన్ని రోజులో కాలేదు. అప్పుడే ఎన్ని కవితలో, ఎన్ని కథలో, తన గుండెల్లో ఇంక దాచుకోలేనన్నట్లు. అదేదో ఒక ఉప్పెనలాగా రాసేయడమేమిటి, వివిధ పత్రికలలో, బ్లాగులలో ప్రచురింపబడడమేమిటి – అన్నీ చకచక జరిగి పోయాయి. ఉమాభారతిగారు ఒక్క నాట్యభారతే అనుకునేవారికి తాను సాహిత్య భారతి అని కూడా రుజువు చేసుకుంటున్నారనుకోవడానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలి?

ఆమె చెప్పదల్చుకున్న విషయం తన మనస్సుకి అతి దగ్గరలో ఉన్నదని మనం ఆవిడ రాసిన ఏ రచనను చదివినా మనకు అర్థం అయిపోతుంది. ఆవిడ రాసిన రచనల్లో ఆవేశం ఉంది. ఆవేదన ఉంది. మనుషుల్లో పేరుకుపోయిన ఉదాశీనతకు ఆక్రోశం ఉంది. తన మనసులోమాట నలుగురితో పంచుకోవాలనే ఉత్సాహం ఉంది. అతి తక్కువ కాలంలోనే రచనల్లో పరిణతి పొందగలిగే శ్రమ ఉంది.

ఉమాగారి కథలు చాలామటుకు అమ్మ, నాన్న, పిల్లలు – వీళ్ళ మధ్యలో పరిభ్ర మిస్తూంటాయి. ముఖ్యంగా అమ్మా నాన్నలకు పిల్లల వల్ల జరిగే అన్యాయం ఉమాగారిని కదిలించింది అనుకుంటాను ఆమె జీవితంలో. మనందరం కూడా మన సభ్య సమాజంలో చూస్తుంటాం ఈ కథలలోని సన్నివేశాల్ని. అయితే మనం కూడా ఎంతవరకు మన అమ్మలకు, నాన్నలకు ఖేదం కలిగించామో ఒకింతసేపు ఆలోచిస్తేనే కాని మనకు తెలియదు. ఈ కథలు మనల్ని తట్టి లేపి ఆలోచింపచేస్తాయి. ఇంకోటి, ఆమె తనకు నాట్యం మీద వున్న మక్కువను కూడా అతి సున్నితంగా రెండు రచనలలో వచన రూపంలోనూ, పద్యరూపంలోనూ చెప్పారు. కొన్ని కథలలో ఆమె ఒక మనిషి మొత్తం జీవితాన్ని కుదించి రాయడం జరిగింది. ఇది నిజంగా చాలా కష్టమైన పనే! – అదీ నాలుగు పేజీలలో కుదించడం. అన్ని కథలలోనూ ఒక మెసేజ్ పాఠకులకు ఇవ్వాలనే తపన కొట్టొచ్చినట్లు కనబడుతుంది.

ఒక రచయిత్రిగా అందరి హృదయాలను తాకగలిగే కథావస్తువులను తన జీవితపు అనుభవాల పరంపరలోంచి ఎన్నుకుంటూ, తనదంటూ ఒక శైలిని ఏర్పరచుకుంటూ, వైవిధ్యం కలిగిన రచనలను చేస్తూ, తెలుగు సాహిత్యానికి 'నేను సైతం' అంటూ తన మార్కు 'సమిధ'ను ఆహుతినిస్తూ, ఇంకా ఇంకా తన రచనలను సానబడుతూ, ముందు ముందు మరిన్ని మంచి మంచి రచనలను తెలుగు పాఠకులకు ఉమాభారతి గారు అందివ్వగలరని ఆశిస్తున్నాను.

*జనవరి 24, 2013* — *– శాయి రాచకొండ*

*సంచాలకుడు, తెలుగు బడి, హ్యూస్టన్*



# అభినందన

ఉమాభారతి పేరున్న నృత్య కళాకారిణి అయినా కూడా ఒక సాధారణ రచయిత్రి గానే నాకు తొలి పరిచయం. 'విహంగ మహిళా సాహిత్య పత్రికకి రచనలు పంపటం, వాటిని ప్రచురించడంతో మా పరిచయం మొదలైయింది. స్వతహాగా తను స్నేహ మయి, నిగర్వి. తనకు తాను ఎప్పుడు తానొక కళాకారిణిని అని చెప్పుకోలేదు.

నృత్య కళలలో ఆరితేరిన వాళ్ళు కలం, కాగితం పట్టుకుని తీరిగ్గా రచనలు చేయడం అన్నది చాలా తక్కువమందిలోనే చూస్తుంటాం. కఠోరమైన సాధన, ప్రదర్శ నలు, నిర్వహణ... తీరుబాటుతనానికి తావివ్వవు. అరుదుగా మాత్రమే సినీనటి భానుమతిలా బహుముఖ ప్రజ్ఞాశాలులు ఉంటారు. ఎక్కువగా నృత్య కళాకారిణులు వారి రంగానికి సంబంధించిన నృత్య రూపకాలు, పాటలు, కీర్తనలు వంటి వాటిపై పరిశోధనాత్మక వ్యాసాలు రచిస్తూ ఉంటారు.

ఉమాభారతి పాత తరం మనస్తత్వం ఉన్న కొత్త తరం రచయిత్రి. 'సాధనతో పనులు సమకూరు *ధరలోన*' అన్నట్లు ఉగ్గుపాల నాడే ఎవరూ ఆవకాయ తినలేరు. రచనా ప్రక్రియ కూడా అటువంటిదే! కళాకారులు స్వతహాగా భావుకులు. చిన్న చిన్న విషయాలకి కూడా హృదయం స్పందిస్తుంది. అది వాళ్ళ ప్రదర్శనలలో రమ్యంగా

రక్తి కట్టించగలరు. దానికితోడు రచనా ప్రక్రియ కూడా తోడైతే ప్రతి సంఘటన ఒక రసాత్మక కావ్యమవుతుంది . లేదా ఒక గొప్ప కథగా, కవితగా రూపుదిద్దుకుంటుంది. పుట్టుకతోనే ఎవరు కలం పట్టుకుని పుట్టరు కాబట్టి తొలినాటి రచనలు కొంత ప్రాథమిక స్థాయిలోనే ఉంటాయి. తొలి మెట్టు ఎక్కితేనే చివరి మెట్టుకి చేరుకోగలం. ఉమాభారతి రచనా ప్రయాణం కూడా ఈ రకంగానే సాగిందని అనుకోవచ్చు.

చిన్ననాటి నుంచే తల్లిదండ్రుల ప్రోత్సాహం, అప్పటి రచయిత్రి 'ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ' దగ్గర నుండి బహుమతులు అందుకోవడం వంటి సంఘటనలు ఉమాభారతి రచనాసక్తిని మేల్కొలిపాయి. తాను నర్తకిగా ఉజ్వల దశలో ఉన్నప్పుడు లోకపు పోకడల్ని, మానవ సంబంధాలని ఔపోసన పట్టారు. ఆ అనుభవాలే మనసులో నిక్షిప్తమై అప్పుడప్పుడు నృత్య రూపకాలుగా రూపుదిద్దుకున్నాయి.

సాధారణంగా విదేశాలకు వెళ్లాకే తెలుగు మీద ప్రేమ అధికమవుతుంది. భారత దేశంలో ఉన్నప్పుడు కలం ముట్టని వారు విదేశాలకు వెళ్ళాక రచయితలుగా, రచయిత్రు లుగా తమ భావాలకు అక్షర రూపం కల్పించడం తెలిసిన విషయమే! ఉమాభారతి శైలి చాలా సరళంగా, భావవ్యక్తీకరణ స్పష్టంగా ఉంటుంది. ఎక్కడా క్లిష్టమైన పద జాలం కనిపించదు. కథలో సందేశాన్ని చదువరులకు అందించే తీరులో ఒప్పించేతనం, బతిమాలే గుణం, వేదన, ఆర్తి కన్పిస్తుంటాయి. సమాజంలోని రుగ్మతల పట్ల ఆమెకి ఒక స్పష్టమైన అభిప్రాయం ఉంది. పాత్రలు, వాటి మనస్తత్వాలు, పేదరికం, మావన సంబంధాల పట్ల రచయిత్రికి అపారమైన అవగాహన ఉంది. కథనంలో తప్పనిసరై దొర్లే చిన్నచిన్న పదాలు తప్ప ఆంగ్లం ఎక్కడా కనిపించదు.

*'విదేశీ కోడలు', 'మానసపుత్రి', 'భరతముని భూలోక పర్యటన'* – ఈ మూడు కథలు తప్ప మిగిలిన కథల కథనం ఉత్తమ పురుషలో సాగుతుంది.

ఈ పక్రియ వల్ల రచయిత చదువరులను తనతో పాటుగా తన ఊహా ప్రపంచానికి లేదా ఆ వాస్తవ సంఘటనలలోకి తీసుకెళ్ళడానికి సులువైన మార్గం ఏర్పడుతుంది . చదువరులు కూడా రచయితతో పాటు చివరి వరకు ప్రయాణం సాగిస్తారు.

నిస్వార్థమైన కృషితో తన తోటివారి జీవితాలలో సుఖసంతోషాలను నింపుతూ ఆనందాన్ని వెతుక్కొనే త్యాగమయి కథే *'కాఫీ టిఫిన్ తయ్యార్!'*. ఈ కథలో రచయిత్రి వాడిన వర్ణనలు, పరిసరాలు, పదబంధాలు వాస్తవానికి అతి దగ్గరగా చదువరులను కూడా చిన్న కాఫీ హోటల్‌లో నిలబెడుతుంది. అవ్వ, సత్తుగ్లాసు, జొన్నరొట్టెలు వంటి పదాలు యిప్పటి పిల్లలకు తెలియనే తెలియదు. అలాగే *'నా కోసం తిరిగి రావూ!', 'ఏ ఫ్రెండ్ ఇన్ నీడ్' , 'మా నాన్న పిచ్చివాడు'* వంటి కథలు సమాజపు పోకడలు,

మానవ సంబంధాల పట్ల విలువలును ప్రతిబింబిస్తాయి. పాత్రల చిత్రీకరణ, పాత్రల మనస్తత్వాన్ని విశ్లేషించడం, చదువరులను సన్నివేశంలోనికి తీసుకెళ్ళగలిగే నైపుణ్యం, నడక ఈ రచనల్లో కన్పిస్తుంది.

'అమ్మతనం అద్భుత వరం' అనే కథలో తల్లి అనే రెండు అక్షరాలలో ఉన్న మహ త్తును, వృద్ధాశ్రమాలకి తరలించబడే తల్లుల అంతరంగ భావాలను అద్భుతంగా చిత్రీకరించారు.

ఎన్నో బాధల మధ్య జీవితాన్ని ఈదిన ఒక ప్రవాస భారతీయ మహిళ గురించి రాసిన 'త్రిశంకు స్వర్గం'; అలాగే 'మా నాన్న పిచ్చివాడు' – ఈ రెండు కథలలోను జీవితంలో ధక్కా మొక్కీలు తిని మానసిక స్థిరత్వాన్ని కోల్పోయిన వ్యక్తుల జీవితాన్ని అత్యద్భుతంగా, కళ్ళు చెమర్చే విధంగా చిత్రించారు.

'విదేశీ కోడలు', 'ముళ్ళగులాబి' కథలలో విదేశాలలో పెరిగిన తెలుగు వారి పిల్లలు పెళ్ళిళ్ళ విషయాలలో ఎదుర్కొంటున్న అవగాహనా రాహిత్యం, 'ఇగో' వంటి అంశాలను స్పృశించారు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలో ఈ కథల్లో చెప్పారు.

నాట్య శాస్త్రాన్ని లోకానికి అందించిన మహనీయుని గురించిన ఊహాత్మక కథయే 'భరతముని భూలోక పర్యటన', 'మానసపుత్రి' నృత్య రూపకంగా అమెరికా విశ్వ విద్యాలయంలో విద్యార్థుల కోసం రచించారు .

తొలినాళ్ళతో పోలిస్తే ఉమాభారతి శైలి, వాక్య నిర్మాణంలో పన్నెండు కథలు పూర్తయ్యేసరికి ఎంతో పరిణతి కన్పిస్తుంది. సంఘటనాత్మకంగా, భావవ్యక్తీకరణ, శైలీ పరంగా గమనిస్తే ఉమాభారతి పై పాత తరం నవలా రచయిత్రుల ప్రభావం ఉందేమో అన్పిస్తుంది. రచనా వ్యాసంగం ఆలస్యంగా మొదలు పెట్టినా కూడా మధ్యలో ఆపకుండా వెంట వెంటనే కథలు, కవితలు రాయటం... అవి పత్రికల్లో ప్రచురించబడటం, అవి ఒక పుస్తక రూపంలోకి రావడం గొప్ప విషయం. ఉమాభారతి సాహితీ ప్రస్థానం విరామం లేకుండా కొనసాగాలని, సమాజపు రుగ్మతల్ని, వాటి పరిష్కారాలని తమ రచనల ద్వారా ఆవిష్కరించాలని... మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నాను. యింకా ఇలాంటి రచనలు ఎన్నో చేయాలని ఆశిస్తూ ఉమాభారతిని అభినం దిస్తున్నాను

– డా. పుట్ల హేమలత, ఎం.ఎ., పిహెచ్.డి.,
సంపాదకురాలు
'విహంగ' మహిళా సాహిత్య పత్రిక

# నా మాట.....

**నృ**త్యాలకి కథాంశం, పద్యం, వ్యాఖ్య కూర్చడం నాకు పరిపాటే!

గత ఏడాదిగా కవితలు, కథలు రాయడాన్ని కూడా నా భర్త డాక్టర్. మురళీమోహన్ కోసూరి ఎంతగానో ప్రోత్సహించారు.

*'వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా'* స్థాపించి, ప్రవాసాంధ్రుల తెలుగు భాషా, సాహిత్యాభిమానాలకి పెద్దపీట వేసి, సాహిత్య ప్రపంచంలో కొత్తగా అడుగెడుతున్న నాలాంటి వారికి సైతం స్ఫూర్తిదాయకులయిన శ్రీ వంగూరి చిట్టెంరాజుగారికి, విలువైన సమయాన్ని వెచ్చించి నేను రాసిన పన్నెండు కథలు చదివి, ప్రచురణార్హమని రెండు వాక్యాల్లో చెప్పి, నాలో స్ఫూర్తిని నింపిన సాహితీవేత్త, పెద్దలు, కీర్తిశేషులు పెమ్మరాజు వేణుగోపాలరావుగారికి హృదయపూర్వక నమస్సులు.

ముందుమాట రాసినందుకు *'విహంగ'* సంపాదకులు, డా. పుట్ల హేమలతగారికి, సాహిత్య ప్రియులు శ్రీశాయి రాచకొండగారికి కృతజ్ఞతలు.

పుస్తకం ప్రచురించినందుకు 'వంగూరి ఫౌండేషన్' వారికి, పర్యవేక్షణ చేసిన *'రచన'* శాయిగారికి, ముఖచిత్రంతో పాటు కథలకి బొమ్మలు అందంగా చిత్రీకరించిన ఆర్టిస్ట్ బాలిగారికి, రచనలు ప్రచురించి ప్రోత్సహించిన *'ఆంధ్రప్రభ', 'ఆంధ్రభూమి', 'సుజనిరంజని', 'కౌముది', 'విహంగ', 'మాలిక', 'జాబిల్లి', 'సరాగ'* పత్రికలకు హృదయ పూర్వక ధన్యవాదాలు.

నన్ను కథలు రాసే దిశగా ఆలోచింపజేసి ఈ కథల సంపుటికి సలహా సహాయాలను అందించిన స్నేహశీలి శ్రీమతి జ్యోతి వలబోజు, నా శ్రేయోభిలాషులు శ్రీ వంశీ రామరాజు, సుధగార్లు సహృదయులు.

రచనల దిశగా నా ప్రస్థానం :

వాస్తవానికి ఎనిమిదేళ్ళప్పటినుండే నాలో రాయాలన్న కోరిక ఉండేది. పుస్తకాలు తెగ చదివేదాన్ని. చిన్న చిన్న కథలు, పాటలు రాసినా ఒక్కగానొక్క శ్రోత, మా నాన్నకి వినిపించేదాన్ని. నాన్న ఆర్మీ ఆఫీసర్‌గా సెలెక్ట్ అయ్యే ముందు శోభనాచాల సంస్థ వారి చిత్రాల్లో నటించి, అసోసియేట్ దర్శకుడిగా పనిచేశారు. ఆర్మీ మేజర్‌గానూ, కమర్షియల్ టాక్సస్ నుండి డిప్యుటి కమీషనర్‌గానూ రిటైర్ అయ్యారు. లలిత కళలంటే, ముఖ్యంగా శాస్త్రీయ నృత్యమంటే, ఆయనకి ఎనలేని మక్కువ. నన్ను నృత్య కళాకారిణిగా తీర్చిదిద్దాలన్నదే అయన కల.

నాట్యాభ్యాసన వల్ల, తెలుగు భాషా సంగీత సాహిత్యాలతో నాకు సాన్నిహిత్యం ఏర్పడింది.

పుట్టింది గుంటూరులో, పెరిగి, చదువుకున్నది హైదరాబాదులో. మేము తెలుగు భాష స్వచ్ఛంగా మాట్లాడేలా జాగ్రత్త పడేవారు మా అమ్మ. నాకు, సంస్కృతీ సంప్రదాయాల ప్రాముఖ్యత తెలియజేయడంలో అమ్మ కృషి ఎంతైనా ఉంది.

నాకు స్ఫూర్తినిచ్చిన సాహితీవేత్తలు, మహాకవులు :

నా పదో యేట వరంగల్లులో జరిగిన అఖిల భారత రచయిత్రుల మహాసభలో డా. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగారి చేతుల మీదుగా నా మొట్టమొదటి డాన్సు అవార్డు అందుకొన్నాను. ఆ సభలో ఆవిడ ప్రసంగం విన్న నాకు తెలుగు భాష మీద అభిమానం రెట్టింపయ్యింది.

నన్ను ప్రభావితం చేసిన వారు మరో మహాకవి డా. సి. నారాయణరెడ్డిగారు. నా నృత్య ప్రదర్శన కార్యక్రమాలకి అయన ముఖ్యఅతిథిగా వచ్చేవారు. ఆయన ప్రసంగాలు, మాటలు, పాటలు, వాక్యాలు, వ్యాఖ్యానాలు నాకెంతో స్ఫూర్తి నిచ్చేవి.

స్పందించే మనసుకి, పరికించే కనులకి చుట్టూ ఉన్న ప్రపంచాన రాగసరాగాలు, అందచందాలు తోచినట్టే సమాజంలో ఎన్నో వాస్తవాలు, సమస్యలు, పరిష్కారాలు కూడా తోస్తాయని నా భావన.

సమాజం యొక్క స్థితిగతులని తెలియజెప్పి, సమజానికి అద్దంపట్టే రచనలు నన్ను ప్రభావితం చేస్తాయి.

సాహిత్య స్ఫూర్తితోనే మా అకాడెమి తరఫున నిర్మించిన 'ఆలయ నాదాలు' టెలిఫిలింకి కొంత వరకు కథ, సంభాషణలు రాసాను. అమెరికాలో నిర్మించిన సగభాగం చిత్రానికి దర్శకత్వం వహించాను కూడా! ప్రవాసాంధ్రుల భావితరాల వారిని కళలు, మన సంప్రదాయాలు ప్రభావితం చేయగలవన్న సందేశాత్మక చిత్రం అది.

ఆగష్టు 2011 మొదట రాసిన కవిత అందరిలా 'అమ్మ' గురించే!

రచయిత్రిగా నా అనుభవం – 'ముళ్ళగులాబి'కి 'నా మొట్టమొదటి కథ విభాగంలో', 'వంగూరి ఫౌండేషన్' వారి 2012 ఉగాది పురస్కారం అందుకోవడం ప్రోత్సాహకరంగా ఉంది.

ఈ సంపుటిలోని కథానికలు 2012 మార్చి నుండి 2013 జనవరి వరకు వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. రచనలు చదివిన వారు స్పందన తెలుపుతున్నందుకు చాలా సంతోషం.

– ఉమాభారతి

# ఇందులో....


| | | |
|---|---|---|
| 1. కాఫీ టిఫిన్ తయ్యార్! | ... | 13 |
| 2. నా కోసం తిరిగి రావూ? | ... | 24 |
| 3. ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్ | ... | 30 |
| 4. త్రిశంకు స్వర్గం | ... | 42 |
| 5. మానసపుత్రి | ... | 49 |
| 6. ముళ్ళగులాబి | ... | 57 |
| 7. తొలిపొద్దు | ... | 67 |
| 8. విదేశీ కోడలు | ... | 77 |
| 9. మా నాన్న పిచ్చోడు | ... | 86 |
| 10. భరతముని భూలోక పర్యటన | ... | 99 |
| 11. అమ్మతనం అద్భుత వరం | ... | 106 |
| 12. అమ్మకి సరయిన స్థానం...స్వర్గమే! | ... | 114 |




**"కా**ఫీ టిఫిన్ తయ్యార్!" – అంటూ పొద్దున్నే ఎలుగెత్తి పిలవడం సరదాగా ఉండేది, ఎనిమిదేళ్ళప్పుడు నాకు.

తెల్లారుతూనే నాన్నకి, నలుగురన్నలకి, అవ్వకి సత్తు గ్లాసుల్లో కాఫీతో పాటు ఇత్తడి మూతల్లో జొన్న రొట్టెతో ఉల్లికారం పెట్టేదాన్ని. మరోసారి గట్టిగా, "అన్నయ్యా, అవ్వా అందరూ త్వరగా రండి... కాఫీ టిఫిన్ తయ్యార్!" అంటూ పిలిచేదాన్ని.

గబగబా నేనూ తినేసి, అంతే వేగంగా అంట్లన్నీ కడిగేసి, పొట్లం కట్టిన సగం రొట్టెని పుస్తకాల సంచిలో పెట్టుకొని, అన్నయ్యల వెంటే బడికి పరుగు

**కోసూరి ఉమాభారతి**

పెట్టేదాన్ని. దారిలో చూపులేని రామయ్య తాత చేతిలో రొట్టె పొట్లం పెట్టగానే, బోసి నోటితో సంతోషంగా నవ్వేవాడు.

నాకు బాగా గుర్తు!

నేను బడికి వెళ్ళడం మొదలు పెట్టినప్పుడే మెయిన్ రోడ్డు మీద బస్ స్టాండ్ పక్కన 'టిఫిన్ సెంటర్' తెరిచారు. అక్షరాలు చదవడం మొదలెట్టాక, ముందుగా నేను చదివింది 'టిఫిన్ సెంటర్' బోర్డుల మీద అక్షరాలే! అన్నిటికన్నా, కిటికీలోని బోర్డుపై ఎర్రని తళుకులద్దిన *'కాఫీ టిఫిన్ తయ్యార్!'* అన్న అక్షరాలు నా కళ్ళల్లో మెరుపులు చిందించాయి.

అమ్మకి వంటపనిలో సాయం చేయడం మొదలు పెట్టాక, వంటకం ఏదైనా సరే, నేను మాత్రం 'టిఫిన్ సెంటర్'లో లాగా 'కాఫీ టిఫిన్ తయ్యార్!' అంటూ తినడానికి అందరిని రమ్మని పిలిచేదాన్ని.

అవతలి వీధి మొదట్లో ఉన్న ఫ్యాక్టరీలో నాన్న వాచ్‌మెన్ ఉద్యోగం చేసేవాడు. ఫ్యాక్టరీ పక్కనే ఉన్న యజమానిగారింట్లో అమ్మ వంట చేసి వచ్చేది. కుటుంబానికి పెద్ద దిక్కు మా అవ్వ. ఇంటి అరుగుల మీద కూర్చుని అందరికి చేతనయిన మాట సాయం చేస్తూ, చుట్టూ ఉన్న అమ్మలక్కలతో కాలక్షేపం చేసేది. ఎదురింటి పూజారి గారి తల్లి మా అవ్వకి రోజూ నాలుగు కొబ్బరి చిప్పలు ఇచ్చేది.

భోజనానికి తరచుగా పప్పుచారు, కొబ్బరి–సెనగపప్పు కూర, కొబ్బరి పచ్చడి చేసేవాళ్ళం. వంటింట్లో పనయ్యాక, "భోజనం తయ్యార్! అంతా రండి" అంటూ పిలవగానే వచ్చి వంటకాలు చూసి, "దీనికే పెద్ద భోజనమో అని కేకెట్టాలా?" అని నెత్తిన మొట్టేవాడు పెద్దన్నయ్య.

"చాల్లే ఊరుకో బడుద్దాయ్! కాశీఅన్నపూర్ణమ్మ దయతో మన ఇంట వెలసిన ఆడపిల్ల కాబట్టే, ప్రతి పూట అన్నం వడ్డించి అందరినీ పిలుస్తదిరా" అని వాడిని గదమాయించేది అవ్వ.

"పేరుకు తగ్గట్టుగా నలుగురికి అన్నం పెట్టేదానివే అవ్వాలి నువ్వు కాశీ" అంటూ ప్రేమగా నా తల నిమిరేది.

అవ్వకి నేనంటే ప్రాణం!

పక్కింటి వంటల వాసక్కతో పెళ్ళిళ్ళకి, పేరంటాలకి వెళ్లి... స్వీట్స్, కారాలు, వంటకాలు చేయడానికి సాయపడడం నాకు సరదాగా ఉండేది. నన్ను

మెచ్చుకోనేది వాసక్క – “అమ్మో, అమ్మో! కాశీ అన్నపూర్ణమ్మా! త్వరలో నన్ను మించిపోయి, నా ఖాతాలన్నీ లాగేస్తావేమోనే” అనేది ఆమె నాతో.

వెళ్ళి వంటలు చేసిన వాళ్ళ ఇళ్ళల్లో, వాళ్ళు కానుకగా ఇచ్చిన కొద్ది తినుబండారాలు తెచ్చి గొప్పగా ఇంట్లో అందరికి రుచి చూపించేదాన్ని.

❖ ❖ ❖

పదో తరగతి వేసవి సెలవల్లో నేను తోడుంటాననే నమ్మకంతో, వాసక్క ఎన్నో వంటపనులు ఒప్పుకొంది.

బయట ఊళ్ళకి మాత్రం రానని చెప్పాను.

“అమ్మకి ఓపిక లేదు. పైగా అన్నయ్యలందరు ఇంట్లో ఉంటారు. నా అవసరం ఉంటది అందరికి” అన్నాను వాసక్కతో.

ఎన్నడూ లేనిది ఆమెకి చాల కోపం వచ్చింది.

“పొగరెక్కి పోయిందే నీకు. నా వల్ల అన్నీ నేర్చావు, జైలు జుబ్బా ల్లాంటి బట్టల నుండి జలతారు వోణీలు వేస్తున్నావు. యువరాణి ననుకోకు. నా కూడా వస్తావు కదాని పనులు ఒప్పుకున్నాను. డబ్బు కూడా పుచ్చుకున్నాను, ఇలా నట్టేట ముంచే దానవని తెలీలేదు” అంటూ కేకలేసింది.

“అసలైనా ఇక నుండి నీతో నాకు అవసరం లేదు పోవే” అని తిడుతూ వెళ్ళి పోయింది ఆమె.

నేను అవాక్కయ్యాను. కళ్ళ వెంట నీళ్ళతో చేతలుడిగి నిలబడి పోయాను. నేనేమి తప్పు చేసానో తెలియక ఎంతో కష్టమనిపించింది.

❖ ❖ ❖

వాసక్కతో గొడవ మూలంగా నా సంపాదన లేక ఇంట్లో కటకట లాడుతుంది. ఫ్యాక్టరీ యజమానిగారి ఇంట్లో నన్ను, చిన్నన్నయ్యని కొద్ది రోజులు పనిలోకి రానిచ్చారు. అక్కడ తోటపని, బయటపని, పిల్లల్ని ఆడించడము చేసాము. అలా నెల రోజులు కొలువు చేసాక జీతం తీసుకొని నేనూ, అన్నయ్యా ఇంటి ముఖం పట్టాము.

దారిలో అన్నయ్య టీ బడ్డీ దగ్గర ఆగి పకోడీ కొని పొట్లం కట్టించాడు.

“అక్కడ కూర్చుని తినడానికి స్థలం లేదుగా… అందుకే ఈ పాకెట్ కట్టించాను” అన్నాడు దారిలో.

వాడన్న ఆ మాటతో, ఒక్క క్షణం నా గుండె బయటకి ఎగిరి గంతేసింది.

'అవే పకోడీలు నేనూ చేసి బయట అరుగు మీద పెట్టి అమ్మవచ్చు కదా!' అని అనిపించిన ఆలోచనకి ఉక్కిరి బిక్కిరయ్యాను.

అన్నయ్యతో ఆ మాటే అన్నాను. నా తలంపుకి మెచ్చుకున్నాడు.

ఆఘమేఘాల మీద ఇంటికి వచ్చి నా ఆలోచన ముందుగా అవ్వ, అమ్మలతో చెప్పాను. నాన్నని అన్నయ్యలని కూడా ఒప్పించాను.

"సరేలే సెలవలేగా! ఇంకా రెండు నెలల వరకు ఫర్వాలేదు"

"ఇదిగో, మరి ఈ డబ్బు పెట్టి సరుకులు తెచ్చుకో" అంటూ ఓ వెయ్యి రూపాయలు ఇచ్చారు నాన్న.

శనగపప్పు వడలు, ఉప్మా, పకోడీలు, రవ్వకేసరి, టీతో మొదలు పెట్టాము మా కిచెన్ క్యాంటీన్.

ముందు రెండు వారాల వరకు మధ్యాహ్నం సరిగ్గా నాలుగ్గంటలకి చుట్టూ ఉన్న పైతరగతి కుటుంబాలకి, చదువుకునే కుర్రవాళ్లకి, టైప్ ఇన్‌స్టిట్యూట్‌లకి, చిన్నన్నయ్య సైకిల్ మీద వెళ్లి టిఫిన్ అందించేలా ఏర్పాటు చేసాము.

ఒక నెలయ్యేప్పటికి చుట్టుపక్కల చిన్న వ్యాపారాలు, ఇతర కుటుంబీకులు, అంతా మా అరుగుల ముందు బారులు తీరారు.

అవ్వ, అమ్మ కూడా సాయం చేయవలసి వచ్చింది. పాతబడి పడిపోబోతున్న వీధి వాకిలి వరకు, పది పాత బెంచీలు వేయించాడు అన్నయ్య.

చెట్టు క్రింది రామయ్య తాతకి, తప్పనిసరిగా కాస్త ఉప్మానో, కేసరో అందించే వారము. దిక్కులేని తాతకి చూపు కూడా లేదని బాధనిపించేది.

రెండు నెలలు ముగిసాక, లెక్క కడితే వెయ్యికి ఐదు వేలు వచ్చింది.

అంటే చేసిన పనికి నాలుగు వేలు ఆదాయమన్నమాట. డబ్బు సహాయ పడింది.

నాకు సంతోషం మిగిలింది.

❖ ❖ ❖

మొదలవ్వబోతున్న అన్నల డిగ్రీ చదువులు, పెరుగుతున్న ఖర్చులు తట్టుకోవా లంటే... నా అత్తెసరు మార్కుల చదువులు మానేసి, కాలేజీ క్యాంటీన్ లాంటి వ్యాపారం చేయడమే సరైనదన్న ఆలోచన ఒకవైపు. ఇంట్లోకి మధ్యాహ్నపు

టిఫిన్‌లే కాబట్టి... జంతికలు, పప్పుచెక్కలు పాకెట్లుగా పెట్టేసి, అమ్మ, అవ్వ మా ఇంటనే 'కిచెన్ క్యాంటీన్' చూసుకొనేలా ఉంచాలనేది మరోవైపు.

నాన్న పనిచేసే ఫ్యాక్టరీ యజమానిగారు కాలేజి స్థాపించిన వారిలో పెద్ద. కాలేజీ క్యాంటీన్ విషయంలో ఆయన్ని సాయం అడిగితే, నా క్కావలసిన అవకాశం తప్పక దొరుకుతుందని ఆశగా ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రలోకి జారుకున్నాను.

❖ ❖ ❖

తెల్లారుతూనే నాన్నకి ముందు నా ఆలోచన గురించి చెప్పి, క్యాంటీన్ విషయం కుదిరితే ఆయన క్కూడా ఆర్ధికంగా పరిస్థితి మెరుగవుతుందని వివరించాను. మిగతా వాళ్ళని ఒప్పించడం అంత కష్టమవ్వలేదు.

దేవుడుకి దణ్ణం పెట్టుకొని నాన్నతో పాటు అయ్యగారిని కలిసాను. దేవుడి దయ వల్ల సులభంగా ఆ పని కూడా అయింది. అంతే! ఇక వారం రోజుల పాటు కాలేజిలో మా కొత్త క్యాంటీన్ మొదలెట్టే పనుల్లో పడ్డాను.

❖ ❖ ❖

“ఎంతో కష్టపడుతున్నావే తల్లీ! నీ ఆలోచన, చేయూత వల్లే ఈ కుటుంబం ఇలాగైనా సాగుతుంది” అంటూ ఆ వారం రోజులు నా దగ్గర కూర్చుని నా కాళ్ళు పట్టేది అవ్వ.

“ఉన్నారు నలుగురు బడుద్దాయిలు... ఇంటి నిండా. దేనికీ పనికిరాని వెధవలు. నీతో చాకిరీ చేయించుకొని, నీ సంపాదన ఖర్చు చేస్తారే కాని, ఆడపిల్లవని కొంచెమైనా నీ మీద అపేక్ష ఉందా వాళ్లకి?” అంటూ వాపోయింది అవ్వ.

అప్పటి వరకు అలా నేను అస్సలు ఏనాడు అనుకోలేదు.

“అందరి మీద నాకు ప్రేమే! పోనిలే అవ్వా! అంతా నా వాళ్ళేగా...” అని ఆమెని బుజ్జగించి అవ్వ దగ్గరే పడుకున్నాను.

మరునాడే క్యాంటీన్ మొదలుపెట్టే రోజు.

చాల సంతోషంగా ఉంది. చిన్నన్నయ్య, నేను కలిసి పొద్దున్నే క్యాంటీన్ అంతా సర్దేసాము. సరిగ్గా ఎనిమిది కల్లా *'కాఫీ టిఫిన్ తయ్యార్!'* అన్న బోర్డు క్యాంటీన్ కిటికీన సర్దగానే బిలబిల మంటూ వచ్చేసారు కాలేజి చదువుల నా

వయసు అమ్మాయిలు, అబ్బాయిలు.

లొట్టలేస్తూ అడిగి అడిగి టిఫిన్లు, కాఫీ టీలు ఆరగించారు. అలా ప్రతి పూట అనుకొన్న దానికంటే, ఇష్టమయి తినే కస్టమర్స్‌తో పాటు రాబడి కూడా హెచ్చుగానే ఉంది. పొద్దున ఎనిమిది నుండి మధ్యాహ్నం మూడు వరకు కాలేజి క్యాంటీన్ పని, తరువాత ఇల్లు, లెక్కలు, మరుసటి రోజుకి తయారవడం నా దినచర్య అయింది.

క్యాంటీన్ ఓ పక్కగా గేటు లోపలకి ఉండడంతో రామయ్య తాతని, పెంపుడు కుక్క జానితో పాటు చెట్టు కింద నుంచి క్యాంటీన్ చూరు కిందకి మకాం మార్పించి, అప్పుడప్పుడు అవసరమైన వైద్యం చేయించే దాన్ని. అందరితో మాట్లాడుతూ తాత ఆనందంగా ఉండేవాడు. కాలేజి వాచ్‌మెన్ సాయంతో తాతకి వసతి బాగానే అమర్చ గలిగినందుకు తృప్తిగా ఉండేది.

❖ ❖ ❖

ఓ రోజు కాలేజీకి గబగబా నడుస్తున్నాను. అప్పట్లో అకారణంగా పోట్లాడిన పక్కింటి వంటల వాసక్క నాతో నడవడం మొదలెట్టింది.

తనే ముందుగా, "ఏమే కాశీ! బాగా వృద్ధిలో కొచ్చావు. కుటుంబం కోసం పాటు పడుతున్నావు. మీ ఇంట్లో నీ గురించి ఆలోచించరు. నువ్వే మంచివాడిని చూసుకొని పెళ్లి చేసుకోవే. మా బాబాయి కొడుకు... వాసు, అకౌంటెంట్. అందంగా పొడుగ్గా ఉంటాడు. నువ్వు 'ఊ' అంటే అయిపోతదే నీ పెళ్లి" అంది.

మారుమాట లేకుండా నడుస్తున్నాను. కాలేజి వచ్చేసింది.

వాసక్క వంక చూసి నవ్వేసి ఊరుకున్నాను.

"ఆలోచించి చెప్పు" అంటూ వాసక్క వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

క్యాంటీన్ రాబడి చలవతో అన్నయ్యలిద్దరు అయ్యారు టీచర్లు.

ఇంట పండుగలు, సందడులు. వరసగా, బేషుగ్గా అన్నల పెళ్ళిళ్ళు.

అవ్వ పట్టుబట్టి ఆ యేడు క్యాంటీన్‌కి నా పేరు పెట్టించింది. మరి క్యాంటీన్ ఇప్పుడు 'శ్రీ కాశీ అన్నపూర్ణ కాఫీ విలాస్' అయ్యింది.

నా మీద ఎంతో అపేక్ష అవ్వకి.

వయసు్స పైబడినా, ఆమె ఆరోగ్యం షుమారుగా ఉండేది. చుట్టుపక్కల ఆడవాళ్ళతో స్నేహాలు, కబుర్లు ఎప్పటిలా సాగిస్తూ కాలం గడిపేస్తుంది.

❖ ❖ ❖

తెల్లారితే ఆదివారం అనగా, అర్ధరాత్రి అవ్వ నన్ను నిద్ర లేపి, “నీ చేత్తో కాసిని టీ నీళ్ళు ఇవ్వమ్మా, ఛాతిలో మంటగా ఉంది” అంది.

టీ తాగేసి, కబుర్లు చెబుతూ నా పక్కనే పడుకొని నిద్ర పోయింది.

తెల్లారి, “అవ్వా!” అని చెయ్యేస్తే చల్లగా ఉన్న శరీరం తగిలింది.

పరిస్థితి అర్ధమయ్యి అవ్వ మీద వాలి, భోరుమని ఏడ్చాను. నేనంటే ప్రాణంగా ఉండే అవ్వ నన్నొదిలి పోయిందన్న బాధ, నన్ను బాగా కృంగదీసింది.

ఈ వార్త తెలిసిన మూడో రోజుకి చిన్నకాశీ పట్టణం నుండి ఇరవైయేళ్ళ తరువాత, అవ్వ చెల్లెలు శివమ్మ, తమ్ముడు సాంబయ్య తాత, వాళ్ళ మనవడిని తోడు తీసుకొని వచ్చారు.

అవ్వ పెద్దదినం చేసాము.

శివమ్మ, తాతయ్య వెళ్ళిపోయే ముందురోజు నా గదిలోకి వచ్చారు.

తల నిమిరి ఆప్యాయంగా మాట్లాడారు.

“వెళ్లి పోతుండాము కాశీ! ఎప్పుడన్నా మమ్మల్ని తలుచుకోవాలి నువ్వు” అన్నది అవ్వ. “నీ సొంతవారు కాకున్నా, అమ్మా నాన్నా అన్నయ్యలు అంటూ ఎంత ప్రేమగా ఉన్నావో కదా నువ్వు. అనాధవైనా తనకి దొరికిన పెన్నిధిలా భావించేది మీ అవ్వ నిన్ను. ఎంతైనా, గొప్ప పుణ్యాత్మురాలివే కాశీతల్లీ, నువ్వు” అన్న శివమ్మ మాటలు విని నేను స్తంభించి పోయాను.

వాళ్లు గది నుండి వెళ్లిపోయింది కూడా గమనించలేదు.

నా కాళ్ళ కింద నేల జారినట్టు మంచం మీద ఒరిగిపోయాను.

❖ ❖ ❖

మనసు్స మొద్దుబారి పోయింది. ఎలాగోలా ఓ రెండు రోజులు గడిచాయి.

అసలు నేనెవర్ని? నా ఉనికికి అర్ధం ఏమిటి? నేను అనాధనా? మరి ఈ కుటుంబం, తల్లీ తండ్రి అంతా ఎవరు? – నా ప్రశ్నలకు జవాబులు ఎవరు చెబుతారు? అసలేమిటిదంతా?

ఓ రోజు క్యాంటీన్ పని చిన్నన్నయ్యకి వొప్పజెప్పి నాన్న గదిలోకి వెళ్ళాను.

నాన్నని నా ప్రశ్నలతో నిలదీసాను.

ఆయన ముందు నిర్ఘాంతపోయినా, "నీకు ఇదంతా చెప్పవలసివస్తుందని అనుకోలేదు, సమయం ఇప్పటికి వచ్చిందన్నమాట" అంటూ మొదలెట్టారు.

ఆయన చెప్పిన విషయాలని బట్టి, అవ్వ కాకినాడ దగ్గర దక్షిణకాశి నివాసి అట. భర్త అనారోగ్యంవల్ల కన్నుమూయడంతో పొలము, పుట్రా కూడా కరిగి పోయి, ఆమె జీవనం భారమయిందట. కాకినాడ ఇవతల పెద్దెత్తు ఫ్యాక్టరీ నిర్మాణాలకి మూకుమ్మడిగా ఇతర పనివాళ్ళతో పాటు, అవ్వ కూడా వలస పోయిందట.

ఉప్పరి వాళ్ళ గుడిసెల్లో వుంటూ, ఫ్యాక్టరీ యజమాని ఇంట వంట చేస్తూ, పిల్లల్ని అడిస్తుండేదట అవ్వ.

రత్న అనే ఓ దిక్కులేని పదిహేనేళ్ళ అమ్మాయిని చేరదీసి, సొంత కూతురిలా చూసుకొనేదట కూడా!

ఆ మూడేళ్ళల్లో ఫ్యాక్టరీ యజమాని భార్యకి, వారి కుటుంబానికి సేవ చేస్తూ తన మంచితనంతో వాళ్లకి బాగా దగ్గరయిందట అవ్వ. యజమానిని అర్థించి, కొడుక్కి వాచ్‌మెన్ ఉద్యోగమే కాక, ఉండడానికి పక్కవీధిలోని ఓ పాత డాబా ఇల్లు కూడా ఇప్పించుకొందట. ఆ వెంటనే నాన్న అమ్మా, నలుగురు కొడుకులతో ఈ వూరికి వచ్చేశారట.

వాళ్ళు వచ్చేప్పటికే... అవ్వ పెంపుడు కూతురు రత్న, బిడ్డని కని పురిటిలోనే చనిపోయిందట. అనాథ అయిన ఆ పసిగుడ్డుని తనే పెంచుకొంటానని పట్టుబట్టి, 'కాశీ అన్నపూర్ణ' అని పేరుపెట్టుకొందట అవ్వ.

అవ్వ మాట ప్రకారమే  అనాథ 'కాశీ'ని, తమ పిల్లల్లో ఒకరిలా పెంచుకున్నారట నాన్న వాళ్ళు. ఆ కాశీయే నేను.

కథ ముగించి ఊపిరి తీసుకొన్నాడు నాన్న.

దు:ఖం ఆపుకుంటూ అక్కడి నుండి బయట పడ్డాను.

ఎలా అనుకోవాలో, ఏమనుకోవాలో తెలియని స్థితి. ముందే ఈ విషయం నాకు తెలుపనందుకు కోపం తెచ్చుకోవాలా? ఎవరి మీదా? నాన్న మీదా? ఎందుకు?  ఏమో!

అయోమయంలో కొద్ది రోజులు గడిపాను. అప్పుడైనా, ఇప్పుడైనా నేను

ఏమీ చేయలేని పరిస్థితే అని అర్థం చేసుకొని సర్దుకుపోను ప్రయత్నం చేసాను.

❖ ❖ ❖

రోజులు... నెలలు... సంవత్సరాలు గడుస్తున్నాయి.

మరో ఐదేళ్ళకి పెద్దవాళ్ళు అమరులయ్యారు.

అందరిలో చిన్నదాన్ని అయినా... అన్ని బాధ్యతలకి యింట పెద్ద నేనే అయ్యాను. నాన్న పోయాక మాత్రం, ఫ్యాక్టరీ నుండి మేనేజర్ గోపాలంగారు వచ్చి రెండు లక్షల రూపాయిలు ఇచ్చి, ఎప్పుడైనా ఏమైనా అవసరం ఉంటే తనని కలవమని చెప్పి వెళ్ళారు .

చిన్నన్నయ్య కూడా చదువు ముగించి, క్యాంటీన్ విషయంలో నాకు సాయం చేస్తూనే ఉన్నాడు. మళ్ళీ ఏడాదికి వాడిక్కూడా పెళ్లి చేసి, ఆ అమ్మాయిని ఇంటికి కాపురానికి తెచ్చాను. తరువాత ఆరు నెలలకి వాళ్ళు కాకినాడ వెళ్ళిపోయారు. చిన్నన్నయ్య నా గురించిగానీ, క్యాంటీన్ గురించిగానీ ఏమీ ఆలోచించలేదని అర్థమయ్యి మనస్సు చివుక్కుమంది.

❖ ❖ ❖

వయస్సు మళ్ళుతున్న రామయ్య తాతని... ఆరోగ్య పరంగా వసతులు, సేవలు అందించేలా మెరుగైన వృద్ధాశ్రమంలో చేర్పించాను. ప్రతి వారం వెళ్లి కొంత సమయం గడిపి వచ్చేదాని. ఆయన పెంపుడు కుక్క జాని నా దగ్గరే ఉంటోంది.

❖ ❖ ❖

కాలచక్రం ఆగదుగా!

నలభైయ్యో పడిలో పడ్డాను. పండగలకి, పుట్టిన రోజులకి వచ్చేవారు అన్నయ్యలు, పిల్లలు. డబ్బుకి కొదవ లేదు కనుక అందరికి కానుకలు, చీరలు, సారెలు పెట్టి పంపేదాన్ని. అన్నలంతా వారి కుటుంబాలతో దూరతీరాలకి తరలిపోయారు.

చాలా ఒంటరిదాన్నయ్యాను. కష్టంగానే అనిపిస్తోంది.

మనస్సు కూడా ఒక్కోసారి ఉదాసీనంగా అయిపోతుంది. నాకు ఎవ్వరూ లేనట్టు, నా అనుకున్న నా వారికి నా ధ్యాసే లేనట్టు అనిపించింది, దిగులేసింది.

❖ ❖ ❖

ఓ రోజు మేనేజర్ గోపాలంగారు ఇంటికి వచ్చారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా కూడా నాకు, మా కుటుంబానికి ఎంతో సహాయం చేసిన ఫ్యాక్టరీ యజమాని పరంధామయ్యగారి నుండి రాయబారం తెచ్చారు. యజమానిగారి తమ్ముడు యాభైఆరేళ్ళ శ్రీనివాస్‌గారితో నాకు వివాహం చేయాలని ఆ పెద్దాయన సంకల్పం అట.

శ్రీనివాస్‌గారికి భార్య పోయి చాల కాలం అయిందట. పిల్లలు లేరట. ఆయన జీవితం అంతా శిశుసంక్షేమ కార్యక్రమాలు చేబడుతూ, అనాధ ఆశ్రమం, వృద్ధాశ్రమం నడుపుతూ, మరెన్నో సంక్షేమ సంస్థలు స్థాపించే సన్నాహాల్లో ఉన్నారట. ఆయన ఆస్థులకి, సంక్షేమ కార్యక్రమాలకి, ఆశ్రమాలకి నేను వారసురాలనైతే బాగుంటుందని పెద్దాయన ఉద్దేశమట. నాలుగు వారాల తరువాత మళ్లీ వస్తాననీ, ఈలోగా అలోచించి ఓ మంచి నిర్ణయానికి రమ్మని చెప్పి వెళ్ళిపోయారు గోపాలంగారు.

ఆలోచనల్లో వారాలు గడిపాను.

మనస్సు, మెదడు అలిసి పోయేంత మటుకు సమాలోచించాను.

జరగవలసిన నా పెళ్లి గురించి, వివాహ జీవితాన్ని గురించి నేనేనాడు పెద్దగా ఊహించుకోలేదు.

పరంధామయ్యగారు పంపిన పెళ్లి సంబంధం కబురుతో ఇప్పుడు నలభైఐదో యేట ఆ విషయమై అలోచించుకొనే అవసరం వచ్చింది. అనాధ బాలలకు, వృద్ధులకు సేవ చేస్తూ వారి సంక్షేమానికి పాటుపడే అవకాశంగా మలుచుకోవచ్చు అనిపించింది.

అలా నా మనస్సు, నా ఆలోచనలు ఒకేలా సాగి నిర్ణయం తీసుకొన్నాయి.

❖ ❖ ❖

గోపాలంగారు అన్నట్టుగా నెలయ్యాక ఓ ఆదివారం సాయంత్రం ఇంటికి వచ్చారు.

నా నిర్ణయం తెలియజేశాను.

ఆ పైవారం, వివాహం జరిగి, ఇల్లాలినై, కోట్ల కధిపతినై, వెంటనే మా వృద్ధాశ్రమ, అనాధాశ్రమల బాధ్యతలు చేపట్టాను.

❖ ❖ ❖

ఆశ్రమ వృద్ధుల సేవలలో, అనాధ పిల్లల సంరక్షణలలో హాయిగా మొదలైంది నా జీవితంలో ఓ కొత్త అధ్యాయం. వారి జీవితాలలో ప్రతి పొద్దు వెలుగు నింపు సూర్యునితో పాటు, *'కాఫీ టిఫిన్ తయ్యార్! అంతా వచ్చి తినాలి త్వరగా!'* అంటూ డైనింగ్ హాల్ గంట కొడుతూ ద్వారం వద్ద నిలబడి, ఆనందంగా పిల్లల్ని ఆహ్వానిస్తాను.

చక్కగా తయారయి సరిగ్గా ఏడున్నరకి బారులు తీరి టిఫిన్ హాల్లోకి నడిచే చిన్నారులని చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది.

ఆ అనాధుల, అభాగ్యుల ఆకలి తీర్చగలగడమే నా జీవితానికి సార్ధకత అవడంతో పాటు, మా ఆశ్రమంలోనే చరమ దశలో ఉన్న రామయ్య తాతకి సేవ చేసుకొనే భాగ్యం కూడా నాకు దక్కినందుకు ఆ కాశీ అన్నపూర్ణమ్మకి వేయి నమస్కారాలు అర్పిస్తాను.

❖

*(నిస్స్వార్ధ కృషితో, ఇతరుల జీవితాలలో*
*శాంతిసంతోషాల వెలుగులు నింపిన*
*ఓ త్యాగమయి గాధ!)*




**నే**ను అమెరికా వచ్చి నాలుగేళ్ళయ్యింది.

అంటే తాతయ్యని చూసి నాలుగేళ్ళన్న మాట. ఆయన్ని చూడకుండా ఇంత కాలం ఉండడమిదే మొదటిసారి. హైదారాబాద్‌లో చదివినన్నాళ్ళు, వీలున్నప్పు డల్లా నేను ఊరు వెళ్లడమో, నా కిష్టమైనవన్నీ చేయించుకొని నన్ను చూడ్డానికి తాతయ్యా వాళ్ళు హైదారాబాద్ రావడమో జరిగేది. ఆరోగ్యరీత్యా జాగ్రత్తలు తీసుకోవలసి రావడంతో రాను రాను ప్రయాణాలు తగ్గించారాయన.

హ్యూస్టన్, టెక్సాస్‌లో కాలేజి అడ్మిషన్ వచ్చిన వెంటనే ఊరు వెళ్ళకుండానే అమెరికా వచ్చేశాను. స్కాలర్‌షిప్పుల సాయంతో, స్టూడెంట్‌గానే యూనివర్సిటీలో పనిచేస్తూ డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్నాను. వీలయినంత త్వరగా చదువు ముగించుకొని తిరిగి వెళ్లాలని ఆలోచన. ఇంకా రెండేళ్ళ చదువు మిగిలుంది.

"నువ్వు వెళ్లి చాలా కాలమయిందమ్మా. మా కందరికీ నిన్ను చూడాలనుంది తల్లీ! వీలుచూసుకొని కొన్నాళ్ళకైనా వొచ్చి వెళితే బాగుంటుంది" అన్నారు తాతయ్య ఫోన్లో.

మరో నెలకి ఫైనల్ ఎగ్జామ్స్ అవగానే మా డీన్ అనుమతి పొంది, ఈసారి సెలవలకి తాతయ్యని చూద్దామని వెంటనే బయలుదేరాను. ప్రయాణంలో నా ఆలోచనంతా తాతయ్య గురించే! నాకున్న పెద్దదిక్కు మరి తాతయ్యే! ఆయన ఉండడం వల్లే నా జీవితం ఇంత సాఫీగా ఉంది. నేను పెద్ద చదువులు చదవాలనే నన్ను మంచి జూనియర్ కాలేజీలో చేర్పించి హైదరాబాదులో మకాం పెట్టించారు తాతయ్య.

ఇక మా పల్లెటూరంటే కూడా నాకెంతో ఇష్టం. నాలుగేళ్ళ తరువాత మళ్లీ మా పల్లె అందచందాలు, ప్రత్యేకించి మా తోట నడుమ నా కోసం తాతయ్య ఏర్పరిచిన అందమైన వసతిని చూడబోతున్నాను. దాని చుట్టూ రంగురంగుల పూలతోట వేశారట. ఎప్పటికప్పుడు నా వసతిని నా రాక కోసం పొందిగ్గా అలంకరించి ఉంచుతున్నామని కూడా చెప్పారు తాతయ్య. అందుకే ఎప్పుడెప్పుడు ఇంటికి వెళతానా అని చాలా ఆత్రుతగా ఉంది.

❖ ❖ ❖

నన్ను చూడగానే తాతయ్య కన్నుల్లో కోటి దీపాలు వెలిగాయి. ఆయన కళ్ళ నుండి ఆనంద బాష్పాలు జలజలా రాలాయి.

"ఇదిగో అందరూ త్వరగా రండి, చిట్టితల్లి వచ్చేసింది" అంటూ ఇంట్లో వాళ్ళని కేకేశారు తాతయ్య.

అందరూ నన్ను అబ్బురంగా చూస్తూ ప్రేమతో ఆదరించారు. ఆ తరువాత నానమ్మ వంటలు, అత్తయ్య వడ్డనలు, అర్ధరాత్రి దాటేవరకు తాతయ్యతో కబుర్లు అయ్యాయి. తాతయ్యని చూడాలని అల్లాడిన నా మనస్సుకి, ఇల్లు చేరగానే

సేద తీరి తేలికయ్యింది. తాతయ్య హుషారుగా ఉండడం నాకు సంతోషమని పించింది.

"నాలుగేళ్ళల్లో ఎంత పెద్దదానివైపోయావే? అచ్చంగా రజనిలా ఉన్నావిప్పుడు" అంటూ అమ్మని తలుచుకుని, కంట తడి పెట్టింది నానమ్మ.

అత్తయ్య, మామయ్యా కూడా, "చాలా ఎదిగావమ్మా! నిన్ను చూస్తే మాకు ఎంతో గర్వంగా వుంది. చదువు ముగించుకొని త్వరగా తిరిగి రావాలి నువ్వు" అంటూ మురిసిపోయారు. అన్ని సంగుతులతో పాటు, పదిహేననేళ్ళ క్రితం కోయంబత్తూర్ వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో అనుకోని విధంగా చనిపోయిన అమ్మ నాన్నల్ని గుర్తు చేసుకొన్నాము.

అమ్మ, నాన్న పోయాక నాకు తల్లీ తండ్రీ తానే అయ్యాడు తాతయ్య. ఉన్నత విద్యల కోసం విదేశాలు పంపించి చదువుల సరస్వతివై రమ్మని కోరింది కూడా తాతయ్యే!

'అందుకే తాతయ్య మనసు తెలిసి మసులుకొని, నా ఉనికి ఆ గుండెల్లో తప్పక వెలుగించుకుంటాను' అనుకుంటూ మా తోట వైపు నడిచాను.

❖ ❖ ❖

ఇక పరీక్షలు, ప్రయాణాలు గురించిన ఆలోచనలు మానేసి నా ఊరి కౌగిలిలో తలదాచుకోబోతున్నాను. తారలు పొదిగిన నీలాకాశాన్ని చూస్తూ తోటలో ఆరుబయట మెత్తని పరుపులపై అలిసి సొలిసిన నేను ఆ రాత్రి హాయిగా నిద్రపోయాను.

❖ ❖ ❖

తొలి కోడి కూత నన్ను నిదుర లేపింది. చిరుగాలులు చక్కలిగింతలు పెట్టాయి. చుట్టూ చూస్తే పల్లె వాతావరణం ఎంతో హాయిగా ఆహ్లాదంగా ఉంది. ఓ క్షణం కళ్ళు మూసుకున్నాను. చిందులు వేస్తున్న మా పల్లె అందాల గురించి నా మనస్సులో చక్కని భావనలు పెల్లుబికాయి....

*తొలి పొద్దు పొడవగా, తెల తెల్లవారగా*
*నును లేత నీరెండ మేనంతా తాకగా*
*అప్పుడే విచ్చుకున్న గులాబీల సందడిలో*

సువాసనలు గుప్పిస్తూ సంపెంగె మొగ్గలు

కళ్ళు తెరచి, వళ్ళు విరిచి, పరికించి చూస్తే
ఆరుబయట ఆదమరిచి నిద్రోయే పాపలు
ఆమడ దూరాన పొగమంచు దారుల్లో
గొడ్డు గోదె మళ్లేసే ఊరి కుర్రకుంకలు

కూరగాయ గంపలతో నడిచేటి కాంతలు
వెనువెంటే కదులుతూ వయ్యారి గొల్లభామలు
ప్రతి లోగిలి ముంగిట, వెలిసే రంగవల్లులు
పల్లెటూరు ఆరబోసే రంగుల హరివిల్లులు...

అలా పకృతి అందాలని ఆస్వాదిస్తూ తెల్లారేంత వరకు గడిపాను.

తెల్లారగానే చందనచూర్ణం కలిపిన నలుగుల స్నానాలు చేయించింది అత్తయ్య. నానమ్మ చేసిన మీగడల ఆవుపాల పాయసాలు కడుపునిండా సేవించాను. పల్లె పకృతితో పాడాలనీ, చిందులాడాలనీ తుళ్ళుతూ తేలుతూ పల్లె దారుల్లోకి సాగిపోయాను. సర్కారి బడి పిల్లలతో కాసేపు కేరింతలాడాను. నాకెంతో ఇష్టమైన పెద్దమ్మ గుడిలో వరస దివ్వెలు పేర్చాను. అక్కడున్న ఆడంగులతో గళం కలిపి మంగళారతులు పాడాను. అయ్యవారు పంచిన తీర్థ ప్రసాదాలు భక్తితో తిన్నాను.

సేద తీర్చుకోవడానికి చెట్టు నీడన చేరగానే, బడి గంట గణగణతో బిలబిల మంటూ బయటికి దారితీసారు పిల్లవాళ్ళు. చింత చెంతనే చేరి కబుర్లు, ఫలహారాలు మొదలెట్టారు. ముచ్చటేసి వారితో కాసేపు నేనూ కలిసి పోయాను.

❖ ❖ ❖

నేనొచ్చిన రెండు వారాలకి నా ఇరవైయ్యొకటవ పుట్టినరోజు ఓ ఉత్సవంలా జరిపించారు తాతయ్య.

“ఇదిగో, మా కళ్యాణి పుట్టిన రోజు, ఎల్లుండి అంతా భోజనానికి వచ్చేయండి” అంటూ నానమ్మ, అత్తయ్య ఊరంతా పిలిచేసారు. పొద్దున్నే వేదపఠనం, అన్నదానం అయ్యాక, ఇరవైయొక్క మంది అడపిల్లలకి పట్టుపరికిణీలు, లక్ష్మి

కాసులు ఇప్పించారు తాతయ్య.

ఆ నెల రోజుల్లో నానమ్మ, అత్తయ్యలతో కలిసి ఎన్నో పూజలు, వ్రతాలు చేసాను.

మామయ్యకి పిల్లల్లేరు. నన్ను వారి సొంతబిడ్డలా భావిస్తారు.

మా మామిడి తోటల్లో ఓ వైపు ఎకరాల స్థలంలో అనాధాశ్రమం నడుపుతుంది అత్తయ్య. నేను అక్కడున్న నెల రోజులు అత్తయ్యకి సాయంగా ఆశ్రమంలో పిల్లలని ఆడించాను, చదివించాను.

అందమైన మా పల్లెసీమలో ఉన్నన్నాళ్ళు తాతయ్యతో ఆడుతూ పాడుతూ హాయిగా గడిపాను. మధురమైన అనుభూతులతో మనస్సు నింపుకొన్నాను. ఆ మరునాడే నా తిరుగు ప్రయాణం కావడంతో మరోసారి ఊరు చూద్దామని చెరువులు, కొలనులు, చేనేత పగ్గాలు సాయంత్రం వరకు తిరిగి అలిసిపోయాను.

చివరగా ఓసారి గుడిలోని గులాబి తోటలు చూడాలని అటుగా అడుగులు వేస్తున్న నాకు... గబుక్కున తాతయ్యతో బంతి భోజనాల మాట గుర్తొచ్చి పరుగు పరుగున కదిలి, ఇంటి దారి పట్టాను.

దారి పొడుగునా ఎంతో ప్రశాంతత. పురివిప్పిన నెమళ్లు, పావురాల కువ కువలు. నవ్వుతూ తుళ్ళుతూ తొక్కుడుబిళ్ళాడుతూ పరికిణీల పిల్లలు. పొలం పనులు ముగించుకుని సేదతీరుతూ వారి తలితండ్రులు. తెల్లారగానే చద్ది తిని, పొలం వెళ్లి చెమటోడ్చి శ్రమిస్తారు. నీతి నిజాయితీలకి పెట్టిందే పేరు వాళ్ళు. ఆ ఊరి తలపులతో, మలుపులు తిరుగుతూ కోవెల పక్కనే ఉన్న మా లోగిలి చేరాను.

❖ ❖ ❖

చిరునగవులతో ఎదురయ్యారు తాతయ్య.

"ఎందరి దిష్టి తగిలిందో?" అంటూ పసుపు నీళ్ళు తిప్పేసింది అత్తయ్య.

విస్తళ్ళు వేసి వడ్డనలు చేసింది నానమ్మ.

ముందుగా తాగమని వెండి గిన్నెలో పాయసమందించాడు మామయ్య.

మామయ్య, తాతయ్య ఊరికి పెత్తందార్లు. ఇన్నాళ్ళకి ఊరు వచ్చిన నన్ను ప్రేమలు, ఆప్యాయతల్లో ముంచెత్తుతున్నారు.

ముందు జరగబోయే పెళ్ళికంటూ కొత్త నగలు చేయిస్తున్నారు.

ముద్దు మురిపాలు, కోటి దీవెనలతో పాటు వందెకరాల మాగాణి నా పేరున రాయించారు.

నోటమాట లేక అవాక్కయ్యాను.

తాతయ్యని వద్దని వారించలేక పోయాను.

తాతయ్య కళ్ళ నుండి జలజలా కన్నీళ్లు, వ్యధ నిండిన మదితో, వణికే చేతులతో తల నిమురుతూ నా చేయి వదల్లేదు ఆ రోజు.

అంతటి వాత్సల్యానికి, నా అదృష్టానికి మనస్సులోనే దేవుడికి శతకోటి ప్రణామాలు చేసాను.

తెల్లారే లేచి పయనమయ్యాను.

బరువైన హృదయంతో అందరికీ వీడ్కోలు చెప్పాను.

తాతయ్య గదిలోకి ఆఖరున వెళ్ళాను.

పందిరి మంచం పైన నిర్జీవంగా ఒరిగున్న తాతయ్యని చూసాను.

నివ్వెరపోయి అయన దగ్గరికి పరుగు తీసాను.

బిగ్గరగా పిలుస్తూ తాతయ్యని కుదిపాను.

ఉలుకు పలుకు లేని తాతయ్యని చూసి భరించలేని దుఃఖంతో అల్లాడి పోయాను.

నాకు కొండంత అండగా ఉండే తాతయ్య ఇక లేడేమో నన్న తలంపుతో తల్లడిల్లి పోయాను.

ఇంతకాలం తరువాత పల్లెటూరికొచ్చి తాతయ్య ప్రేమలో మునిగి మురిసి పోయాను.

అంతలో ఈ దారుణం భరించలేకున్నాను.

గుండె తట్టుకోలేక రోదిస్తోంది. కాని గొంతు పెగలకుంది.

అంతా శూన్యంగా మారింది.

*"తాతయ్యా, నన్నొదిలిపోకయ్యా !!*

*నా కోసం రావయ్యా!!*

*ఎప్పటికీ నాకు నువ్వుండాలి తాతయ్యా!!*

*నీ దిక్కు నా కుండాలి తాతయ్యా!!..."* ❖

# ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్



**యో**గా క్లాసు నుండి వచ్చి, లంచ్ తినేసి, పేపర్ వర్క్ కూడా పూర్తిచేసుకుని, ఓ కునుకు తీయడం నాకు పరిపాటయింది. నా కునుకుని అప్పుడప్పుడు పాడు చేస్తూ ఎడతెరపి లేకుండా ఫోన్ మోగడం కూడా పరిపాటే!

ఆ రోజు లంచ్ తినబోతుంటే, ఆగకుండా మోగుతున్న ఫోన్ తీయక తప్పలేదు. “హలో” అన్నాను అసహనంగా.

అటు నుండి, “10–10–1962”, “అదే, అక్టోబర్ టెన్త్ 1962” – గంభీరంగా ఉన్నా, ఆడమనిషి గొంతే!

అది నా పుట్టిన తేది. ఫోన్ నెంబర్ చూస్తే న్యూయార్క్ నెంబర్. అనుమానం

వచ్చింది, ఒకవేళ కల్యాణి కాదు కదా! ఆమె అమెరికాలోనే ఉంటుంది ఎప్పటి నుంచో. కాని నా కసలు కళ్యాణి ఫోన్ చేసే ప్రశక్తే లేదే?

“టైం తీసుకో, గుర్తు వస్తానులే” మళ్ళీ అటునుండి ఫోన్లో గంభీరంగా ఆ గొంతు. ఫోన్ చేసి బర్త్‌డేట్ గుర్తుచేయడమంటే? – కళ్యాణి, నేను ఒకే రోజు పుట్టాము. అనుమానం అక్కరలేదు. తప్పక కళ్యాణి అయి ఉండాలి.

“ఎవరు? కళ్యాణీ” అన్నాను.

అటు నుండి ఉత్సాహంగా, “ఆ నేనే, కళ్యాణినే, నువ్వు బాగున్నావా? ఎంతో కష్టపడి నీ నెంబర్ సంపాదించాను” అంటూ మొదలైన సంభాషణ ఐదు నిముషాలన్నా సాగి, “మళ్ళీ ఫోన్ చేస్తానే” అన్న కళ్యాణి మాటతోనే ముగిసింది.

ఎంతోకాలంగా తనిప్పుడు న్యూయార్క్‌లో ఉన్నానని చెబుతూ, గత పాతిక సంవత్సరాలుగా తన జీవితంలో ఎన్నో అసాధారణ మలుపుల తరువాత ఇప్పు డిప్పుడే కాస్త తేరుకున్నానని వాపోవడం, వీలుచేసుకొని మా ఇంటికి వస్తానని అనడం, ఆ ఐదు నిముషాల సంభాషణ సారాంశం. నేనెక్కువ మాట్లాడలేదు. ఏమనాలో, ఎలా అనాలో తెలియక మిన్నకుండి పోయాను.

ఫోన్ పెట్టేసి కళ్యాణి గురించి ఆలోచనలో పడ్డాను. నా నెంబర్ దొరక పుచ్చుకోవడం అంత కష్టమా? ఏమో, ఎప్పుడు ఏమాట ఎందుకంటుందో అర్థం కాదుగా. అంతు పట్టని మనస్తత్వం కళ్యాణిది.

కళ్యాణి గురించి జ్ఞాపకాలు నన్ను చుట్టేసాయి. ఒకప్పటి నా చిన్ననాటి ఫ్రెండ్ కళ్యాణి. కనీసం ముప్ఫై సంవత్సరాలు అయ్యింది ఆమెని చూసి. అవును! సరిగ్గా ముప్ఫై సంవత్సరాల క్రితం, అప్పుడే పెళ్ళయి అమెరికా వచ్చిన నన్ను చూడ్డానికి, నెల రోజుల పసివాడితో ఫ్లొరిడా నుండి మా ఇంటికి వచ్చింది కళ్యాణి. నాలుగు రోజులు మా కొత్త సంసారపు ఆతిధ్యాన్ని స్వీకరించి, కనుమరుగై పోయిన వ్యక్తి కళ్యాణి. నా బాల్య స్నేహితురాలు, మా బంధువే సుమా!

ఆనాటి కలయిక తరువాత, వెనువెంటనే కళ్యాణి ఇండియాకి వెళ్ళి, అమ్మా వాళ్ళని కలిసి, నా గురించి ప్రస్తావించడం తెలుసు. అంతే! మళ్ళీ ఇప్పటివరకు, ఆమె సంగతే తెలియదు. కళ్యాణి గురించి ఏనాడూ అనలేదు, అనుకోలేదు. తలవలేదు, కలవలేదు. మా మధ్య ఎటువంటి కాంటాక్ట్ లేదు.

అలాంటిది, ఇన్నాళకు ఉన్నట్టుండి ఫోన్ చేసింది.

ఎలా స్పందించాలో తోచలేదు – ముప్ఫైఏళ్ల క్రితం ఆవిడ రాక నాలో చేదు జ్ఞాపకాలే మిగిల్చింది కనుక. అందుకే ఇప్పటి ఈ ఫోన్‌కాల్ నాలో కాస్త ఆశ్చర్యం, కాస్త సందేహం, మరికాస్త అనుమానం కలిగించి నన్ను ఆలోచనలో ముంచేసింది.

❖ ❖ ❖

*కల్యాణితో నలభై ఏళ్ళ నాటి నా చెలిమి ....*

కల్యాణి నా చిన్ననాటి ప్రాణస్నేహితురాలే! 7 నుండి 11 ఏళ్ళ వయస్సు వరకు మేము మంచి స్నేహతులం. జంటకవుల్లా కలసి తిరిగేవాళ్ళం. ఆటల్లో, చదువులో అన్నిటా నాకన్నా కాస్త ముందే ఉండేది కళ్యాణి. లెక్కల్లో మాత్రం నాకు అత్తెసరు మార్కులు, కల్యాణికి నూటికి నూటపది వచ్చేవి. అందరి మెప్పు పొందేది. కాని, నలుగురితో కలిసేది కాదు. నేను సంగీతం నేర్చుకోనేదాన్ని. నాకు కళ్యాణి అంటే అభిమానం ఉండేది. వాళ్ళింట్లో ఎంతో సమయం గడిపే దాన్ని. వాళ్ళమ్మ చేసే వంటలు కూడా ఇష్టమే! చిన్నప్పటి ఆ నాలుగేళ్ళ మా స్నేహం గురించి, నాలో మంచి అనుభవాలు, అనుభూతులే ఉన్నాయి. కల్యాణి లాంటి ఫ్రెండ్ నాకు మళ్ళీ ఉండదనిపించేది.

నా పన్నెండవ యేట నుండి, మా నాన్నగారి ఉద్యోగ బదిలీల రీత్యా, చాల సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్‌కి దూరంగా ఉండిపోయాము. కల్యాణిని చూడలేదు – అప్పుడప్పుడు కళ్యాణి వాళ్ళ గురించి, బంధువులు మాట్లాడుకునే సాధారణ విషయాలు వినడం తప్ప.

❖ ❖ ❖

మళ్ళీ నా పందొమ్మిదవ యేట, షుమారు ఎనిమిదేళ్ళ తరువాత, చూసాను నా స్నేహితురాలిని. నాన్న వ్యాపారం మొదలెట్టాక, అప్పటికే రెండేళ్లగా మేము హైదరాబాద్‌లో సెటిల్ అయ్యాము. కల్యాణిని తీసుకొని వాళ్ళ అమ్మ, అక్క హైదరాబాద్‌లో మా ఇంటికే వచ్చారు. ఆమెని పేరున్న సైకియాట్రిస్ట్ (మనస్తత్వ వేత్త)కి చూపించడానికట. మేము కాస్త ఆశ్చర్యపోయాము. కళ్యాణి పొడుగ్గా, చామనఛాయగా, అందంగా ఉంది. ముభావంగా ఉంది. మెడికల్ కాలేజీ సీట్ సునాయాసంగా వచ్చిందట కళ్యాణికి.

వచ్చిన రెండు రోజులకి గాని కాస్త మాట్లాడ్డం మొదలు పెట్టలేదు ఆమె.

ఓ సాయంత్రం, మేము టెర్రెస్ మీద కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుతుండగా, సైకియాట్రిస్ట్ వద్ద మరునాటి అపాయింట్మెంట్ తనకి కాస్త ఆదుర్దా కలిగిస్తుందని అన్నది కళ్యాణి.

"నేనిప్పుడు సెకండియర్ మెడిసిన్ చేస్తున్నాను తెలుసా?" అంది కళ్యాణి.

తెలుసన్నట్టు తలూపాను.

ఇంకా ఏమన్నా అడిగేటంత చనువుగాని, ధైర్యంగాని నాకు లేవు.

"మా లెక్చరర్, ఒకాయనతో నాకు స్నేహం – అంటే అఫ్ఫైర్ ఉంది. దానివల్ల తన వాళ్ళతో ఆయనకీ, మా ఇంట్లో వాళ్ళతో నాకూ గొడవలు. నేను ఎదురు తిరగడంతో ఏం చేయాలో తెలియక, నన్ను ఇక్కడికి తీసుకొచ్చారు. సైకియాట్రిస్ట్ని కన్సల్ట్ చేస్తున్నారు" అని కాసేపు నిశబ్దంగా ఉండిపోయింది.

ఏ మాత్రం సంకోచం లేకుండా నాకు చెప్పేసింది. అసలు ఇన్నాళ్ళ తరువాత కలసిన నాకు ఇవన్నీ చెప్పడం ఏమిటా అని నాకే ఇబ్బందిగా అనిపించింది.

మళ్ళీ తానే, "నాకేమన్నా భయమా? నాకు తెలిసి కావాలని అతనితో సంబంధం పెట్టుకొన్నాను. అతనికి పెళ్ళైంది. అయితే, ఈ విషయంలో సైకియా ట్రిస్ట్ ఏం చేయగలడు? బుద్ధులు చెబుతాడా?" అంటూ కోపంగా ఉండిపో యింది.

ఆ తరువాత, ఉన్న నాలుగు రోజులు అయిష్టంగా, నీరసంగా, అందరికీ దూరంగానే ఉంది కళ్యాణి. డాక్టర్ని కలిసి, అయన సలహా, కొన్ని మందులు ఏవో తీసుకొని అత్తయ్య వాళ్ళు కళ్యాణితో పాటు తిరిగి వెళ్ళిపోయారు.

❖ ❖ ❖

ఆ తరువాత మళ్ళీ మూడేళ్లకి, చెన్నై నుంచి ఎన్.ఆర్.ఐ. ఇంజినీర్ని పెళ్లి చేసుకొని, కల్యాణి అమెరికా వెళ్ళిపోయిందని విన్నాము. మెడిసిన్ మాత్రం అప్పటికి పూర్తిచేయలేదని అన్నారు.

అప్పటికి నేను శాస్త్రీయ సంగీత కళాకారిణిగా మంచి పేరు, గుర్తింపు తెచ్చుకున్నాను. తరువాత రెండేళ్ళకి, ఎం.ఎ. పూర్తిచేసి, ఉన్నట్టుండి ఊడిపడ్డ అమెరికా పెళ్ళికొడుకు నచ్చి, పెళ్లి చేసుకొని నేనూ అమెరికా చేరాను. అప్పటికి మా వారు న్యూయార్క్లో చదువు ముగించి, హ్యూస్టన్–టెక్సాస్లో ఉద్యోగంలో చేరారు.

❖ ❖ ❖

నాకు వివాహమయిందని తెలిసి, వివరాలు కనుక్కొని, నేను హ్యూస్టన్‌కి వచ్చాక ఫోన్ చేసింది కళ్యాణి.

"నిన్ను, మీ ఆయన్ని కలవాలని ఉంది... నిన్ను చూడాలని ఉంది... వచ్చే వారం వస్తాను" అంది ఒకింత ఆదుర్దాగా.

ఆశ్చర్యమేసింది. హైదరాబాద్‌లో పందొమ్మిదేళ్ళప్పుడు కలవడమే కళ్యాణిని. ఆ తరువాత నేను తన గురించి అలోచించిందీ లేదు, అడిగి తెలుసుకున్నదీ లేదు. అయినా ఇన్నాళ్ళ తరువాత కళ్యాణిని కలవబోవడం బాగానే ఉందను కున్నాను. వస్తే సరదాగా ఈ దేశపు విషయాలు కూడా కొంత తెలుసుకోవచ్చను కున్నాను.

❖ ❖ ❖

అప్పటికి నేను అమెరికా వచ్చి నెల రోజులయ్యింది. కొత్త జీవితం, కొత్త సంసారం, సరికొత్త ప్రపంచం. మా వారి పనికి దగ్గరిలో ఖరీదైన చక్కని సింగిల్ బెడ్రూం అపార్ట్‌మెంట్‌లో ఉన్నాము. నాకు నచ్చుతాయో లేదో అని కొద్ది వంటింటి సామాను, అవసరమైన ఫర్నిచర్ మాత్రం తీసుకొన్నారు మా వారు.

అన్న ప్రకారం మరో వారానికి ఫ్లోరిడా నుండి ఐదు వారాల పసిపిల్లవాడిని తీసుకొని వచ్చింది కళ్యాణి. తమ ఊళ్ళో అయితే బాబుతో టైం ఉండడం లేదని, మా ఊళ్ళో చాలా షాపింగ్ చేసింది. వంటింటి సామాను ఎంతో కొన్నది. మధ్యలో శని, ఆది వారాలు రావడంతో, రోజంతా షాపింగ్ చేసి బయట తినేవాళ్ళం. మిగతా రెండు రోజులు కూడా సాయంత్రాలు అదే విధంగా షాపింగ్, సరదాగా ఊరు తిరగడం చేసాము.

మా వారు వర్క్‌కి వెళ్ళాక, మా చిన్నప్పటి సంగతులు, చుట్టాల కబుర్లు చెప్పుకునే వాళ్ళం. కళ్యాణి బాబు పెద్దగా గొడవ చేసేవాడు కాదు. మాటల్లో ఓ రోజు, తను విన్నదానికి విరుద్ధంగా, మా వారు, మనిషి బాగున్నారనీ, మంచి వాడిలా కూడా ఉన్నారనీ అన్నది. అది మెచ్చుకోవడమే అని భావించాను.

తన భర్తకి మాత్రం,పెళ్ళికి మునుపు ఎవరో గర్ల్‌ఫ్రెండ్ ఉండేదని తనకి అనుమానమట. ఇలా ఎన్నో మాటలు, కోతలు, వింతలు, విశేషాలు చెప్పు

కున్నాము. నేనే ఎక్కువగా మాట్లాడానేమో! హాయిగా సంతోషంగా గడిపాము, ఆ నాలుగు రోజులు. మళ్ళీ వస్తాననీ, ఆలోగా వీలుంటే మేము ఫ్లోరిడా రావాలని మరీ మరీ చెప్పి, వచ్చిన ఐదవ రోజున తిరిగి వెళ్ళింది కళ్యాణి. దేశం కాని దేశాన ఓ ఫ్రెండ్లీగా ఉండగల కజిన్ దొరకడం ఆనందంగా అనిపించింది – అందునా నా చిన్ననాటి ప్రియ నేస్తం.

❖ ❖ ❖

ఇక్కడి నుంచి ఫ్లోరిడా తిరిగి వెళ్ళిన తరువాత మూడు రోజులకే, తాను బాబుతో ఇండియా వెళ్ళుతున్నానని ఫోన్ చేసింది కళ్యాణి. బాబుతో ప్రయాణం కదాని హైదరాబాద్‌లో దిగి రాజమండ్రి వెళ్ళేంత మటుకు అమ్మా వాళ్ళ దగ్గర ఉండేలా ఏర్పాటు చేసాను. అమ్మా వాళ్ళని కలిసి ఒకటిన్నర రోజులు వాళ్ళ దగ్గరే ఉందట. నా కొత్త కాపురం విశేషాలు వినడానికి మా ఇంటిల్లిపాది కళ్యాణి చుట్టూ చేరారట.

నేను అమెరికాలో అస్సలు బాగోలేనని, నా పరిస్థితి చాలా అన్యాయంగా ఉందనీ, ఇంటికి వచ్చిన తనకి కూడా సరైన ఆతిధ్యం ఇవ్వలేకపోయానని, ఇంట్లో కనీసపు సామాను కాని, వస్తువులు కాని లేవని, దౌర్భాగ్యపు స్థితిలోనే ఉన్నానని చెప్పిందట కళ్యాణి మా అమ్మా వాళ్ళతో.

మా వాళ్ళు బెంబేలెత్తిపోయి, చాల బాధపడి పోయారు.

“అదంతా అబద్ధం. నేను సంతోషంగా ఉన్నాను… బాగున్నాను” అని అతి కష్టం మీద వాళ్లకి సర్ది చెప్పగలిగాను.

మరి కళ్యాణి అలా ఎందుకు చెప్పిందో అర్ధం కాలేదు.

అయినా అంతటితో ఆ సంగతి వదిలేసాను.

❖ ❖ ❖

కొంత కాలానికి మూడు నెలల మా బాబుని తీసుకొని నేను హైదరాబాద్ వెళ్లాను. ఓ రోజు పొద్దునే నేను బాబుకి పాలు కలుపుతుంటే, వంటమనిషి మణమ్మ సానుభూతిగా, “ఏమ్మా, ఉమమ్మా! మరి బాబుని తీసుకొని వచ్చేశావు కదా! ఇక్కడే ఉండిపో తల్లీ. పాపం ఆ దేశం కాని దేశంలో డబ్బు లేక బాధపడు తున్నావట. ఇంట్లో గిన్నెలు, సామాను కూడా లేవట కదా! ఎంత అన్యాయం… ఇక్కడ మహారాణిలా పెరిగిన నువ్వు ఎంత కష్టపడుతున్నావోనని నిన్ను

తలుచుకోని రోజు లేదనుకో తల్లీ" అంటూ కంట తడి పెట్టుకుంది.

నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. ఆమెకి చెప్పినా అనుమానపడుతూనే ఉంటుంది. లాభం లేదనిపించింది. అస్సలు కళ్యాణికి ఏమి పని ఇలా మాట్లాడ్డం ... నేనేం చేసాను దాన్ని? అని కాసేపు తిట్టుకొని, ఆ తరువాత మెల్లగా ఆమె విషయం మర్చిపోయాను.

❖ ❖ ❖

కళ్యాణితో నా గతాన్ని నెమరు వేసుకుంటే ఒకింత ఆసక్తిగానే ఉంటుంది. ఇన్నాళ్ళ తరువాత – ముప్పైఏళ్ళ తరువాత – ఈ ఫోన్ చేయడం ఎందుకో అర్థం అవ్వక కొంచెం ఆదుర్దాగానే ఉంది నాకు.

ఇంతలో మ్యూజిక్ నేర్చుకునే పిల్లల రాకతో, నా ఆలోచనకి బ్రేక్ పడింది.

అప్పుడే సాయంత్రం అయిందన్నమాట.

క్లాస్ ముగించుకొని లోనికి వస్తుండగా మా వారు కూడా ఆఫీస్ నుండి అప్పుడే వచ్చారు. భోజనం పెడుతూ, వింతైన విశేషం అంటూ, కళ్యాణి ఫోన్ గురించి, జరిగిన సంభాషణ సారాంశం చెప్పాను.

ఆయన ఎప్పటిలా, *'తస్మాత్ జాగత్త!'* అనే ధోరణిలో, "మనుషుల మనస్తత్వాలు అర్థం అయ్యాకైనా కాస్త జాగ్రత్తగా మసులుకోవలసిన అవసరం ఉంది. లేదంటే మళ్లీ బాధ పడాల్సివస్తుంది" అంటూ హెచ్చరించారు.

❖ ❖ ❖

అన్నమయ్య ఉత్సవాలు దగ్గర పడడం వల్ల నా పాట ప్రాక్టీసు, మ్యూజిక్ క్లాసులతో తీరిక లేకుండా అయిపోయాను. ఐదు నెలల తరువాత కళ్యాణి మళ్ళీ ఫోన్ చేసేంత వరకు ఆమె విషయం గుర్తే లేదు. వాళ్ళబ్బాయిని తీసుకొని ఓ వారం ఉండేలా వస్తున్నానంటూ ఫ్లైట్ సమాచారమంతా ఇచ్చింది.

కళ్యాణిది ఇంకా అదే పద్ధతి అనుకున్నాను. మాకు ఆ వారం వీలేనా అని కూడా అడగలేదు. ఏమయినా, తనకి రావాలని ఉత్సాహంగా ఉందని అర్థమయి, స్నేహభావమే ఉంచుకున్నాను నా మనసులో.

❖ ❖ ❖

అన్నమయ్య ఉత్సవాలు చక్కగా జరిగాయి.

ఆ మరునాడే వచ్చారు కళ్యాణి, కొడుకు శ్రీకాంత్. ముప్పై యేళ్ళ కొడుకు.

అంగవైకల్యంతో ఏర్పడిన, కొంత లెర్నింగ్ డిసెబిలిటి(భౌతిక మానసిక వైకల్యం) వల్ల, ఎప్పుడూ తన వెన్నంటే ఉంటాడని చెప్పింది. ముప్పైయేళ్ళ ఆ యువకుని మానసిక ఎదుగుదల పన్నెండేళ్ళ అబ్బాయిలా ఉంటుందట. శారీరకంగా బాగానే ఆరోగ్యంగా ఉన్నాడు.

శ్రీకాంత్‌ని చూశాక, నా మనసులో చాలా బాధ పడ్డాను. కళ్యాణి మీద ఎంతో జాలి కలిగింది. 'ఆ తల్లి మనసు కొడుకు విషయంలో ఎంత కుమిలి పోతుందో కదా!' అనుకున్నాను. అందుకే, ఎటువంటి కోపతాపాలు, అలకలు పెట్టుకోకుండా, వారం రోజుల పాటు కళ్యాణి వాళ్ళతో కలసిపోయి బాగానే గడిపాము నేను, మా వారు కూడా.

కళ్యాణి వెళ్ళిపోయాక, గతంలో మా మధ్య జరిగినది, కళ్యాణి నా గురించి అప్పట్లో మా అమ్మ వాళ్ళతో అన్న మాటలు ఇక ఎప్పటికీ మరచిపోవాలని నిశ్చయించుకొన్నాను. ఫ్రెండ్లీగా ఆప్యాయంగానే ఉండాలని కూడా అనుకొన్నాను. అదే ఆలోచనతో నేను కూడా కొన్నాళ్ళకి న్యూయార్క్‌లో కళ్యాణి వాళ్ళింటికి వెళ్లాను.

కళ్యాణి ఇల్లు వాకిలి ఎంతో పొందిగ్గా, వీలుగా ఉన్నాయి. వాళ్ళబ్బాయిని చూసుకోడానికి రోజంతా ఓ మనిషి ఉండేలా, అన్నీ చక్కగా అమర్చుకుంది.

❖ ❖ ❖

నేను తిరిగి వచ్చాక, రెండు రోజులకోసారి ఫోన్ చేసేది. ఎక్కువగా బాధపడు తుండేది, భయపడుతుండేది. వాళ్ళాయనతో ఇరవైయేళ్ల క్రితం విడాకులు తీసు కున్నప్పటి నుండి, పిల్లవాడి భాధ్యత కూడా తానే తీసుకొని ఒంటరిగా బతుకు పోరాటం సాగించానంటూ ఎంతో మధనపడేది. విడాకుల విషయంలో కూడా, పోలిస్ కలగజేసుకోవలసి రావడం, కోర్ట్ చుట్టూ తెగ తిరగవలసి రావడమే కాక, భర్తని వదిలించుకోడానికి తానే ఇల్లు, డబ్బు ఇవ్వవలసి వచ్చిందని చెప్పి వాపోయేది.

నేనూ సానుభూతితో వినేదాన్ని.

❖ ❖ ❖

అలా మరో ఆరు నెలలు గడిచింది. తన ఒంటరితనం పోవాలంటే, ఉద్యోగం చూసుకొని మా ఊరికి, నాకు దగ్గరగా ఉండేలా వస్తానంది. జాలేసింది. ఆమెని

పోత్సహించాను. కళ్యాణి కోసం నా వంతు పయత్నాలు ముమ్మరం చేసాను. మా వారు కూడా వైద్య వృత్తిలో ఉండడంతో, కళ్యాణి ఉద్యోగ అవకాశాల గురించి వాకబు చేసి ఇన్ఫర్మేషన్ సేకరించి కళ్యాణికి అందించాము. అయితే, ఓ పక్క రోజుకు పదిసార్లు ఫోన్లో మాట్లాడుతున్నా, ఎంత ఉత్సాహపరచినా కళ్యాణిలో వేగంగా అసహనం పెరిగిపోవడం గమనించాను.

'నేనసలు ఇక్కడ ఉండలేను' అని గబుక్కున ఒకరోజు ఉద్యోగానికి రాజీనామా కూడా చేసింది. నాకు దగ్గరిలో తనకి ఓ మంచి ఏరియాలో అద్దెకి ఇల్లు చూడమంది. అన్ని వసతులు ఉన్న ఇంటికి అడ్వాన్స్ నేనే కట్టేసి, అగ్రిమెంట్ పంపాను. మా ఉద్యోగ ప్రయత్నాలు ఫలించి మంచి మెడికల్ గ్రూపు నుండి ఇంటర్వ్యూకి పిలుపు, వెనువెంటనే హాస్పిటల్ ఇంటర్నిస్ట్‌గా కళ్యాణికి ఉద్యోగం కూడా వచ్చింది.

పరిపాటిగా అర్ధరాత్రి ఫోన్ చేసేది కళ్యాణి. తన ఇక్కట్లు, తన కష్టాలు, చెబుతూ కుర్చోబెట్టడంతో, మా వారు తన పడక, నివాసం మేడ మీదకి మార్చే సారు. ఆయన ఇబ్బంది నాకు బాధగానే ఉంది. నాతో మాట్లాడందే అడుగు తీసి అడుగు వేయను అన్నట్టుగా అయిపోయింది కల్యాణి. ఒక్కోసారి ఆశ్చర్య మేసేది. నాకో వ్యసనంగా మారింది 'ప్రాజెక్ట్ కళ్యాణి' అంటూ నవ్వుతూనే చిరాకు పడేవారు మా వారు.

ఉద్యోగం ఖాయం అవడంతో, సొంత ఇల్లు కావాలంది కళ్యాణి.

మళ్లీ ఇంటి వేట మొదలు పెట్టాను. ఓ నెల రోజులకి వర్క్‌కి దగ్గరగా ఉన్న హోం మాడల్స్ లిస్టు పంపాను. అందుండి ఓ విస్తారమైన, ఆధునిక, ఖరీదైన లోగిలినే కొనుగోలు చేసింది కళ్యాణి.

తానింకా చక్కబెట్టవలసిన పనులుండడం వల్ల, "న్యూయార్క్ నుండి రాలేను. నువ్వే డిసైడ్ చేసేసి అడ్వాన్సు ఇచ్చేయి" అంది కల్యాణి.

వేరే దారి లేక అలాగే చేసాను.

"లోన్ తీసుకోదలచుకోలేదు, ఇంటికి క్యాష్ పేమెంట్ చేస్తాను" అంది కళ్యాణి.

తన పాత వజ్రాలు, బంగారు నగలు అమ్మిపెట్టమంటే, అలాగే చేసాను.

ఒక్కటే రోజు ఊరు నుండి వచ్చి, ఇంటి రిజిస్ట్రేషన్ ముగించుకొని తిరిగి వెళ్ళి పోయింది.

❖ ❖ ❖

అలా అంతగా నా జీవితంలోకి, నా మనస్సులోకి చొచ్చుకుపోయింది కళ్యాణి. నా ఆలోచన, సాలోచన లెప్పుడూ కల్యాణి బాగు కోసం, కళ్యాణి మనుగడ కోసమే సాగాయి కొద్దికాలం. ఆమెకి అన్నీ సమకూరాలన్న తపనతో, నేనే, తన ఇంటికి అలారం సిస్టం, గార్డెన్, ఫోన్ కనెక్షన్స్, టివి కేబిల్, గట్టర్స్ లాంటివి కళ్యాణి రాక ముందే రెడీ చేశాను.

నా ద్వారా ఇల్లు కొనుగోలు చేయడం వల్ల, రిఫరెన్స్ ఫీజు రెండు వేల (2,000) డాలర్లు నా వాటాగా అందించారు రియాలిటీ వారు.

ఆ డబ్బు కూడా కల్యాణికే ఇచ్చేసాను.

❖ ❖ ❖

మొత్తానికి మహా బేషుగ్గా కల్యాణి సెటిల్ అయ్యింది. ఎంతో గర్వంగా ఉంది. బేలగా, నిస్సహాయంగా, ఒంటరితనంతో బాధపడుతున్న తోటి స్త్రీకి సహాయ పడగలిగినందుకు తృప్తిగా ఉంది. ఉద్యోగం కూడా చాలా నచ్చింది కల్యాణికి. గృహప్రవేశం చెయ్యాలని ఆలోచించాము. మొదట్లో శ్రీకాంత్ నా దగ్గరే ఉండేవాడు. ఆ తరువాత కొద్ది రోజులు వాడికి నచ్చేలా వంటకాలు చేసి, కల్యాణికి వీలుగా ఉండేలా వాళ్ళ ఫ్రిడ్జ్‌లో పెట్టేదాన్ని.

❖ ❖ ❖

పని వొత్తిడి వల్ల ఫోన్ చేసే తీరిక లేకుండా పోయిందని బాధ పడుతూ, ఇ–మెయిల్ పంపింది ఓసారి కల్యాణి. ఫర్వాలేదన్నాను. రెండేళ్లగా కల్యాణి విషయం ఓ యజ్ఞంలా చేసిన నాకూ కాస్త రిలీఫ్, విశ్రాంతి దొరికినట్టయింది. మా అబ్బాయి వాషింగ్టన్లో 'లా' చదువుతున్నాడు. అప్పుడప్పుడు వచ్చి వెళుతుం టాడు. కొద్ది రోజులు వాడి దగ్గరికీ, ఇండియాకి కూడా వెళ్లాలని అనుకున్నాను.

❖ ❖ ❖

కళ్యాణి ఇంట, నేనమర్చిన సామాను, ముందస్తుగా ఇంటి విషయంలో నేను డిపాజిట్ పెట్టిన మొత్తం కలిపి ఐదు వేల డాలర్లకి పైచిలుకే ఉంది. ఉద్యోగంలో సెటిల్ అవ్వనీలే, అని వెంటనే తిరిగి ఇవ్వమని అడగలేదు.

❖ ❖ ❖

ఓ సాయంత్రం నా ఫ్రెండ్ ఇందిర ఫోన్ చేసింది. కల్యాణి ఇంట జరిగిన

గృహప్రవేశంకి మేమెందుకు రాలేదని అడిగింది. ఇందిర భర్త కార్డియాలజిస్ట్. కళ్యాణి పనిచేసే హాస్పిటల్లోనే పని చేస్తారు. కల్యాణి ఆహ్వానంపై వెళ్ళారట. గృహప్రవేశంకి ఇరవై భారతీయ కుటుంబాలు వచ్చాయిట. బాగా జరిగిందని చెప్పింది.

❖ ❖ ❖

ఆ తరువాతి వారం, ఓ రోజు పొద్దున్న పది గంటలప్పుడు ఫోన్ చేసింది కల్యాణి.

ఎలా ఉన్నావని అడుగుతూ, "నాకు మాట్లాడ బుద్ధి కావడం లేదు" అంది.

నా కాళ్ళ కింద భూమి జారినట్టయింది.

"ఒంట్లో బాగోలేదా?" అడిగాను.

"ఫోన్ ఎత్తి మాట్లాడాలని కూడా అనిపించడం లేదు" అంది.

బుద్ధి తెలియని పసిపిల్లలా ఆ మాటలు ఆమె నోట... విస్మయం చెందాను. ఏమనగలను?

"అంత అలసటగా, విసుగ్గా ఉంటే, అలాగే, ఏముంది? మాట్లాడకు" అన్నాను.

"అయితే నీ అడ్రెస్ ఇస్తే, నీకు పంపవలసిన చెక్ పోస్ట్‌లో వేస్తాను" అంది.

❖ ❖ ❖

మ్యూజిక్ క్లాసు ముగించుకుని లోనికి వచ్చి లంచ్ పెట్టుకొని కూర్చున్నాను. అప్పటికే భోంచేసి, పేపర్ చదువుతున్న మా వారు ఉన్నట్టుండి సోఫా నుండి బయటకి పడినంత పని చేసారు. ఆ తరువాత అయన చెప్పిన విషయం విని, కుర్చీ నుండి కిందపడటం నా వంతయింది.

"షాకింగ్ న్యూస్..." అని చదివారు మా వారు.

"న్యూయార్క్ పోలీస్, ఎఫ్.బి.ఐ.శాఖ కలిసి పన్నెండుమంది భారతీయ వైద్యులని, మెడికేర్ ఫ్రాడ్ గావించిన వారిగా గుర్తించి, మోసపూరితంగా ప్రభుత్వాన్ని కొన్ని మిలియన్స్‌కి నష్టపరచినందుకు, దగాచేసినందుకు, త్వరలో అరెస్ట్ చేసి కస్టడీలోకి తీసుకుంటారు" అని హెడ్ లైన్స్ న్యూస్.

ఆ పన్నెండు మంది వైద్యుల్లో మూడవ పేరు... డాక్టర్౹౹ కల్యాణి కులశేఖర!

అవాక్కయ్యాను. ఆ న్యూస్‌లోని ఒక డాక్టర్... మా కల్యాణి.

కళ్యాణి గురించి అనుకొని కూడా మూడు నెల్లవుతుంది. ఇంతలో ఈ వార్త?

అస్సలు ఏమీ తోచలేదు నాకు.

❖ ❖ ❖


ఊహించని సంఘటనలతో నిండినదే జీవితమా? ఔననే అంటాను. ఓ సగటు మనిషి నిత్య జీవనస్రవంతిలో అనుకోని వ్యక్తుల ఆగమానాలు, ఊహించని కొందరి నిష్క్రమణలు, నేర్చుకొనే గుణపాఠాలు, ఎదుర్కొనే అనుభవాలు, నిరాశలు ప్రతినిత్యం చోటుచేసుకొనేవే! అయినా ఈ సంఘటనలు, వాటి పర్యవసానాలు, జీవితాన్ని తప్పక ప్రభావితం చేస్తాయి. ఒక్కోసారి మాయని, చెరగని ముద్ర వేస్తాయి కూడా!

పరిచయాలు, స్నేహాలు, చుట్టరికాలు కూడా సప్తసముద్రాల్ని దాటి దూర తీరాల చేరగానే, స్వరూపాన్ని మార్చి కొంగ్రొత్త రూపాన్ని ఆపాదించుకుంటాయి. పురోగతి, ప్రగతి మనలోని ఆంతరంగిక సహజత్వాన్ని, గుణగణాల్ని అనుసరిస్తాయేగాని, అధిగమించవు.

*'ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్, ఇజ్ ఎ ఫ్రెండ్ ఇండీడ్'* అనే నానుడి నా కిష్టం. ఫాలో అవ్వాలని పయత్నిస్తాను. ఆ విధానంలో కొన్ని పాఠాలు నేర్చుకోవడం, మరికొన్ని అనుభవాలు పొందడం తప్పదుగా!

కళ్యాణితో ఈ రెండేళ్ళ స్నేహం, అనుభవం, మరో జన్మకి క్కూడా సరిపడా పాఠం నేర్పింది నాకు.

❖




ఎవరో గట్టిగా తట్టి లేపుతున్నారు.

కళ్ళు నులుముకొని లేచాను. ఎదురుగా ఓ అమెరికన్. పెద్దాయనే!

అర్థం కాలేదు. చుట్టూ చూశాను.

మా ఇంటి దగ్గర పార్క్‌లో ఓ చెట్టు కింద, బెంచ్ మీద ఉన్నాను.

'జాక్ ఇన్ ద బాక్స్' యూనిఫారంలో ఉన్నాను.

ఏమైనట్టు? పనికి బయలుదేరడం గుర్తుందే! మరి ఇక్కడున్నానేమిటి? – అయోమయంగా ఉంది. టైం చూస్తే 1:00 అయ్యింది. ఎండగా కూడా ఉంది.

ఆ పెద్దాయన వాటర్ బాటిల్ ఇచ్చాడు.

కాసిన్ని తాగి, లేచి నిలబడ్డాను. తల తిరిగినట్టయింది.

నేను పని చేసే 'జాక్ ఇన్ ద బాక్స్'కి రైడ్ అడిగాను.

నాతో పాటు రెస్టారెంట్ లోనికి వచ్చాడు ఆయన.

నన్ను చూస్తూనే తార, డేవిడ్ ఆశ్చర్యపోయారు.

"రెండు రోజులుగా ఏమయిపోయావు రేణు?" అన్నారు ఆదుర్దాగా.

నాకేమీ తెలియలేదు. ఏమి చెప్పాలో అర్థం కాలేదు.

నాకు రైడ్ ఇచ్చినాయన 'టేక్ కేర్' అని చెప్పి వెళ్ళిపోయాడు.

జేబు నుండి ఫోన్, వాలెట్ తీసి చూశాను. తార నుండి, లెక్కలేనన్ని మిస్ కాల్స్ ఉన్నాయి. తార, డేవిడ్ వాళ్ళ మాటలని బట్టి, ఏమి జరిగుంటుందో అర్థమయ్యింది. కాని వాళ్ళతో ఏమీ అనకుండా, వొళ్ళు బాగోక ఇంట్లో ఉండి పోయాను, తలపోటు వల్ల, ఫోన్ వినిపించి ఉండదని అన్నాను.

"పెద్ద జబ్బుపడి లేచిన దానిలా వున్నావు. అసలేమైంది నీకు? నాకైనా చెప్పు రేణు, ప్లీజ్!" అంది తార నాతో.

ముభావంగా ఉండిపోయాను.

ఏడాది క్రితం మా ఆయన చనిపోయినప్పటి నుండి, పుట్టెడు ధుఃఖంతో పాటు, తలపోట్లు, ఉన్నట్టుండి మతిలేనట్టుగా అయిపోవడం, పరిసరాలు కూడా తెలియనంతగా మనసు స్థంభించి పోవడం పరిపాటయిందని తారకి ఇదివరలో చెప్పినట్టు గుర్తే!

కాసేపటికి రైడ్ తీసుకొని ఇల్లు చేరాను.

ఆలోచిస్తే అర్థమయింది – ఇంటి నుండి ఎప్పుడు వెళ్ళానోగాని, మతిలేని స్థితిలో ఇంటి పరిసరాల్లోనే తిరిగి, ఆ పార్క్ బెంచ్ మీద చేరానన్నమాట.

వెంటనే తారకి ఫోన్ చేసి విషయమంతా చెప్పాను.

మరునాడు తానే డాక్టర్ దగ్గరికి తీసుకొని వెళ్ళింది.

అన్ని పరీక్షలు చేసి, 'డిమెన్షియా వ్యాధి' అని తేల్చారు. మూడు, నాలుగు సంవత్సరాలుగా సూక్ష్మంగానైనా 'మతిలేనితనం', 'మరుపు' ఉండుండాలి అన్నారు. కొంతైనా వేరొకరి పర్యవేక్షణలో ఉంటే మంచిదన్నారు. మా అబ్బాయిలకి ఫోన్ చేసి, "రేపు శనివారం. మీ ఇద్దరు తప్పక ఇంటికి రండి. మీతో మీ అమ్మ ఆరోగ్యం గురించి మాట్లాడాలి. మమ్మీకి తన సంగతి ఏమీ

అర్థం కాలేదు – కాబట్టి మనం రేపు కలిసినప్పుడు వివరిస్తాను" అని వాళ్లకి చెప్పింది తార.

❖ ❖ ❖

రామ్, నేను, భరత్ కూర్చుని, డాక్టర్ రిపోర్ట్ అంతా విన్నాము, తార మాటల్లో.

"ఇకనుంచైనా వీలయినన్నిసార్లు వచ్చి అమ్మని చూడాలి మీరు. ఆమెకి ఇంకెవరున్నారు? మేము బయట వారమేకదా! ఆమె ఇబ్బందులన్నీ మీరు తీర్చ గలిగినవే!" అంది తార నా కొడుకులిద్దరితో.

వాళ్ళ ఎదుటే, నాతో మెడికైడ్ పేపర్ మీద సంతకం చేయించింది.

డాక్టర్ విజిట్ తరువాత ఓ ఆరు నెలలేమో, తార, డేవిడ్, జోసెఫ్ నన్ను ఓ పసిబిడ్డలా చూశారు. ఒక్కో రోజు జోసెఫ్ నన్ను తీసుకెళ్ళి రెస్టారెంట్ కౌంటర్‌లో కూర్చోబెట్టేవాడు. నాకు పెద్దగా పనిచేయబుద్ధి అయ్యేది కాదు.

డాక్టర్ చెకప్‌కి తార తీసుకెళ్ళేది. కార్ డ్రైవ్ చేయనిచ్చేవారు కాదు నా 'జాక్ ఇన్ ద బాక్స్' కుటుంబం. నా పాత కారు అమ్మేసి నా అకౌంట్‌లో నాలుగు వేలు వేసింది తార. నా డబ్బు వ్యవహారాలన్నీ చూసేది. వివరాలు నాకు చెప్పేది.

నాతో ఓ సారి, "ఈ ఆరు నెల్లల్లో నీ కొడుకులు నెలకోసారన్నా వచ్చారా? పిచ్చిదానా! పెన్షన్ మీదే నీ జీవితం సాగుతుంది, తెలుసా?" అంది తార.

"నువ్వే నాకు అన్నీ తార" అన్నాను.

తార కోసం, అప్పుడప్పుడు నాకు చేతనయిన వంట చేస్తుండేదాన్ని.

❖ ❖ ❖

## ఆరు నెలల తరువాత సంఘటన :

"ఏంటి రేణు! ఇలా నైట్ డ్రెస్‌లో రోడ్డు మీద తిరగడం? మొన్న కూడా అంతే!" అంటూ నాపై విసుక్కొని, నా అపార్ట్‌మెంట్‌లోనికి నడిపించి సోఫా మీద కూర్చోబెట్టింది. అంతలోనే మళ్ళీ నన్ను సవరదీసి, "కాసేపట్లో వస్తా, నువ్వు విశ్రాంతి తీసుకో" అని నన్ను లోపలుంచి, ఈసారి బయట నుంచి తాళం వేసుకొని వెళ్ళింది తార.

నేనేమి చేసానో, ఎందుకు తార కోప్పడిందో తెలియలేదు. వెళ్లి పడుకుండి పోయాను. ఆలోచనలు మొదలవుతూనే ఎవరో తుంచేసినట్టు ప్రతి ఆలోచన

తెగిపోతోంది ఓ దారంలా. తలపోటు మొదలైంది. మంచినీళ్ళ కోసం కిచెన్‌లోకి వెళుతుంటే తలుపు తెరుచుకొని తార, జోసెఫ్ వచ్చారు.

నా బట్టలు, అవసరాలు సర్దేసి మూడు సూటుకేసులు నింపారు.

"ఈ రోజు నుండి నువ్వూ నాతోనే మా ఇంట్లో ఉంటావు" అంటూ తార నన్ను తన అపార్ట్‌మెంట్‌కి మార్చేసింది.

చాల అలసటగా ఉందంటే, నాతో మందులు మింగించి, "కాసేపు పడుకో" అంటూ బెడ్‌రూం తలుపు దగ్గరికి లాగింది తార.

❖ ❖ ❖

అప్పుడే సూటుకేసులు లోనికి తెచ్చిన జోసెఫ్‌తో, "రేణుని చూడలేకపోతున్నాను జోసెఫ్, తల దువ్వుకోదు, బట్టలు మార్చదు, తన ఇంటికి వెళ్లి రెండు రోజులకోసారి షవర్‌లోకి తోస్తే అక్కడా అలా నిలబడే ఉండిపోతుంది. నోట్లోకి తిండి కూడా సరిగా పెట్టుకోలేకపోతోంది. బాధగా ఉంది. కొద్ది రోజులు నేనే అన్నీ చేసి చూస్తా. అర్థం కావడం లేదు, ఏమి చేయాలో రేణుని" అంది దిగులుగా తార.

టీ చేసి, ఓ కప్పు టీ జోసెఫ్‌కి అందిస్తూ, "నా భర్త జీవన్ నన్ను వంచించి పారిపోయినప్పుడు, ఓ అన్నలా ఆదుకొని, ఆరు నెలలు ఇంట్లో ఉంచుకున్నారు, రేణు భర్త రాఘవ. 'జాక్ ఇన్ ద బాక్స్'లో పనికి చేరి నిలదొక్కుకునేంత వరకు నన్ను సొంత వాళ్ళ కన్నా ఎక్కువగా ఆదుకొన్నారు, తెలుసా?" అని గుర్తుచేసుకొంది తార.

సూటుకేసుల నుండి సామాను తీస్తూ, "నీవు చాల కాలంగా బాగా క్లోజ్ ఫ్రెండ్‌వి కదా తార! ఏమిటిదంతా? రేణు కొడుకులు ఎక్కడ?" అన్నాడు జోసెఫ్.

"నాకు రేణు 30 ఏళ్ళగా తెలుసు. ఏడాది క్రితం వాళ్ళాయన తల్లో రక్తనాళం చిట్లి అకస్మాత్తుగా 60 ఏళ్ళకే చనిపోయిన సంగతి మీకు తెలిసిందేగా! తరువాత బాగా కుంగిపోయింది. వాళ్ళాయన పెన్షన్ తప్ప, ఆధారం ఏమీ లేదు. అందుకే డేవిడ్‌కి చెప్పి మన దగ్గరే పనిలో పెట్టాము కదా!" అంటూ ఓ నిముషం ఆగింది తార – "రేణు కొడుకుల సంగతా? వాళ్ళ నాన్న ఎలెక్ట్రీషన్‌గానూ, గ్యాస్ స్టేషన్‌లోనూ పనిచేసి, కడుపు కట్టుకొని రామ్‌ని ఇంజినీరింగ్, హైదరాబాద్‌లో ఫ్లాట్ అమ్మేసి భరత్‌ని మెడిసిన్ చదివించారు. ఇప్పటికీ అమ్మతో

కూరలు, రోటి చేయించుకొని పోతారు కాని, అమ్మ ఎలా ఉంది, సాయం చేద్దాము అని అనుకోరు" అంటూ ఆశ్చర్యంగా వింటున్న జోసెఫ్‌ని చూసి, "యు బిలీవ్ మి! మొన్న ఆగిపోయున్న కార్ బ్యాటరీకి అవసరమయి, వాళ్ళమ్మ 90 డాలర్స్ అడిగితే, తన దగ్గర లేవని, రోటి కర్రీస్ తీసుకొని వెళ్ళిపోయాడట రామ్" – కోపంగా చెబుతూ పోయింది తార.

❖ ❖ ❖

## మరో ఆరు నెలల తరువాత సంఘటన :

అది హ్యూస్టన్ నగరంలో, జీరియాటిక్స్ (వృద్ధుల వైద్యం) మెడికల్ క్లినిక్ – సీనియర్ సిటిజెన్స్‌తో నిండి ఉంది.

సోషల్ వర్కర్ మేరీతో ఓ భారతీయ మహిళ లోనికి వచ్చింది.

ఆ మహిళ శ్రీమతి రేణు కుమార్!

'ఆల్జిమర్స్ వ్యాధి' పేషంట్‌గా నమోదైంది.

వివరాలు, హిస్టరీ తీసుకొంది, నర్స్.

– పేరు – రేణు కుమార్, వయస్సు 62. దివంగతుడైన భర్త – రాఘవ కుమార్, 65. కాంటాక్ట్ – తార శర్మ

– రోగి జబ్బు – రెండేళ్ళగా 'ఆల్జిమర్స్ వ్యాధి' (మెదడులోని జీవకణాలు నిర్జీవమై పోవు జబ్బు)

– ప్రస్తుత పరిస్థితి – 24 గంటల అజమాయిషీ, సహాయం అవసరం – ఇద్దరు కొడుకులు, కాంటాక్ట్‌లో లేరు

– 58 ఏళ్ళకి 'డిమెంషియా వ్యాధి' నిర్ధారణ – 59కి 'ఆల్జిమర్స్ వ్యాధి'తో 'ఆల్జిమర్స్ హోం'లో అడ్మిట్ అయింది

– 'ఆల్జిమర్స్' హోం వాళ్ళ అశ్రద్ధ వల్ల పేషంట్ బలహీనమయి పోయింది.

– గార్డియన్ – తార శర్మ ఆరు నెలలుగా ఇండియాలో ఉండడం మూలంగా రేణు పరిస్థితి పాడయింది

– సోషల్ వర్కర్ మిసెస్. మేరీ జేమ్స్, క్షీణించి పోయిన రేణుని గమనించి, సంగతంతా తెలుసుకొని, రిపోర్ట్ చేసింది

– మరో 'ఆల్జిమర్స్' ఫెసిలిటీకి మార్చే విధానంలో భాగంగా, రేణు కుమార్ని

మెడికల్ చెకప్‌కి తెచ్చింది

మరో పది నిముషాల్లో డా. రాజన్ వర్మ వచ్చి, రేణుని ఎక్జామిన్ చేసి, మందులు, ట్రీట్‌మెంట్ రాసారు. రేణుని నర్సింగ్ హోంలో విజిట్ చేస్తానని చెప్పారాయన. ఆమె కొడుకుల గురించి విని ఆయన ఆశ్చర్యపోయారు.

"భారతీయుల కుటుంబాలలో హెల్త్ సరిగాలేని తల్లితండ్రులని ఇలా అశ్రద్ధ చేసేవారు, యు.ఎస్‌లో అరుదు, అసలు నేను చూడలేదు" అన్నారు డాక్టర్.

"ఇద్దరు కొడుకులుండి కూడా ఈ తల్లి ఇలాంటి పరిస్థితిలో ఉందంటే, చాల బాధగా ఉంది డాక్టర్! నా యాభై ఏళ్ళ సర్వీస్‌లో, ఇండియన్ ఫామిలీస్ తటస్థ పడింది చాల తక్కువ. అందులో ఇటువంటి కేస్ షాకింగ్! ప్రయోజకులైన పిల్లలు, వృద్ధులైన తల్లితండ్రులని ఇలా అనాథల్లా వీధులకి వదిలేయడం నేను ఊహించలేను. ఈ కేస్ నేను పబ్లిక్ చేసి ఓ అవేర్నెస్ వచ్చేలా న్యూస్ పేపర్‌కి రాయబోతున్నాను" అంది మేరీ ఆవేశంగా.

ఇంటికొచ్చి, భార్యతో చెప్పాడు రాజన్.

'పిల్లల కోసం, వారి పురోగతి దృష్టిలో పెట్టుకొని, ఈ దేశంలో ముఖ్యంగా భారతీయులు, అన్ని తరగతుల వారు శ్రమిస్తారు. మతిలేని కన్నతల్లిని త్యజించి, కాంటాక్ట్ లేకుండా ఉండగలగడం నమ్మశక్యం కాని విషయమే!' అనుకున్నారు వాళ్ళు.

❖ ❖ ❖

ఆదివారం, పొద్దున్న పది గంటల సమయం.

నర్సింగ్ హోంలో రేణు గదిలోకి విజిట్‌కి వచ్చారు డా. రాజన్.

రేణు తల బ్రష్ చేస్తున్న తార ఆయన్ని విష్ చేసి, రేణు ఆయన కేర్‌లో ఆరోగ్యంగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, డా. రాజన్‌కి మరికొన్ని విషయాలు చెప్పింది రేణు గురించి.

"ఇద్దరమూ గుంటూరు నుండి – తెలుగు వారమే! కుటుంబాలు కూడా తెలుసు" అని చెబుతూ, "ఆమె కొడుకులే కాదు డాక్టర్! రేణు తమ్ముడు, మరిది కూడా ఆమెని వంచించారు. పుట్టింటి నుండి రావలసిన కాస్త పొలం ఇవ్వకుండా తమ్ముడు, పూర్వుల స్థలం డెవెలప్ చేసి, రావలసిన వాటా ఇవ్వకుండా మరిది, రేణుకి అన్యాయం చేసారు. అమెరికాలో ఉంటూ కుబేరులైపోయిన వీళ్ళకి

ఇవ్వాల్సిన అవసరం లేదని, వారి సంజాయిషీ" అంటూ నొచ్చుకొంది తార.

"అమెరికా అష్టైశ్వర్యాల నిలయం అనీ, ఇక్కడ నివసిస్తున్న తమ వారి జీవితాలు, స్వర్గతుల్యమనీ, అపోహ పడుతూ, ఒక్కోసారి ఈర్ష్యపడే కుటుంబ సభ్యులు ఇండియాలో ఎందరో కదా డాక్టర్‌గారు!" అంటూ వాపోయింది తార.

"కొందరికి వాస్తవంగాను, కొందరికి ఊహల్లోనూ ఇక్కడి జీవనం 'త్రిశంకు స్వర్గమే' మరి!" అంటున్న తారతో, అప్పటి వరకు రిపోర్ట్ రాస్తూ, శ్రోతగానే ఉన్న డా. రాజన్, "ఏకీభవిస్తాను మీతో! ఇటువంటి సందర్భాలు ఎన్నో తెలుసు – వింటూనే వున్నాము" అంటూ రిపోర్ట్ రాయడం ముగించారు.

❖

*క్లిష్టమైన పరిస్థితుల నడుమ నలిగి,*
*సుస్థిరత్వాన్నే కోల్పోయిన*
*ఓ ప్రవాస భారతీయ మహిళ కథ!*




**స**కల చరాచర ప్రపంచంలోని జీవ, నిర్జీవ రాసులన్నీ బ్రహ్మదేవుని కనుసన్నలలో శివుని ఆజ్ఞ మేరకు జీవనాన్ని సాగిస్తున్నాయి.

ఆ బహ్మదేవుని సృష్టికార్యం అవిఘ్నంగా జరుగుతూనే ఉంది.

అంతటి బృహత్తర కార్యంలో మానవకోటిలోని ప్రతిజీవి యొక్క తలవ్రాత నిర్దేశిస్తూ, అనంత నిరవధిక పక్రియలో మునిగితేలుతున్న ఆ బ్రహ్మదేవునికి,

**కోసూరి ఉమాభారతి**

ఆయన అర్ధాంగి సరస్వతీదేవి తన వంతు సహకార సహాయాలని అందిస్తున్న దేవతామూర్తి.

సంగీత రస స్వరూపమైన నెమలి వాహనంగా, ధవళవర్ణ వస్త్రాలను ధరించి, అక్షమాలను, వీణను రెండు చేతులతో ధరించి, చందనచర్చితమైన దేహంతో దర్శనమిచ్చే సరస్వతీదేవికి ముల్లోకాలు నిత్యం నివాళులర్పిస్తుంటాయి.

చతుష్షష్టి కళలను అనుగ్రహించే దివ్యస్వరూపిణి ఆమె. విజ్ఞానపరిజ్ఞాన పాండిత్యాలని వరాల జల్లులుగా కురిపించి పూజ్యురాలవుతున్నది ఆనందరూపిణి శ్రీ శారదాంబ.

బాధ్యతాయుతమైన ఆ పక్రియ ఆమె హృదయాన ఓ చిరుకోరికకు, ఓ కమ్మని కలకు బీజం వేసింది. తనకీ ఓ కుమార్తె కావాలని, తానూ మాతృత్వాన్ని చవిచూసి తల్లిగా సంతృప్తి చెందాలనీ ఆశించింది. ఆ కుమార్తె, అందచందాలలో, ఆటపాటలలో మేటియై, సంగీత నృత్య కళలలో నిష్ణాతురాలై సృష్టికే వెలుగునిచ్చే ఓ తారలా వెలుగొందాలని, ఓ మాతృమూర్తిలా అంతరంగాలలో ఆకాంక్ష నింపు కొంది ఆ దేవత.

ఓ నిశ్చల చల్లని సాయంత్రపు వేళ తన కోరికని బహ్మదేవునికి విన్నవించు కొంది ఆమె.

బ్రహ్మదేవుడు అచ్చెరవొందినా, అబ్బురపడ్డాడు.

అయితే, “చూడు దేవీ, బిడ్డ ప్రాపకంలో ఆనందాలతో పాటు కష్టసుఖాలు, అసహనాలు ఉంటాయి. ఆ బిడ్డకీ తనదైన ఆలోచనా, నడవడి తప్పక ఉంటుంది. క్రమశిక్షణల్లో పెంచినా, వాగ్వివాదాలు, పట్టువిడుపులు తప్పవు సుమా!” అని సరస్వతీదేవికి తెలియచేస్తూ, సున్నితంగా హెచ్చరించాడు బహ్మ.

ఇరువురి సంకల్పం ఒకటయినవేళ, చిన్నారి దేవత ‘మానస’ సరస్వతీదేవి మానస పుత్రికగా, పసికందై ఆమె ఒడిలో అవతరించింది.

తలిదండ్రుల మనస్సులు సంతోషాల సంద్రమే అయ్యాయి.

ఆ చిన్నారి జీవనం ఆనందడోలికలై సాగింది.

*పాపాయికి ముద్దుమురిపాలు*
*తప్పటడుగుల బుజ్జాయికి బంగారు మువ్వలు*

కౌమార్యాన స్నేహాలు, ఆటపాటలు
చిన్నారి జీవన ప్రస్థానం ఆనందమయం

స్వర్గాన విరబూసిన నందన వనాలు
బారులు తీరిన జాజి సంపెంగలు
కొమ్మకొమ్మకీ తీయని రాగాల కోయిలలు
నింగి కెగసిన సంద్రాల జలపాతాలు
నేల నంటి పెట్టుకొని నీలి మేఘాలు

అంతా వన్నెచిన్నెల స్వర్గధామం
నిత్యం మానసకి మానస సంతోషాలే!

ఇంతటి మనోహరమైన వాతావరణంలో ఓ గురుకులమే ఏర్పాటు చేసారు బహ్మదేవులు తమ కుమార్తెకు. ప్రపంచం నలుమూలల నుండి సంగీత సాహిత్య నృత్య గురువులు, గణితశాస్త్ర నిపుణులు, వేద పండితులు, పలురకాల విద్యల మేటి ఉపాధ్యాయులు సరస్వతీ బహ్మదేవుల ఆస్థాన గౌరవ గురువులుగా కొలువై, మానసకి తమ వంతు విజ్ఞానాన్ని శ్రద్ధతో పంచారు.

ఆధ్యాత్మక చింతన, అభినవ శాకుంతలం నుండి అద్వైత వేదాంతం వరకు బోధించారు చిరంజీవి మానసకి. ఆ చిన్నారి, సంగీత నృత్యాలందు అత్యంత ఆసక్తి కనబరచింది. ఆమెకు రామాయణ, భారత, భాగావతముల నుండి విభిన్న కథాంశాలందు జిజ్ఞాస కలిగింది.

ఆధునిక సంగీత నృత్యాభ్యాసనక్కూడా మినహాయింపు లేకుండా, అన్నమయ్య కీర్తనలు, నారాయణతీర్థుల వారి తరంగాలు, జావళి లాంటి నాట్యాంశాలంటే మక్కువ పెరిగింది.

శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణ పరమాత్ముడు సాక్షాత్తు భగవత్స్వరూపులైనా, మానవ మాత్రులుగా పుడమిన వారు సాగించిన జీవనయానం, వారు ఎదుర్కొన్న పరిస్థితులు, మహాపురుషులుగా మానవజాతిని సన్మార్గాన నడిపించిన వైనాలు, మానసని ఉత్తేజ పరిచి ఆమెలో ఉత్సుకతని నింపాయి. అంతేకాదు, శ్రీకృష్ణుని

కొనియాడుతూ సాగే సంగీతమన్నా, నృత్యాలన్నా ప్రత్యేకంగా అభ్యసించి పాడుతూ, నాట్యమాడుతుండేది.

భూలోకం, మానసకి ఓ అద్భుతమైన, అద్వితీయమైన ప్రపంచంగా తోచింది. ఎప్పటికైనా తాను భూలోకాన్ని సందర్శించాలని, ఆ సౌందర్యాన్ని తిలకించి, ఆ పరిసరాలలో విహరించి ఆనందించాలనీ ఆమె మనసున బలమైన కోరిక నాటుకొంది.

పదహారు వసంతాల ప్రాయాన, ముగ్ధమనోహర రూపంతో, విద్యల్లో పరిపక్వత చెందిన మేధస్సుతో, లలితకళలందు అత్యంత నిష్ణాతురాలై తలిదండ్రులకి ఎనలేని సంతోషాన్ని కలిగించింది నవయవ్వని మానస. అభిమానం, ఆత్మీయతలతో తనవారికి తలలో నాలుకలా ఆత్మబంధువై, అందరి హృదయాలని చూరగొన్నదా చిన్నారి దేవత, మానస.

ఆమె మనస్సులో భూలోకానికి వెళ్ళాలన్న కోరిక పరవళ్ళుతొక్కనారంభిం చింది. అదే ఆలోచనలో రేయి పవలు ఉండిపోయేది. తన భూలోక పర్యటన కల ఎప్పుడు నిజమౌనోనని ఎదురుచూడ సాగింది మానస.

మానస పద్దెనిమిదవ పుట్టినరోజు వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. ఎందరెందరో అతిథులు ముల్లోకాల నుండి విచ్చేశారు. వేదపఠనం, నృత్య సంగీతాలు, బహుమతులు, దీవెనలు అన్నీ అయ్యాయి.

మానస తలిదండ్రులకు పాదాభివందనం గావించి, “అమ్మా, నాన్నగారు, మీ పుత్రికనయ్యే భాగ్యం నా జన్మకి ఓ దివ్య వరమే. మీ ప్రాపకంలో నేను నేర్వని విద్యగాని, అభ్యసించని కళగాని, తెలుసుకోని విషయ విశేషణాలుగాని లేవు. నాకు లభించిన ఈ పరిజ్ఞానంతో ప్రపంచాన్ని శోధించాలనీ, మరెన్నో వింతలు విశేషాలు స్వయంగా కనుగొనాలని, వీక్షించాలని, అందుకుగాను భూలోక పర్యటన చేయాలని నా కోరిక, మీకు నా విజ్ఞప్తి” అంటూ బహ్మ, సరస్వతుల ముందు చేతులు జోడించింది తనయ మానస.

“నా చదువులు ముగించి అన్నిటా ఉత్తీర్ణురాలనయ్యాను. మీరు అనుమతించిన వెంటనే బయలుదేరుతాను” అని మానస తలిదండ్రుల ముందు భక్తితో మోక రిల్లింది.

వ్యాకులతతో మథనపడుతున్న సరస్వతీదేవిని గమనించిన బ్రహ్మదేవుడు,

“ఈ రోజు వస్తుందనీ, మన పుత్రిక లోగిలి వీడి విశాల ప్రపంచంలో అడుగిడుతుందనీ, ఊహించినదే కదా! మరీ దిగులు పడక, మానసని దీవించుదాము” అన్నాడు బ్రహ్మదేవుడు అర్ధాంగితో.

మానసని ఆశీర్వదించి ఆమె పర్యటనకి ముహూర్తం పెట్టించారు ఆ తలిదండ్రులు.

తన బిడ్డ చిన్నతనంలో ఆడిన ఆటలు, పాడిన పాటలు, ముద్దుముచ్చట్లు జ్ఞాపకం చేసుకొని, మానస పుట్టినరోజు సందర్భంగా, ప్రకృతికి, సూర్యచంద్రులకి, పంచభూతాలకి, తన బిడ్డ ఎంతటి అపురూపమైనదో తెలియజెప్పింది ఆ తల్లి సరస్వతీ దేవి.

*పసిడితల్లి .....*
*ఆ నునులేత చెక్కిళ్ళకు*
*అమ్మ ముద్దుల తళుకులు తప్ప*
*తాక లేదు కన్నీటి వెచ్చదనం*

*తప్పటడుగుల వైనాలు దాటి*
*అంబరమంటే సంబరాల*
*మయురాల భంగిమల*
*అప్సరలా నాట్యమాడె నేడు*

*నాటి బోసినోటి కేరింతలు*
*నేడు చిలిపి నవ్వుల సంగీతాలు*
*ఉప్పెనలా ఆగని ఆమె పలుకులు*
*సేదతీర్చె అలిసిన మనసుల*

*చిట్టి పావడ కట్టి*
*చిరుమువ్వలెట్టి*
*నడయాడినట్టి చిట్టిది*

నేడు జలతారువోణీల
అందాల యువరాణి

నీలికన్నుల మెరుపులు
చిరునవ్వు జోడై
అద్దాల చెక్కిళ్ళపై
చిందులాడె నేడు

వెతలెరుగని కనుదోయి
తమ్మిరేకుల పోలి
సొగసు చూపులు చిందించె నేడు

తరలిపోయె ఆ పసితనం
పొంగై వచ్చె యవ్వనం
పరుగులెట్టేనిక ఆ సోయగం

ఎగిసిపోయె ఆమె ఆశలు
గగనమంటె ఆమె తలపులు
పొరలిపోయె ఆమె కలలు

సహకరించి చేయూతనిచ్చి
సంతసించి సంతోషాన్ని పంచి
ఆమెని ఎదగ నిచ్చి
హాయిగా వొదగ నిద్దాం!

అంటూ ఆ తల్లి శారదాంబ, మానసపై కోటి దీవెనల జల్లు కురిపించింది.

పుడమితల్లికి, ప్రకృతికి, సప్తసముద్రాలకి తన పుత్రిక మానస పర్యటన గురించి తెలియజెప్పింది. తన బిడ్డని కరుణతో చూడమని, అలిసి సొలిసినపుడు

సేద తీర్చమని వారిని వేడుకొంది. మానస నాట్యాలు, నయగారాలు కూడా పరవశంతో తిలకించమని కోరుకొంది.

*చిలుక కులుకుల కొలికి*

*(తనయ భూలోక పయనమయిన సమయాన, ప్రకృతికి, సరస్వతీదేవి విన్నపాలు)*

*అద్దాల చెక్కిళ్ళ, వయ్యారి నడకల*
*లేలేత మునివేళ్ళ సుతిమెత్తని తాకిడల*
*ముత్యాలు చిందునట్టి చిరు సిరి నగవుల*
*కుశలమడుగుతున్నట్టి కలువ కన్నుల*
*దేవతలా నిను తాకి దయ చూపుతున్నటుల*
*ఆడింది పాడింది చిన్నారి సిరిమల్లి*

*పసిమి ఛాయల మేనుపై జలతారు పయ్యెదల*
*మన్మధ ఛాపమును తలపించు సొగసుల*
*నీలాల కురులు మరిపించె చీకటుల*
*చిలిపి చూపుల కోణంగి రమ్మని పిలిచినటుల*

*మైమరచి పరుగులెత్తి తచ్చట్లాడకుమా!*
*అల్లంత దూరాన ఆగి తిలకించుమా!*
*సొగసు కని క్షణమైనా ఈర్ష్య పడబోకుమా!*
*పసిడి తల్లి అది ప్రేమతో చూడుమా!*

*నింగీ, నేలా, వెండిమబ్బులారా!*
*నీటి కెరటాల దాగున్న చిరు చేపలారా!*
*అతిమృదువుగ లాలించి, దయతో దీవించి*
*నవ్వించి, సేదతీర్చి, స్నేహంగా మీరంతా*
*ఆ చిన్నారి దారులలో వెలుగులే నింపుమా!*

ఎంతో హృద్యంగా వేడుకొంది ఆ దేవత.

ఆమెకి తప్పక చేయూత నిస్తామని వారంతా సద్భావనతో సరస్వతీదేవికి వాగ్దానం కుడా చేసారు.

❖ ❖ ❖

మానస భూలోక పర్యటన మొదలై, చాలా ఉల్లాసంగా ఉత్సాహంగా సాగుతోంది.

ఎటు చూసినా – పుడమిన...

ఎన్నో అందాలు...

నును లేగ దూడలు...

వయ్యారాల గొల్లభామలు...

రంగుల హరివిల్లులు...

పారే సెలయేరులు...

పురివిప్పిన నెమళ్ళు...

పంచవన్నెల రామచిలుకలు...

ఒకటేమిటి – ప్రకృతిలోని ప్రతి కదలికతో మమేకమై నాట్యమాడింది, పాట పాడింది, మైమరిచి పులకించి పోయింది మానస.

స్నేహితురాళ్ళకి, మానసకి అన్నిటా, అన్నివేళలా పండుగలా, ఓ వేడుకలా సాగింది వారి భూలోక పర్యటన.

❖

*(బంగారు భవిష్యత్తుకై, ఉన్నత విద్యల ఆశలతో, కలలతో విశాల ప్రపంచంలోకి అడుగిడుతున్న నేటి యువతకి, వారి కలలు సాకారమవ్వాలని ఆశీర్వాదాభినందనలతో, శుభాకాంక్షలతో, ఈ 'మానసపుత్రి' కథానిక అంకితం.*

*'మానసపుత్రి' నృత్య రూపకంగా, అమెరికాలో విశ్వవిద్యాలయ విద్యార్థుల గౌరవార్థం ప్రదర్శించబడిన కథాంశం. – రచయిత్రి)*

*శ్రీ శారదాంబ*
*ప్రియపుత్రిక కథ!*




**“మ**మ్మీ! కరెక్ట్‌గా ఆరు గంటలకి, మిల్పిటాస్ బాబా టెంపుల్‌కి వచ్చేయి. నేను, మాలిని అక్కడ నిన్ను కలుస్తాము. తరువాత డిన్నర్‌కి వెళదాము... సరేనా?” – ఫోన్‌లో కిరణ్.

ఉత్సాహంగా ఉన్నాడు మా వాడు. న్యూయార్క్ కాలేజీ నుండి ‘లా’ డిగ్రీ తీసుకొని, బిజినెస్ ఎం.బి.ఎ. చేసాడు. ఆరు నెలల క్రితమే శాంహోజే, కాలిఫోర్నియాలో ఉద్యోగంలో చేరాడు.

**కోసూరి ఉమాభారతి**

తన స్నేహితురాలు, క్లాస్మేట్ మాలిని, న్యూయార్క్ నుంచి మమ్మల్ని కలవడానికి వస్తుందని రెండు రోజుల క్రితమే చెప్పాడు. ఊరెళ్ళిన మా వారు రేపు సాయంత్రం ఇంటికి వచ్చేలోగానే నన్ను కలుస్తానని మాలిని తొందరపడితే, ఇలా ఏర్పాటు  చేసాడు కిరణ్.

సాయిబాబా టెంపుల్ దగ్గరే వాళ్ళ పిన్ని ఇంట ఉందిట ఆ అమ్మాయి.

"వర్క్ నుంచి బయలుదేరి, మాలినిని తీసుకొని రావడానికి గంటపైనే పడుతుంది మమ్మీ" అన్నాడు కిరణ్.

నాకూ కొంత ఆదుర్దాగానే ఉంది మాలినిని కలవాలని. అంత ప్రత్యేకంగా ఆ అమ్మాయి మమ్మల్ని కలవడానికి రావడమంటే, విషయం మేమూహించేదే అయ్యుంటుంది.

సాయంత్రం వరకు నాకు ఎన్నో ఆలోచనలు.

మా కిరణ్ ఎంచుకున్న అమ్మాయిని మేము కాదనేది ఉండదు కాబట్టి, మా ఇంట త్వరలో కోడలు అడుగిడుతుందన్నమాట.

మనస్సంతా సంతోషంతో నిండిపోయింది.

ఆలస్యంగా వెళితే  కిరణ్‌కి ఇష్టముండదని, గుడికి కాస్త ముందుగానే బయలుదేరాను.

మేముండేది సాయిబాబ గుడికి అరగంట డ్రైవ్. కిరణ్ అపార్ట్మెంట్, వర్క్‌కి దగ్గరగా మాకు వంద మైళ్ళ దూరం ఉంటుంది.

వీకెండ్ (శనాదివారాలు) అయితేనే ఇంటికి వస్తుంటాడు.

ఆలోచించుకుంటూ గుడి ఆవరణలోకి వచ్చేసాను.

ఆ రోజు గురువారం. గణేష్ చతుర్థి కూడా కావడంతో ఆలయ ప్రాంగణం జనంతో నిండిపోయుంది. ప్రసాదాలు, పువ్వులు పట్టుకొని మెట్లెక్కుతున్న చిన్న పిల్లల్ని గమనిస్తూ పైమెట్టు మీద కూర్చున్నాను.

పది నిముషాలకి అల్లంత దూరాన కిరణ్, ప్రక్కనే మాలిని గబగబా నా వైపు వస్తూ కనబడ్డారు.

నీలిరంగు పంజాబీ డ్రెస్ వేసుకొని, కిరణ్ ప్రక్కన కాస్త పొట్టిగా, సన్నగా ఉంది మాలిని.

దగ్గరగా వచ్చి నన్ను కలిసి, చేతులు జోడించి, "నమస్తే ఆంటీ, మీరొచ్చి

చాలా టైం అయ్యిందా?" అంది మృదువుగా, సుళువులేని తెలుగులో.

మా పిల్లలు తెలుగు మాట్లాడినట్టే ఉంది.

నీలి మేలిముసుగులో పొందిగ్గా తోచింది. తెల్లగులాబీలా సుకుమారంగా అనిపించింది. దేవుణ్ణి దర్శించుకొని, ప్రసాదం తీసుకొని మెట్లపై కూర్చున్నాము.

చక్కగా మాట్లాడుతూనే ఉంది మాలిని.

"కిరణ్ మంచి స్నేహితుడు ఆంటీ – నాకు కాలేజీలో, చదువులో హెల్ప్ చేసేవాడు. మా అమ్మా వాళ్ళకి కూడా కిరణ్ అంటే చాలా ఇష్టం" అంది.

కిరణ్ అంటే ఉన్న అభిమానం బాగా తెలుస్తోంది మాలిని మాటల్లో. ముచ్చటేసింది నాకు. మావాడి మనస్సులోని వలపుల తలపులకి నేను మురిసిపోయాను. ఆ సాయంత్రమంతా కబుర్లు, సంతోషాలతో గడిచింది.

"ఇవాళ డిన్నర్ వద్దులే, ఆలస్యమయిపోయింది. శనివారం ఇంటికి వచ్చి డాడీని కలవండి" అని ఇద్దరికీ చెప్పి ఇంటి ముఖం పట్టాను.

❖ ❖ ❖

ఇంటికొచ్చి ఎంతో ఉత్సాహంగా, "అమ్మాయి నాకు నచ్చింది, కిరణ్ అంటే బాగా ఇష్టం అని చెప్పకనే చెప్పిందండీ. శనివారం కిరణ్‌తో కూడా ఇంటికి వస్తుంది, మీరూ కలుస్తారుగా! దీవించేస్తే మన కిరణ్ ఓ ఇంటివాడవుతాడు" అని మా ఆయనకి ఫోన్ చేసి చెబుతూనేపోయాను.

మా ఆయన కూడా సంతోషించారు.

ఆనందంతో రాత్రి నిద్ర పోలేదు.

ఎదిగి ప్రయోజకుడైన మా ప్రియపుత్రుడు కోరి వరించిన అమ్మాయిని తప్పక ఆనందంగా ఆమోదిస్తాము, ఆహ్వానిస్తాము.

శనివారం హడావిడిగా వంట ముగించాను.

కిరణ్, మాలిని లంచ్‌కి వచ్చి సాయంత్రం వరకు ఉన్నారు.

చాల సరదాగా గడిచింది సమయం.

చదువుల నుండి, మాలిని వాళ్ళ కుటుంబ విషయాల వరకు ఎన్నో సంగతులు మాట్లాడుకొన్నాము.

"అంకుల్, మీకూ కిరణ్‌కీ చాలా పోలికలున్నాయి" అంటూ మా వారితో ఎన్నో కబుర్లు చెప్పింది మాలిని.

❖ ❖ ❖

మాలినితో మాట్లాడాలనీ... తన గురించి తెలుసుకోవాలనీ... మా భావాలు, ఆనందాలు, రుచులు, అభిరుచులు తనతో ప్రస్తావిస్తూ, తనవి అడిగి తెలుసు కుంటూ, ఆ తరువాత కూడా కొన్నిసార్లు కలిసాము.

ఆప్యాయంగా మాట్లాడేది మాలిని. మా అమ్మాయి నిషి కూడా మాలినిని కలవడానికి ఓసారి చికాగో నుంచి వచ్చింది. ఇద్దరూ స్నేహితులయ్యారు.

మాలినితో మా కందరికీ సాన్నిహిత్యం ఏర్పడింది.

"అమ్మాయి బాగా నచ్చింది కూడాగా నీకు. కిరణ్‌తో ప్రస్తావించి, వాళ్ళ ఫ్యామిలీని ఆహ్వానించు" అని మా అయన ప్రోత్సహించారు.

ఆత్మాభిమానం, చురుకుదనం, చొరవతోపాటు మా వాడంటే ఆ అమ్మాయి కున్న అభిమానం, ఆకర్షణ నాకెంతో నచ్చాయి. మనసులు కలిసాయి – ఇక మనువులే తరువాయని, సందేహ పడకుండా సందేశంతోపాటు మంచిరోజు చూసి మా ఆతిధ్యాన్ని అందుకోమని మాలిని వాళ్ళ కుటుంబాన్ని ఆహ్వానించాము.

❖ ❖ ❖

కిరణ్ ఆ అమ్మాయికి ప్రొపోజ్ చేసి, మా ఇరువురి కుటుంబాల సమక్షంలోనే డైమండ్ ఉంగరం వేలికి పెట్టాడు.

మరికొంత కాలం సంతోషాలు, సమావేశాలు. కాబోయే వియ్యంకులతో కబుర్లు, కమామీషు. ఉత్సాహంగా గడిచింది.

మాలిని కుటుంబ పరివారంతో చిరకాల స్నేహితుల్లా మెలిగాను. మాలిని వాళ్ళ అమ్మ లక్ష్మి, నాన్న నారాయణగారు, మాలిని చెల్లెళ్ళు – అంతా మమ్మల్ని కలవడం ఆనందంగా ఉందన్నారు.

లక్ష్మిగారు అయితే, "కిరణ్లాంటి అబ్బాయి అల్లుడు అవడం మా అదృష్టం. అంత కన్నా ఎక్కువ మీ వంటి అత్తగారు దొరకడం, మాలిని చేసుకున్న పుణ్యం" అని పొగిడేసింది. నారాయణగారు కూడా అంత సంతోషాన్నీ వ్యక్తపరిచారు. కిరణ్ అంటే ఇష్టపడే అమ్మాయే కాదు, కుటుంబమంతా అభిమానంగా ఉన్నారు. వాళ్ళకీ అబ్బాయిలు లేరు కనుక, కిరణ్ని వారి సొంత కొడుకులా భావిస్తారు కూడానని అనిపించింది. ఆ మాటే వాళ్ళతోనూ అన్నాను.

కట్నాల ప్రసక్తే అస్సలు లేదు. కిరణ్‌కి అలాంటివన్నీ పడవు. మాకూ అంతే!

ఇరువురూ సంతోషంగా సంసారం చేసుకొని వందేళ్ళు మంచి జీవితం గడపాలనే తప్ప వేరే ఆలోచన లేదు.

❖ ❖ ❖

ఇక జరగవలసిన కార్యక్రమం నిశ్చితార్థం. ఇక్కడా? అక్కడా? ఏ భోజనం? ఎవరి సాంప్రదాయం? దేవుని గుడిలోనా? కళ్యాణ మండపంలోనా? – ప్రశ్నలు, సందేహాలు. సంప్రదింపులు, సన్నాహాలు.

వీటన్నిటి నడుమ వచ్చింది వేసవికాలం.

మా ఇంట మొదటి శుభకార్యానికి అమ్మమ్మ తాతయ్యల దీవెనలుతోపాటు, ఏడుకొండల వెంకన్న ఆశీస్సుల కోసం హైదరాబాద్, తిరుపతి పయనమయ్యాము.

“ఆంటీ, కిరణ్‌తో, మీతో ఇండియా వెళ్ళాలని ఉంది. ప్లీజ్, మీకు కష్టం కాదంటే మీతోపాటే వెళ్ళేలా ప్లాన్ చేసుకొంటాను. అమ్మ వాళ్ళకి అభ్యంతరమే లేదు” అంది మాలిని ఫోన్ చేసి.

మాలినితోపాటు బయలుదేరాము.

అచ్చట, ముగ్ధలా మౌనంగా మెదిలింది ఆ అమ్మాయి. సహజంగా ఓర్పున్న పడతిలా తోచింది. కాకపోతే నాలుగు రోజులు జబ్బు పడింది. దగ్గరుండి చూసుకున్నాము నేను, కిరణ్. ఢిల్లీ, ఆగ్రా వెళ్ళడం మానుకొని, తన ఆరోగ్యం తేలికయ్యాక తిరుపతి వెళ్ళాము.

దర్శనం బాగా జరిగింది. అందరిని చూసాము, అంతటా తిరిగాము.

ఆశీస్సులతో, ఆనందాలతో, ఇల్లు చేరాము.

❖ ❖ ❖

నిశ్చితార్థానికి ముహూర్తాలు పెట్టించాము. ఆడపిల్ల వారి ఊరి కోవెలలో జరప నిశ్చయించాము. కెంపులు చెక్కిన వజ్రాల హారం, పగ్గాల మీద చెంగావి పట్టుచీరతోపాటు అద్దాల గాజులు, జలతారు వోణీలు తయారు చేయించి మాలినికి కానుకులుగా తెప్పించాము. ఆ శుభదినాన... శుభముహూర్తానికి... శుభాకాంక్షలతో శివారుల్లోని ఆలయ ప్రాంగణానికి బయలుదేరాము.

మా బంగారు కొడుకు ఉల్లిపొర రంగు టస్సార్ సిల్క్ దుస్తుల్లో, నుదుట తిలకంతో, చెంపన దిష్టిచుక్కతో, ఉదయించే సూర్యుడిలా వెలిగిపోయాడు.

ప్రతినిత్యం వాణ్ణిలా అందంగా, ఆనందంగా చూడాలని, మనస్సులోనే దేవుడికి దణ్ణం పెట్టుకొన్నాను.

తాంబూలాలు, కట్నకానుకలు సర్దుకొన్నాము. సపరివార సమేతంగా వడి వడిగా కదులుతున్నాము.

అంతలో అందింది కోవెల నుండి మాలిని పిలుపు.

"ఇదిగో వస్తున్నామే తల్లీ!" అంటూనే ఉన్నాను.

అటు నుండి అలజడిగా బిగ్గరగా కిరణ్‌తో ఫోన్లో వాదిస్తున్నదని, అదీ గొడవ పడుతున్నట్టు అర్థమయి అవాక్కయ్యాము.

మమ్మల తోడ్కొని వెళ్ళడానికి వచ్చిన ఆ అమ్మాయి తండ్రి, నారాయణగారు నచ్చజెపుతున్నా, నా కన్నకొడుకుపై కక్షగా అరుస్తూనే పోయింది ఫోనులో మాలిని.

అదురుతున్న గుండెల్ని అదుపు చేసుకొని అసలు సంగతేమిటా అని వాకబు చేసాము.

మా విడిదిలో, మా పరివారంతో ఉన్నందుకు, ఇక్కడే మావాడి స్నానాలంకారాలు అయినందుకు, తనని, తన వాళ్ళని ఒక్కింత కూడా లెక్కచేయలేదంటూ అర్థం లేకుండా మావాడిని నిష్కర్షగా తిడుతూనే పోయింది ఆ అమ్మాయి. అనూహ్యమైన ఈ విపరీత మాటలకి, చేష్టలకి నా మనసున అశాంతులు చెలరేగాయి. ఉద్వేగంతో దుఃఖం ఆగలేదు, ఆలోచన సాగలేదు.

అదిరింపులు, బెదిరింపులు ఎరుగని వాడు. సుకుమారంగా, రాకుమారుడిలా ఎదిగిన వాడు. నా కంటి దీపం మా కిరణ్, సున్నితమైన వాడు. మావాడు మూగవోయాడు ఆనాడు. తనకి తెలిసిన మాలినియేనాని వాపోయాడు.

అంతలో నారాయణగారు, తనపై కూడా ఫోన్లో బిగ్గరగా అరుస్తున్న మాలినితో, "సరే, ఇంక శాంతించు, ఆంటీ చాల బాధపడుతుంది. మేము బయలుదేరుతున్నాము" అని ఇటు మాకూ సర్ది చెప్పి, "పదండమ్మా, ఆలస్యమౌతుంది" అంటూ చేతలుడిగిన మమ్మల్ని బయలుదేరదీశారు.

❖ ❖ ❖

ఎంతటి జాణతనం? ఎంతటి జ్వాలతనం? కిరణ్ మనసు మలినపడకుండా ఏమి చేయాలి? వాడిని ఎలా ఆదుకోవాలి? ఆగని కన్నీటితో కలలోలా కదిలాను. ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి. మా వారు నా కన్నీళ్ళకి చలించి

పోయారు. మనసు పాడయి జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనలేదు. మాతో వచ్చినా, నిశ్చితార్థ తంతు నుంచి దూరంగా గుడిలోనే ఉండిపోయారు.

నేను మాత్రం కిరణ్ కోసం, వాణ్ని అంటిపెట్టుకొనే ఉన్నాను. నిషి మా వెంటే ఉంది. నిశ్చితార్థం అంటూ జరిగిన కార్యక్రమం... మా వారు అక్కడ లేకుండానే జరిపించారు. ఏమయిందో – ఎలా జరిగిందో? మాట మంతీ లేకుండా తిరిగి విడిది చేరుకొన్నాము. ఆపై ఊరు వెళ్ళిపోయాము. మనస్సు మొద్దుబారి పోయింది.

నా ఆలోచనంతా కిరణ్ గురించే! మా జీవితాలు ఎటువంటి మలుపులు తిరుగుతాయో ఇకమీదట అని ఆలోచించి నా తల ముక్కలైపోతోంది.

❖ ❖ ❖

రెండు నెలల వ్యవధి తరువాత, కిరణ్ తన ప్రయత్నాలు మొదలెట్టాడు. కలిసి కూర్చుని, విషయాలన్నీ మాట్లాడుకొని, ఇరువైపులా పరస్పర అవగాహన తెద్దామని ఆ అమ్మాయిని ఎన్నోమార్లు అడిగాడు. అయినా లాభంలేక పోయింది. ఇంతటి మొండి అమ్మాయితో అసలు జీవితం ఎలా ఉంటుందోనని, కిరణ్ విషయంలో భయం వేసింది.

అంతటితో ఆగని ఆ అమ్మాయి వీరంగం. *'పటుడు అంతై అంతంతై'* అన్న సామెతగా, తల్లిలాంటి నన్ను దుయ్యబట్టేంత వరకూ వచ్చింది. కిరణ్‌కి ఏవో అప్రస్తుతపు మాటలు చెపుతూ, వాడికి నాపై కోపం రావాలని, బాహాటంగానే నన్ను తూలనాడుతూ, మాటల్లోనేకాక లేఖలు కూడా రాసింది. తానంటే ఇష్టపడక, తనకంటే అందం అంతస్తులున్న కోడలి కోసం నేను ఆరాటపడుతున్నానని, నా మీద అబద్ధపు అభాండాలు మోపింది. నా ముఖం చూడనంది, నా ఉనికే వద్దంది.

మా నుండి వాడిని వేరుచేయడమే ఆ అమ్మాయి ధ్యేయమయ్యిందని అర్థమై పోయింది. మా కిరణ్ కావాలనుకొన్నది ఏదైనా, దేనికైనా వాడికి సంపూర్ణ స్వాతంత్ర్యముందని, అసలు వాడు ఏది చెయ్యాలన్నా మేము వద్దనడంగాని, వాడిని దేనికైనా మభ్యపెట్టడంగానీ, మా పద్ధతే కాదని ఆ అమ్మాయికి తెలియదు.

❖ ❖ ❖

ఇంతా జరిగాక, పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేకుండానే తాను

నిర్ణయించిన సమయానికల్లా వివాహం అవ్వాల్సిందే అని నిశ్చయించేసింది మాలిని. నన్ను బహుదూర ముంచుతానని నిర్మొహమాటంగా ప్రతిజ్ఞలు కూడా చేసింది. పైగా యివన్నీ రాసేది మావాడికి, నాకూను.

ఇంతటి వెరపులేనిదనం, తెగింపు, పాపభీతే లేని కరుకుదనం, ఓర్వలేనితనం ఎందుకో తెలియక నిస్సత్తువయ్యాను, విలవిల లాడాను, వేసారిపోయాను.

మనస్సు రాయి చేసుకొన్నాను. నా మంచితనం, నా న్యాయం నిలుపుకోవాలి. మా పిల్లలికి నేను అన్యాయం చేయలేను. ఏదోలా ఆ అమ్మాయిని మళ్లీ మచ్చిక చేసుకోవచ్చునేమో, మనసు మార్చవచ్చునేమో, నా మీద కలిగిన అయిష్టత, అనుమానం దూరం చేయవచ్చునేమో అని ఆలోచించాను. తను చిన్నపిల్లేగా! మా అమ్మాయి నిషిలానే కదా! తెలియకే ఇలా చేస్తుందేమో అని కూడా అను కొన్నాను. కిరణ్ మనసు, వాడి సుఖం, సంతోషమే నాకు ముఖ్యం. కనుక మాలిని పుట్టిన రోజున, నేనొక్కతినే వెళ్లి ఆ అమ్మాయిని కలవాలని కూడా అనుకొన్నాను.

నా ఒక్కగానొక్క కొడుకు మనసు బాధపెట్టి, ఇలా పోట్లాటలు పెంచి, జీవితాన్ని దుర్భరం కానివ్వదలుచుకోలేదు. కిరణ్‌కి తెలుసు నేను ఏం చేసానో, ఎటువంటి మనిషినో – కొడుకుగా నన్ను బాగా తెలుసుకొన్నవాడే! కాకపోతే ఈ గొడవంతా ఎలా సమర్థించాలో తెలియని అయోమయంలో మునిగాడు.

మాలిని నన్ను చూడ్డానికి ఇష్టపడలేదని అర్థమయ్యింది. అయినా కిరణ్‌తో, "కన్నా, నీవే ఎలాగో మమ్మల్ని కలుపు. పెళ్లిచేసేసుకో. అన్నీ సర్దుకుంటాయిలే" అన్నాను.

ఆపై నాకు వచ్చిన జవాబు నన్ను నిశ్చేష్టురాలిని చేసింది. నేనెరుగని ఓ కొత్త సాంప్రదాయం. వింత షరతులు విధించి, కాబోయేవాణ్ణి వేధించే ధోరణి అవలంబిస్తుందిట ఆ అమ్మాయి. తలిదండ్రులైన మమ్ముల తక్షణమే వీడవలెననీ, అత్తింటి వారి ఉనికే వలదనీ, లేదేని మనువుండదనీ కిరణ్‌కి తెలియపరిచిందిట మాలిని. పైగా పెళ్లి జరిగే ఛాయలకే, నేను రాగూడదని కిరణ్‌కి ఆదేశాలు జారీ చేసిందని కూడా నిర్దిష్టంగా తెలిసింది.

వాళ్ళ అమ్మ నాన్నలతో నేను మాట్లాడాలన్నాను.

"అంతా నా ఇష్టమే! వాళ్ళ ప్రమేయమేం లేదు – కాబట్టి నేనెలా అంటే

అలా జరగాలి” అని నాకే జవాబిచ్చింది.

❖ ❖ ❖

గత పాతికేళ్ళగా నా ప్రపంచమే నా పిల్లలుగా ప్రశాంతంగా సాగిన నా జీవన కొలనులో పిడుగులే పేలాయి. ప్రేమతో కట్టుకున్న ఆశాసౌధాలు కూలాయి. మా బిడ్డని మా నుండి చీల్చాలని వేచి ఉన్న ఓ తోడేలులా అనిపించింది, సుకుమారంగా కనబడే విషపూరిత ముళ్ళగులాబి మాలిని రూపాన.

‘సుఖసంతోషాల్ని పంచాలనుకొనే వారితో పాటు, వాటిని హరించాలనుకొనే మాలిని లాంటి వారూ ఈ పుడమిన మెదిలేరు కదా’ అనుకొన్నాను. ఓపిగ్గా శ్రద్ధతో, జీవిత కాలం పాటు ఆటుపోట్లకి తట్టుకొని, ఏర్పరుచుకున్న జీవన సౌధాన్ని, ఎవరో ఎక్కడి నుంచో వచ్చి... ఆనందాలు హరించి... కూల్చను ప్రయత్నించగలరు – కూల్చనూ గలరు అనుకొన్నాను.

ఈ క్లిష్ట సమస్య నుండి బయటపడే మార్గం అన్వేషిస్తూ, నిత్యం మనస్సు అలిసి పోయేది.

యువతలో పురోగతి, విద్యా విజ్ఞానాలతో పాటు కొందరిలో ఓ తెగింపు, ధిక్కార ధోరణి వల్ల ఇలాటివి జరుగునేమోనని కూడా అనుకొన్నాను. అస్సలు వివాహబంధంతో ఏర్పడే సున్నితమైన బాంధవ్యాలన్నా, బంధుత్వాలన్నా, బాధ్యతలన్నా ఈ నాటి యువతకి అయిష్టత, అసహనమే అనిపిస్తుంది. అర్ధంకాని ఈ వైనం, విపరీతమైన మాలిని నైజంకి నిర్ఘాంతపోయినా, అయోమయావస్థలో ఉన్న ఆ అమ్మాయిపై జాలి వేస్తుంది.

❖ ❖ ❖

కాలం నత్తనడకలు నడుస్తూ మరో నెల గడిచింది.

ఈ మధ్య కిరణ్ బిజీగా ఉంటున్నాడు. చూసి కూడా నెల రోజులయ్యింది.

శనివారం పొద్దున్నే ఫోన్ చేసి, “ఐ యామ్ కమింగ్ ఇన్ టెన్ మినిట్స్, మీ ఇద్దరితో మాట్లాడాలి” అన్నాడు కిరణ్.

కాస్త ఆదుర్దాగా ఉన్నా, వాడికి ఇష్టమైన ఎగ్ కర్రీ, పూరి చేయడంలో ఉండి పోయాను.

ఓ అరగంటలో వచ్చి నన్ను, వాళ్ళ డాడీని లైబ్రరీలో కూర్చోబెట్టి ఎదురుగా కార్పెట్ మీద చతికిలబడ్డాడు కిరణ్.

మా వంక చూస్తూ, “ఎంతగానో అలోచించి, నేను మాలినితో బ్రేకప్ అవ్వాలనే డిసైడ్ అయ్యాను. మాలినిది, చాల అసమంజసమైన నడవడి, ఆలోచన అనిపిస్తోంది. నాకు నచ్చలేదు. ఎవరికీ మంచిది కాదు. ఎవరికీ సంతోషం లేకపోవడం బాగా లేదు” అంటూ పైకి లేచి, “సో, అదీ సంగతి. నేను కూడా జాబ్‌లో బిజీగా ఉండ బోతున్నాను. నువ్వు, డాడి ఇక ఏమీ దిగులు పడవద్దు. ఐయామ్ హంగ్రీ, ఫుడ్ ప్లీజ్” అంటూ కిచెన్‌లోకి దారి తీసాడు కిరణ్.

❖

*మారుతున్న యువత దృక్పథాలకి,*
*నాటి తరాల మనస్తత్వాలకి*
*నడుమ సంఘర్షణే*
*ఈ ‘ముళ్ళగులాబి’లోని కథాంశం!*




**పా**లు తాగేసి అమ్మమ్మతో కథలు చెప్పించుకొని, బొమ్మలతో కాసేపు ఆడుకొన్నాను.

అమ్మ జంతికలు చేయిస్తోంది.

వెళ్లి వంటింట్లో అమ్మ దగ్గర కూర్చున్నాను.

"ఏరా స్కూలు లేకపోతే తోచడం లేదా? రోజాని పిలుచుకొని తోటలో ఆడుకోండి. పనయ్యాక నేనొచ్చి పిలుస్తాలే" అంది అమ్మ.

కోసూరి ఉమాభారతి

రోజా మా పక్కింటి స్నేహితురాలు. ఉషారుగా ఆటలు, బొమ్మలు తీసుకొని మేము తోటలో ఆడుతూ చాలాసేపు ఉండిపోయాము.

చీకటి పడుతుండగా, "బంతీ, ముద్దబంతీ, అమ్మా! భానుమతీ" అంటూ అమ్మ తోటంతా తిరుగుతోంది నా కోసం.

ఆ ముద్దు పిలుపు నా కెంతో ఇష్టం.

అమ్మలా పిలవగానే నా మనస్సున ఎంతో ఆనందం.

వెళ్లి వెనక నుండి అమ్మని గట్టిగా చేతులతో చుట్టేసాను.

"ఏరా, ఎంతసేపు పిలవాలి నిన్ను? పద త్వరగా భోజనం చేసి పడుకుందువు గాని. నాన్న రేపు చీకటితో వస్తున్నారు – నీ కోసం బొమ్మలు బట్టలు తెస్తున్నారు. అప్పుడు లేవాలిగా" అంటూ నా చేయందుకొని ఇంట్లోకి దారి తీసింది అమ్మ.

"రేపు వస్తాను" అనేసి రోజా వెళ్ళిపోయింది.

తెల్లారితే నా పుట్టినరోజు పండుగ.

అందరినీ ఆహ్వానించారట. పందిరి వేయించారు.

పాటకచేరి పెద్దవాళ్ళకి, పట్నం నుండి గారడీల వాళ్ళు పిల్లవాళ్లకి, వస్తున్నారట. మరునాడు దీపావళి పండుగ కూడానట. వారం రోజులు స్కూలు సెలవలు. భోంచేస్తూ అమ్మ చెప్పింది.

అమ్మ, నేను, అమ్మమ్మ భోజనం ముగించి పెందరాళే నిదరోయాము.

తెల్లారుతూనే నాన్న వచ్చారు. నిజంగానే మామూలు కంటే నాకు మరిన్ని బొమ్మలు, డ్రెస్సులు, చాక్లెట్లు తెచ్చారు. మతాబులు కూడా బోలెడన్ని తెచ్చారు. రకరకాల స్వీట్స్ ఎన్నో బోలెడన్ని తెచ్చారు.

నా ఏడేళ్ళ పుట్టినరోజు ఆర్భాటంగా జరిపించారు. స్నేహితులతో దినమంతా ఆటలు, గారడీవాళ్ళ వింతలు – చాలా ఉత్సాహంగా గడిచింది నాకు.

పెద్దవాళ్ళ ముద్దుమురిపాలతో, దీవెనలతో ముగిసింది సందడి. అలిసిపోయి పట్టు పరికిణీ, పూల జడతోనే అమ్మ దగ్గర పడుకుండిపోయాను.

తెల్లారుతూనే నాన్న ఊరెళ్ళిపోయారు ఎప్పటిలా. అమ్మొచ్చి నన్ను నిదురలేపి, ముద్దులాడి మొహం కడిగించి, వేడి పాలగ్లాసు అందించింది. పందిరి మంచం మీద కూర్చుని పాలు తాగుతున్న నాకు, బీరువా నుండి అమ్మ ఒక బంగారు రంగు కాగితపు సంచీ తీసిచ్చింది. గబా గబా విప్పి చూసాను. చక్కని చెక్క

బొమ్మ. అందంగా రంగులద్ది చీర కట్టి ఉంది. మంచి సువాసన వస్తుంది.

"నీ కోసమే ప్రత్యేకంగా తెప్పించాను, మైసూర్ నుండి. మంచి చందనపు బొమ్మ. బాగుందా?" అంటూ నన్ను వొళ్లోకి తీసుకొంది అమ్మ.

తరువాత ఇద్దరమూ కలిసి ఆ బొమ్మకి 'చేమంతి' అని పేరు కూడా పెట్టాము. ఆ రోజు నుంచి నాకు ఎంతో ఇష్టమయిన బొమ్మ చందనపు 'చేమంతి'.

ఇంతలో, "కళ్యాణీ, భానుమతికి దిష్టి తిప్పేసెయ్యాలి, రాత్రి అలాగే నిద్ర పోయింది. దాన్ని తీసుకొని ఇటు రామ్మా" అంటూ అమ్మమ్మ పెరటిలోంచి బిగ్గరగా పిలిచింది.

నన్నెత్తుకొని అటుగా నడిచింది అమ్మ.

❖ ❖ ❖

వారం గడిచినా ఇంకా పుట్టినరోజు కబుర్లు మాట్లాడుతున్నారు అందరు. నేను స్కూల్ నుంచి వచ్చేప్పటికి అమ్మకి చాలా పెద్ద జ్వరం వచ్చింది. రాత్రి వరకు అమ్మ దగ్గరే ఉన్నాను. మూడు రోజులైనా తగ్గలేదు. నన్ను ఇక అమ్మ దగ్గరకి వెళ్ళనివ్వలేదు. అమ్మని పట్టణాస్పత్రిలో చేర్చారు. నా స్నానం, తిండి అన్నీ అమ్మమ్మ చూస్తోంది.

మళ్లీ వారానికి, అమ్మకి బాగా జబ్బు చేసిందట. నేను అమ్మ గురించి అడిగినప్పుడల్లా, ఇదిగో, ఇవాళ వస్తుందని ఓ రోజు, కాదని మరో రోజు అనే వారు. ఏరోజుకారోజు, అమ్మకి ఇష్టమైన పరికిణీ వేసుకొని అమ్మ కోసం ఎదురు చూసేదాన్ని. ఒక్కోసారి ఏడ్చి గొడవ చేసి, నాన్న వచ్చాక, అమ్మ గురించి ఏమి చెబుతారో వినిగాని, అన్నం తినేదాన్ని కాదు.

అమ్మకి తలలో రక్తం గడ్డ కట్టిందట.

ఆ రోజు పొద్దున్న అమ్మమ్మ చాల దిగులుగా ఉంది.

అమ్మకి అస్సలు బాగోలేదట.

"అమ్మ వస్తుందా లేదా అమ్మమ్మా? పద మనమే వెళదాం అమ్మ దగ్గరికి" అంటూ ప్రతి రోజూ అమ్మమ్మతో గొడవ పడేదాన్ని. స్కూలుకి ఆలస్యంగా వెళ్ళే దాన్ని. అలా మరో వారం గడిచింది.

"నువ్వు రోజూ స్కూలుకి వెళ్ళి బుద్ధిగా చదువుకొంటేనే అమ్మ త్వరగా ఇంటి కొస్తానంది" అని చెప్పింది అమ్మమ్మ.

ఇక గొడవ చేయకుండా స్కూలుకి వెళ్ళేదాన్ని.

❖ ❖ ❖

అమ్మ వచ్చేస్తుందేమో అని ఆశగా స్కూల్ బండి దిగి ఇంట్లోకి పరిగెత్తాను.

వరండాలో నాన్న ఎవరికో ఫోన్లో చెబుతున్నారు – "ఆపరేషన్ చేసేలోగానే రక్తనాళం చిట్లడం వల్ల డాక్టర్ ఏమీ చేయలేక పోయాడు. చాలా అన్యాయం జరిగిపోయింది" అని వెనక్కి తిరిగి నన్ను చూసి, నా దగ్గరగా వచ్చి భుజం మీద చేయి వేసి, దగ్గరికి తీసుకుని ఇంట్లోకి తీసుకెళ్ళారు నాన్న.

లోపల హాల్లో అమ్మ పడుకొనుంది. తెల్ల దుప్పటి కప్పుకొనుంది. కళ్ళు మూసుకొనుంది. అమ్మమ్మ, ఇంకొందరు దూరంగా కూర్చుని ఉన్నారు. అమ్మమ్మ ఏడుస్తోంది. నేను అమ్మ దగ్గరగా వెళుతుంటే, అమ్మమ్మ వచ్చి నన్ను ఎత్తుకొని పక్కకి తీసుకెళ్ళింది. నేను బిగ్గరగా ఏడవడం మొదలెట్టాను.

"మీ అమ్మ నిన్ను, నన్ను వదలి వెళ్ళిపోయిందే తల్లీ! పాడు విషజ్వరంతో ఎన్నాళ్ళో అల్లాడిపోయింది. ఆ దేవుడికి మనపై దయలేకుండా పోయిందమ్మా" అంటూ అమ్మమ్మ వెక్కి వెక్కి తానూ ఏడ్చింది.

కన్నీళ్లు, కలవరింపుల నడుమ, అమ్మమ్మా, ఆయమ్మల పాలనలో, అరుదైన నాన్న లాలనలో ఎలాగో ఒదిగాను, పెరిగాను, పెద్దయ్యాను.

నాకు అమ్మ గుర్తుగా 'చేమంతి', అమ్మిచ్చిన చివరి కానుక అమ్మ చిహ్నామే – ఎప్పుడూ వెంటే ఉంచుకొనేదాన్ని.

❖ ❖ ❖

అమ్మమ్మతో వారానికి రెండు రోజులు గుడికి, భగవద్గీత పారాయణం, ఆధ్యాత్మిక చింతనలకి వెళుతుండేదాన్ని. ఎన్ని చేసినా నాకు అమ్మ లేకపోవడం తీరని లోటయింది. ఆ దిగులూ, బెంగా కష్టమయిపోయింది.

ఆ దుఃఖాన్నీ, లోటునీ కప్పి పుచ్చుకుంటూ, నాకు నేనే ధైర్యం చెప్పుకుంటూ, ఆ వెలితిని ఓ బలంగా మార్చుకొని నిబ్బరంగానే ఉండేదాన్ని. నేనెంతగానో ప్రేమించిన అమ్మ, నాకు దూరమౌతుందని ఎన్నడూ అనుకోలేదు. అందుకే, ఇంక ఏ కష్టమైనా, నొప్పైనా అమ్మ లేని బాధ కన్నా తక్కువేగా! అని అనుకొన్నాను. దేనికీ చెలించకపోవడం అలవర్చుకుంటున్నాను.

"ఎందుకే తల్లీ? అలా మొద్దులా ఉంటావు? ఈ తల నిండా తెలివేగా!

మాట్లాడ్డం నేర్చుకోమ్మా – అలా ముంగిలా ఉంటే, నిన్ను నోరు లేని పిరికను కుంటారు" అనేది అమ్మమ్మ తల దువ్వి జడేసినప్పుడల్లా.

ఇద్దరమూ నవ్వుకొనే వాళ్లము. రోజూ కాసేపు స్కూల్లో పిల్లల గురించి, టీచెర్ల గురించి ఆమెకి కథలు చెప్పేదాన్ని.

ఎక్కువగా ఎవరితో మాట్లాడేదాన్ని కాదు. అమ్మమ్మతోనే చనువుగా ఉండే దాన్ని. నాన్న ఎక్కువగా పట్టణంలోనే గడిపేవారు. మాకు మాత్రం దేనికీ తక్కువ చేయలేదు. అన్నీ అమర్చేవారు నాన్న. ఇంటి నిండా పనివాళ్ళు, వంటమనిషి, తోటమాలి. నేను పెద్దవుతున్నా నాకంటూ ఓ ఆయమ్మని కూడా ఉంచేశారు. కాని, నాన్న ఏనాడూ నాతో ఆప్యాయంగా మాట్లాడలేదు. అమ్మ పోయాక మా మధ్య మాటలు మరీ తగ్గిపోయాయి.

అందరి నాన్నలు ఇల్లానే అంటీముట్టనట్టు ఉంటారా? అని అనుమాన మొచ్చేది. కాని మా స్నేహితుల నాన్నలు వాళ్ళ అమ్మాయిలతో చాల ప్రేమగా, సన్నిహితంగానే ఉండడం గమనించాను. అమ్మమ్మని అడిగాను కూడా!

"కొందరి తీరు అంతేనమ్మా, మీ నాన్న ఎప్పుడూ అలాగే ఉన్నారులే... అర్థం చేసుకొని మసులుకోవాలి" అని ఊరుకొంది.

మనస్సుని సముదాయించి, ఉండీ లేనట్టుగా ఉన్న నాన్నకి, వదిలి వెళ్లి పోయిన అమ్మకి కూడా సరిపోయినంత బలాన్ని, ప్రేమని నేనే నా అంతరాల్లో నింపుకొన్నాను.

❖ ❖ ❖

మధ్యాహ్నం ఊరి నుంచి వచ్చిన నాన్న కాసేపటికి నన్ను, అమ్మమ్మని పిలిపించారు. అందరికీ టీ తెమ్మన్నారు. కాసేపు పచార్లు చేసి టీ తీసుకొని మా ముందు సోఫాలో కూర్చున్నారు.

"చూడండీ, నేను కమల అనే ఆవిడని పెళ్లాడబోతున్నాను. ఆవిడ నా పార్టనర్ చెల్లెలు. వచ్చే వారం పెళ్లి. పదిహేను రోజుల్లో ఇక్కడికే కాపురానికి వస్తుంది కమల. పెళ్లి తిరుపతిలో. మీరు కూడా పెళ్ళికి బయలుదేరాలి" అంటూ కొన్ని వివరాలిచ్చారు. బ్రీఫ్ కేస్ నుండి డబ్బు తీసి అమ్మమ్మ చేతికిస్తూ, "ఈలోగా ఏమన్నా అవసరాలుంటే పట్టణానికి వెళ్లి అన్నీ తెచ్చుకోండి" అని మాకు చెప్పి మరో గంటలో వెళ్ళిపోయారు.

నాకప్పుడు పద్నాలుగేళ్ళు. పెళ్ళికి రెండు రోజులు నేను, అమ్మమ్మ తిరుపతి వెళ్లి వచ్చేసాము.

ఆ తరువాత పది రోజులకి కొత్తమ్మ కాపురానికి వచ్చింది.

అప్పుడప్పుడు అమ్మమ్మ చిరాకు పడేది – అన్నిటా కమలమ్మ పెత్తనం ఎక్కువయ్యిందని.

❖ ❖ ❖

అలా మరో రెండేళ్ళు జరిగాయి.

వయస్సు పైబడి అమ్మమ్మ ఆరోగ్యం మెల్లగా క్షీణించసాగింది.

నేనే ఎక్కువగా ఆమెని అంటిపెట్టుకొని ఉండేదాన్ని.

అమ్మమ్మ నన్ను దగ్గర కూర్చో బెట్టుకొని ఎన్నో విషయాలు చెప్పేది.

"ఎప్పుడూ నువ్వు ఓపిగ్గా, హుందాగా ఉండాలి సుమా! నేనున్నా లేకపోయినా, నాన్న నీ పెళ్లిచేయ నిర్ణయిస్తే ఒప్పుకో. నీకు తరగని ఆస్తి, అమ్మ పెట్టిపోయిన వంద తులాల బంగారం, వందెకరాల మాగాణి, అన్నీ ఉన్నాయి. జీవితంలో ఎటువంటి పరిస్థితులకైనా తట్టుకొని ముందుకు పోవాలే తల్లీ" అనేది నాతో.

వీలయినంత సమయం గడిపేదాన్ని అమ్మమ్మతో.

నానమ్మ కాళ్ళు పట్టి, తల దువ్వడం నాకు ఇష్టం.

"అవన్నీ చేయడానికి ఛాయ ఉందమ్మా, నువ్వు నవ్వుతూ నా ఎదురుగా ఉండమ్మా" అనేది అమ్మమ్మ.

నా క్లాస్ పుస్తకాలు కూడా అమ్మమ్మ గదిలోనే ఉంచి, అక్కడే చదువుకునేదాన్ని.

❖ ❖ ❖

నా పదిహేడవ పుట్టినరోజు తెల్లారే, నా చేయి తన చేతిలోకి తీసుకొని, భగవద్గీత చదవమని, కళ్ళు మూసుకొని పడుకున్న అమ్మమ్మ మళ్లీ కళ్ళు తెరవనే లేదు.

అమ్మమ్మ దూరమయ్యి ఒంటరి నయిపోయాను – నాకున్న ఒక్కగానొక్క దిక్కు అమ్మమ్మ. ఆవిడా లేకుండా పోయింది. మనస్సు అగాధంలా అయి పోయింది.

నా చుట్టూ నా కోసం పనివాళ్ళు, ఆయమ్మ ఉన్నా నాకు శూన్యమయి పోయింది ఆ ఇంట.

❖ ❖ ❖

నాకు పద్దెనిమిది వసంతాలు నిండగానే, కాలేజి చదువు అవ్వకుండానే, నాన్న నాకు పెళ్లి నిశ్చయించారు.

పెళ్లికొడుకు మాకు బంధువులేనట. మోహన్ రాజ్ ఆయన పేరు. జామిందారీ కుటుంబమట. ఆయన్ని అందరు 'కుర్ర జమిందార్' అని పిలిచేవాళ్ళు. నా వివాహం ఆగస్ట్ 15న మా వూరి అమ్మవారి ఆలయంలో జరిపించాలని నిశ్చయించారు.

నాన్నకి దేశభక్తి మెండు. ప్రతి ఏడు ఆగస్ట్15న తప్పకుండా పెద్దెత్తున స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జరిపించి, ఊరంతా భోజనాలు పెట్టి, పిల్లలకి బహుమతులు పంచేవారు. హైదరాబాద్ నుండి రాజకీయ నాయకులు, కళాకారులు కూడా వచ్చి ఈ సంబరాల్లో పాల్గొనడం పరిపాటే! కాకపోతే, అది 1957వ సంవత్సరం, ఆగస్ట్ 15 కావడంతో,10వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలనే కాక, ఆ దినం పెళ్లి ముహూర్తం కలిసిరావడంతో నాన్నకి మరింత ప్రత్యేకత సంతరించుకొంది. రెట్టింపు ఉత్సాహంతో సన్నాహాలు చేయించారు నాన్న.

పెళ్లి వైభవంగా చేసారు.

❖ ❖ ❖

అత్తవారింట అడుగు పెట్టాను.

కొన్నాళ్ళు కొత్త మురిపెంగా సాగింది నా కాపురం.

ఏడాది అవుతూనే, రాను రాను తెరపి లేని బాధ్యతలు, భర్తగారి వ్యసనాల అస్తవ్యస్తాలతో విసిగి వేసార సాగింది మా దాంపత్య జీవనం.

నా భర్తది కూడా, నాన్న తీరే! నాన్న లాగానే అంటీ ముట్టనట్టుగా ప్రవర్తన. ప్రేమగా, స్నేహంగా, ఆప్యాయంగా ఉండరు. భార్య, పిల్లలు ఇటువంటి వారి జీవితాలకి అలంకార ప్రాయం మాత్రమే! అసలైన అనురాగాలు, భాధ్యతలు వీరికి ఏ మాత్రం తెలియవనిపిస్తుంది.

ఏమైనా నా జమీందార్ భర్తకి అన్ని వ్యసనాలు ఉన్నాయి. వారసత్వపు ఆస్థులు, అవసరాలకి మించిన డబ్బు, చుట్టూ ఆడ, మగ స్నేహితులు, నెలకి వారం రోజులైనా వాళ్ళతో యాత్రలు, తిరగడాలు. ఆయన జీవన శైలిలో నేనస్సలు ఇమడలేక పోయాను.

ఏమీ చేయలేని పరిస్థితా నాది?

జామిందార్ల కుటుంబ విషయాలు ఏవీ బయటకు పొక్కవని చెప్పేది అమ్మమ్మ. జమీందారి స్త్రీలు భర్తల కనుసన్నలలో మెలుగుతారని, కొందరు భర్తలు ఒకోసారి ఇద్దరు భార్యలతో సంసారం వెలగబెట్టేవారని, వారి భార్యలు ఎదురీది మనలేరని కూడా ఎన్నోసార్లు అంటుండేది.

నాకు గుర్తున్నంత వరకు నాన్న మాత్రం వారానికి రెండు రోజులు ఠంచనగా ఇంటికి వచ్చేవారు. వస్తూ మాకు కానుకలు, పువ్వులు, మిఠాయిలు తెచ్చేవారు. ఉన్న రెండు రోజులు ఇతర వ్యవహారాలు లేకుండా మాతో ప్రశాంతంగానే గడిపేవారు. అమ్మ పోయాక కూడా నాన్న అలాగే సాగించారు. నాతో ముక్తసరి గానే పొడిపొడిగా కాస్త మాట్లాడి, విషయాలు వాకబు చేసి, తోటలకి, పొలాలకి, గుడికి కూడా అమ్మమ్మని, నన్ను వెంటబెట్టుకొని తిరిగేవారు. అంతేగాని, ఇలా నా భర్తకులా ఎప్పుడూ ఇంటనే వెంట ఉండే స్నేహితులు, వారితో జలసాలు నేనెన్నడూ చూడలేదు.

❖ ❖ ❖

పండంటి నా బాబు రాక నా జీవితంలో వెలుగులు నింపింది.

పెళ్ళైన రెండేళ్ళకి శూన్యంలా తోచిన జీవితం బాబు రాకతో ఆనందమయ మయింది. మాతృత్వంలోని తీయదనం తెలిసొచ్చింది. నా బాబు ముద్దుమురి పాలతో గడిపేస్తున్నాను కాలమంతా. అయినా మేడిపండయిన నా కాపురం నిత్యం నన్ను కలవరపెట్టేది. తీరని వ్యథతో అహర్నిశలూ నిరాశలతో గడిపేదాన్ని. 'ఈ జీవితం ఇలాగే గడిచేనా?' అని గుబులుగా ఉండేది.

'నా గాయపడి దారి తెలియని మనసు కెన్నడూ ఆలంబన చిక్కిన దాఖలాల్లేవు' అని వాపోయాను.

అమ్మలు, ఆడవాళ్లే పసిపిల్లల పనులు చేయాలనుకునే మనస్తత్వం నా భర్తది. బాబుని వస్తూ పోతూ ముద్దులాడేవారు. ఏనాడైనా బాబుని తన వద్ద పెట్టుకొని వాడికి పాలు పట్టడమో, తినిపించడమో చేయలేదు. భార్యగా నాకెంత సమయం అనురాగం పంచారో, కన్నకొడుకు పైన మమకారం, ప్రేమ చూపించడంలోనూ అదే తీరు ఆయనది.

బాబుకి అయిదేళ్ళు నిండుతూనే, ఇంట మరో భార్యకి చోటిచ్చారు నా భర్త.

అసలు మగవారి నైజం ఏమిటి? జామిందారీ జీవన విధానమే ఇదని సరి పెట్టుకోలేక పోయాను. బాబుకి తప్ప నా అక్కరేలేని ఆ ఇంట అలసి సొలసిన జీవితమిక అలుసయి పోయింది. ఇక అక్కడ నాకు మనశ్శాంతి లేదు, మనుగడా లేదు. నా జీవనాన్ని ఆ ఇంట ఎలా సాగించేది? అని తలమునకలయ్యేలా ఆలోచించాను.

చిన్నతనంలో తండ్రి వాత్సల్యం లోపించినా, మిన్ను విరిగి మీద పడలేదు. పెళ్ళైన తరువాత భర్త నిరాదరణ వల్ల మనస్సు విరిగి బతుకు భారమైందే తప్ప ఊపిరి ఆగిపోలేదు. కాని, నా ఉనికే లేనట్టు, మరో స్త్రీని భార్యగా ఇంట నుంచ డం మాత్రం జీర్ణించుకోలేక పోయాను. ఈ చేష్టతో నా భర్త నా స్వాభిమానం పైనే గట్టి దెబ్బతీసి నన్ను కించపరచి, అవమానించాడు. క్రుంగిపోయాను. ఇటువంటి అవమానానికి గురైన ఎందరో స్త్రీల సహనానికి నిర్వచనమేమిటి అని అర్థం కాలేదు. నేను మాత్రం ఇంకా అక్కడే – ఆ ఇంటనే – జీవచ్ఛవంలా ఉంటే, నన్ను నేను అగౌరవపరుచుకోవడమే అవుతుంది.

పొంతనలేని బతుకు సరిచేసుకోవాలని నిశ్చయించుకున్నాను. నన్ను, నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన అమ్మమ్మకి మనసులోనే క్షమార్పణ చెప్పాను. నేను భర్త నుండి వీడాలనే, నా భర్త వద్ద నిర్భయంగా నోరు విప్పాను. అనిశ్చిత నుండి విముక్తి కోరాను. నా భర్త ఆశ్చర్యపోయాడు. అంతటి తెగింపు, ధైర్యం నాలో ఉన్నాయని నా జామిందర్ భర్త ఊహించలేదు.

నాన్నకీ విషయం తెలిసినా నన్ను పలకరించలేదు. పైగా నాకు ఇంకా రావల్సిన మామిడి తోట దస్తావేజులు పంపారు.

నేను ఆశ్చర్యపోలేదు.

'నీ ఆస్థులు నీ కున్నాయి' అన్నటుగా ఉంది నాన్న వైఖరి.

నాకు ఎక్కడలేని మనోనిబ్బరం, మొండి ధైర్యం వచ్చేసింది. నాకు ప్రేమంటే తెలిపిన అమ్మ, అమ్మమ్మ లేరు. భర్తకి నాపై ఆసక్తి, అనురాగం లేవని తెలిసి పోయింది. పైగా ఇంట్లో మరో భార్యతో ఆనందంగా గడుపుతున్నాడు. నేనో గోడ మీద బల్లి లాగానో, కాలి కింది చెప్పు లాగానో ఎలా మనుగడ సాగించ గలను? అందుకే ఏమీ ఫరవాలేదు అనుకొన్నాను. నా మంచి కోసం ఆలోచించే కదా – గడప దాటాలని నిశ్చయం చేసుకొన్నది. ఎన్నడూ లేని ప్రశాంతత

తోచింది.

'నేను అబలను కాను' అని నిర్ధారించుకొన్నాను.

'నా కోసం, నా బాబు కోసం ఆత్మస్థైర్యంతో ఒంటరిగానే జీవితం సాగిస్తాను' అని నిర్ధారించుకున్నాను.

'నా బాబుని, మనసున్న మగవాడిగా తీర్చిదిద్దుతాను. మానవ సంబంధాలు, బాంధవ్యాల విలువలు వాడికి తెలియజెపుతాను. తల్లిని, భార్యని ప్రేమించి గౌరవించే సాత్వికత వాడిలో నిలుపుతాను' అని ఆలోచించుకుంటూ, నిదరోతున్న బాబు వైపు చూస్తూ కళ్ళు మూసుకున్నాను.

నాలో నేను నవ్వుకున్నాను. మాటలు రాని బొమ్మ *'చేమంతి'* మాత్రం ఎప్పుడూ నా వెంటే ఉంటుంది. అమ్మ చిహ్నం 'చేమంతి!'

నాలో ఎక్కడ లేని ధైరం వచ్చింది. దిగులు అనిపించలేదు. నేను, నా బాబు, బతుకు బాటలో సాగిపోతాము.

'ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని కలిగించడానికి నేనున్నాను ఆ పసివాడికి. వారసత్వపు జమిందారీతో ఏర్పడే ఆస్తి, హోదా కూడా వాడికి అండగా ఉంటాయి. ఇక ఎదురులేని విహంగంలా దూసుకుపోతాడు నా బాబు జీవనపథంలోకి మెండుగా!' అని కోటి ఆశలతో నా మనసారా దీవించాను నా బాబుని.

తెల్లారుతూనే, రేపటి ఉదయం నా కొత్త జీవితానికి, *'తొలిపొద్దు'* అవుతుంది అనుకుంటూ హాయిగా నిదరోయాను.

❖

*భర్త నిరాదరణ సహించలేక,*
*గడప దాట నిశ్చయించిన ఓ నిస్సహాయ,*
*నాటి తరం మహిళ అంతర్మథనమే*
*ఈ కథనం!*




"**శ్రీ** సాయినాథ కరుణా కటాక్ష సిద్ధిరస్తు, శీఘ్రమేవ అభీష్ట సిద్ధిరస్తు"

చేతులు జోడించి తన ముందు మోకరిల్లిన సాయిరాం తలపై కాసిన్ని అక్షితలు ఉంచి ఆశీర్వదించారు పంతులుగారు.

సాయిరాం మా అక్కగారి అబ్బాయి. ఇంట్లో అందరం వాడిని సాయి అని పిలుచుకుంటాము. ఇంజినీరింగ్ కాలేజి నుంచి ఉత్తమ శ్రేణిలో పాస్ అయినందుకు సాయి పేరిట జరిపించిన గణపతి హోమం ముగిసాక తల్లి దండ్రులకి సాష్టాంగ నమస్కారం చేసి ఆశీస్సులు అందుకున్నాడు సాయిరాం.

కోసూరి ఉమాభారతి

అత్త లక్ష్మి కనబడకపోవడంతో ఆమె కోసం వంటింటి వైపు వెళ్లాడు సాయి రాం. పొయ్యి మీద వంటకం కలుపుతుంది లక్ష్మి. ఆమె చేయి పట్టుకొని తల మీద పెట్టుకుంటూ, "ముందు ఆశీర్వదించు నన్ను" అంటున్న సాయిని కుర్చీలో కూర్చోబెట్టింది మేనత్త లక్ష్మి. దిష్టి తిప్పేసి సాయి తలపై అక్షతలు వేసింది.

"నాదేముందిరా బంగారు తండ్రి – బాగా వృద్ధిలోకి వచ్చి, అమెరికా చదువు పూర్తిచేసుకొని, సంప్రదాయ పద్ధతిలో చక్కగా పెళ్ళిచేసుకొని మా అందరి కంటి దీపమై వర్ధిల్లు" అంటూ కంటతడి పెట్టుకొంది లక్ష్మి.

సాయి తండ్రి శ్రీధర్‌కి ఒక్కగానొక్క చెల్లెలు లక్ష్మి. పెళ్లవుతూనే భర్తని పోగొట్టు కొని, అన్నగారి ఆలనలోనే ఉండిపోయింది ఆమె. సాయిని చిన్నప్పటి నుంచి దగ్గరుండి చదివించి, భుజాన వేసుకొని పెంచింది. అన్నతోపాటు వదిన శాంత కూడా లక్ష్మిని సొంత బిడ్డలా చుసుకోడంతో వాళ్ళ నీడలో హాయిగానే బతికేస్తోంది లక్ష్మి. మళ్ళీ పెళ్ళికి మాత్రం సుముఖంగా లేనని వారికి తెలియజేసింది ఆమె.

అమ్మానాన్నల గారాల బిడ్డే అయినా, మేనత్త చేతుల్లోనే పెరిగాడు వాడు. ఇద్దరమ్మల కొడుకులా ముద్దుగా, నిత్యం పూజలు, అన్నదానాలు, సంప్రదా యాలు, భగవద్గీతా పారాయణాల మధ్యనే పెరిగి పెద్దవాడయ్యాడు సాయి.

❖ ❖ ❖

ఆ రోజు కాలేజీలో, విశిష్ట గుర్తింపు పొందిన ఇంజినీరింగ్ విద్యార్థిగా *'రాష్ట్రపతి బంగారు పతకం'* కూడా అందుకొన్నాడు సాయి. మా అక్కా, బావగార్ల ఆనందా నికి హద్దే లేకపోయింది. నేనూ గర్వపడ్డాను. అంతా ఆనందించాము.

సాయి గౌరవార్థం జరిగిన తేనేటి విందులో, వాడి పైచదువులతో పాటు, పెళ్ళి ప్రస్తావన కూడా వచ్చింది.

"అమెరికాలో చదువుకొని వచ్చాకే వాడి స్థాయికి తగ్గట్టుగా, మాకు బాగా నచ్చి, మాలో కలిసిపోయేలా ఉండే అమ్మాయినే చేసుకుంటాడు మా ఒక్కగానొక్క బిడ్డ" అంటూ గర్వంగా చాటుకొంది మా శాంతక్క.

సౌమ్యంగా, అణకువుగా ఉండే సాయి అంటే అందరికీ అభిమానమే!

మా అక్కయ్య నాకంటే పదేళ్లు పెద్ద. తమ్ముడు రెండేళ్లు చిన్న. మాకు అక్కంటే భక్తి, గౌరవం ఉన్నాయి. అక్క, బావగార్లు మాకు ఆదర్శం. అలాగే ఢిల్లీ ఐఐటిలో చదువుతున్న మా అబ్బాయి వాసుకి, మా తమ్ముడి కూతురు శిల్పకి కూడా

అన్న సాయిరాం ఆదర్శం.

❖ ❖ ❖

షిరిడీ సాయిబాబా భక్తులైన అక్క, బావలకి పెళ్ళయ్యిన పదేళ్ళకి పుట్టిన బాబుకి 'సాయిరాం' అని పేరు పెట్టుకున్నారు. పెద్దగా ఆస్తిపరులు కాకపోయినా, అక్కా వాళ్ళు వాడిని ఓ రాకుమారుడిలా పెంచారు. వాడి చదువుకీ, ఆటలకీ, ఎంతటి ఖర్చుకైనా వెనుకాడలేదు. వైజాగ్ దగ్గర సింధుపాలెం అనే వారి సొంత ఉళ్ళో బావగారికి బోలెడంత పలుకుబడి, పేరు, హోదా. అయినా, అక్కడి ఆస్తులు అమ్మి, కేవలం సాయిని పట్నంలో చదివించడం కోసమే పల్లె నుండి వైజాగ్ నగరానికి నివాసం మారారు. ఊళ్ళో తమకున్న కొంత మామిడి, నారింజ, ద్రాక్ష తోటలు కౌలు కిచ్చారని చెప్పింది అక్క.

నగర సివారుల్లో చక్కని పొందికైన ఇల్లు కొని, అన్ని వసతులు అమర్చు కున్నారు.

అక్కా వాళ్ళు వైజాగ్ చేరేనాటికి, నేను, మావారు గోపీచంద్ సెకెండరీ స్కూల్ టీచర్లగా వైజాగ్‌లోనే పనిచేస్తున్నాము. తమ్ముడు వాసు మెడికల్ షాపు వోనర్. మా మరదలు వాణి ఇంట్లోనే ఉంటుంది. నేను, తమ్ముడు వాసు కూడా అక్క వాళ్ళకి దగ్గరలోనే ఉండడంతో, ప్రతి వారం కలుస్తూ పండుగలు, పూజలు, వ్రతాలు కలిసి చేసుకోవడం మొదలు పెట్టాము. పిల్లల సరదాలు, వారి పెంపకం, చదువులతో కాలం సాగిపోయింది.

❖ ❖ ❖

సాయి ఇంజినీరయ్యాక నాలుగేళ్ల విదేశీ చదువు కోసం, వాళ్ళ నివాసాన్ని తృటిలో అమ్మేశారు అక్క వాళ్ళు. మేమంతా ఆశ్చర్యపోయాము. తమ సుఖ సంతోషాలకు ప్రతీకగా నిలిచిన ఆ అందమైన ఇల్లు వారి ఎల్లలు లేని మమకారం, పుత్ర వాత్సల్యం ముందు తృణపాయమే మరి!

మొత్తానికి అమెరికాలో పై చదువుల అవకాశాన్ని అందిపుచ్చుకొని, కాలిఫో ర్నియాలో పేరున్న యూనివర్సిటిలో చేరి మరో నాలుగేళ్ళకి చదువు ముగించాడు సాయి.

అక్కడే మైక్రోసాఫ్ట్‌కి ప్రాజెక్ట్ మేనేజీరియల్ లెవెల్ ఉద్యోగం చేస్తూ బేషుగ్గా సెటిల్ అయ్యాడు సాయిరాం.

❖ ❖ ❖

తిధి వార నక్షత్రం చూసి మరీ మా అక్కయ్య సంబంధాల వేట మొదలెట్టింది. ఎన్నో ప్రయత్నాలు, ప్రయాసల తరువాత కూడా అక్కయ్యకి పూర్తిగా నూరుపాళ్ళు నచ్చిన అమ్మాయి దొరకలేదు. అయినా కాస్త సర్దుకొని మర్యాద, మన్నన తెలిసిన కుటుంబం నుండి సంప్రదాయంగా పెరిగిన వధువుని ఎన్నుకొంది.

ముందుగా అన్ని విషయాలు పరస్పరం ఇరువైపుల వారికి నచ్చాయని నిర్ధారించుకొని, సాయి ఫోటోలు వధువు కుటుంబానికి, వధువు వసుంధర ఫోటోలు సాయికి పంపింది మా అక్క.

❖ ❖ ❖

ఓ ఆదివారం సాయంత్రం మేమంతా కలిసి బావగారి పుట్టినరోజు సెలెబ్రేట్ చేసి, భోజనాలు చేస్తూ, సాయికి ఫోన్ చేశాము.

నేనే ముందుగా వాడితో మాట్లాడాను.

"ఏరా సాయి, ఫోటోల్లో అమ్మాయి నచ్చిందా?" అని అడిగాను.

వాడు వెంటనే, "ఏ అమ్మాయి పిన్ని? ఎన్నో ఫోటోలు పంపింది అమ్మ గత మూడు నెలల్లో" – అని నవ్వాడు.

"అయితే మీ అమ్మ ఏ అమ్మాయితో పెళ్ళి కుదిరిస్తే, ఆ అమ్మాయి మెళ్ళో తాళి కడతావులే" అంటూ, వధువు వసుంధర గురించి చెప్పాను – "మీ అమ్మ నాన్నలకి ఆ అమ్మాయి చాలా నచ్చిందిరా సాయి" – వాడికి తెలియజేశాను.

నా తరువాత కొడుకుతో మాట్లాడి, "లతా, అమ్మాయి ఫోటోలు బాగున్నాయన్నాడు సాయి" అని ఆనందపడింది అక్క.

"పోనీలే అక్కా... పని అయినట్టే లెక్క. మరీ కష్టపడకుండా మన సాయికి వధువు దొరికినట్టే" అన్నాను జవాబుగా.

వధువు వాళ్ళ కుటుంబంతో స్నేహంగా మెలుగుతూ, వసుంధరతో ఆప్యాయంగా మసులుతూ మరో మూడు నెలల్లో, సాయి హైదరాబాద్‌కి వచ్చే సమయం కోసం ఎదురుచూస్తూ గడిపారు అక్క, బావ. కలిసినప్పుడల్లా వాడి పెళ్ళి గురించే మా కబుర్లు.

మా ఇంట మొట్టమొదటి పెళ్ళి సాయిదే అవడంతో మాకూ ఆదుర్దా.

వధువు కుటుంబీకులు కూడా సాయి సంబంధం విషయంలో చాల ఉత్సా

హంగా, ఆసక్తిగా ఉన్నారు.

❖ ❖ ❖

అందరం అనుకున్నట్టు మూడు నెలలకి సాయి రాలేదుగాని ఆరు నెలలకి మాత్రం అమెరికా నుండి అకస్మాత్తుగా తన పెళ్ళి ఫోటోలు మా అందరికి కూడా పంపుతూ, అక్కయ్య వాళ్లకి ఓ సుదీర్ఘ లేఖ రాసాడు సాయి. తను ఒక స్పానిష్ అమ్మాయిని వివాహమాడానని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎవరికీ తెలియ జేయకుండానే, అకస్మాత్తుగా పెళ్ళి జరిగిపోయిందని రాశాడు. అందుకు క్షమా ర్పణ కోరాడు. కోపం పెట్టుకోకుండా తప్పకుండా తమ వద్దకి రమ్మని తల్లి దండ్రులని కోరాడు.

వాడి ఆ పెళ్ళి కబురుతో పెద్దవాళ్ళు ఎంతగానో క్రుంగిపోయారు.

❖ ❖ ❖

ఏడాది పాటు మధనపడి, ఇరువురూ కాస్త తేరుకున్నారు. మరికొంత కాలానికి సమర్ధించుకున్నారు. అక్కాబావగార్ల జీవితాల్లో చోటుచేసుకున్న ఉదాసీనత కూడా తగ్గుతుందన్న ఆలోచనతో, మేమంతా బలవంతపెట్టి, బావగారి షష్టిపూర్తి జరిపించాలనుకున్నాము. సాయిరాం, బియాంక దంపతులని ప్రత్యేకంగా ఆహ్వానించాము. పని వొత్తిడి వల్ల రాలేక పోతున్నామంటూ, శుభాకాంక్షలు పంపారు.

షష్టిపూర్తి విందు ఆనందంగా జరిగింది.

వచ్చిన అతిధులకి కృతజ్ఞతలు తెలుపారు బావగారు.

“మా సాయి మమ్మల్ని మరీ మరీ రమ్మని ఆహ్వానిస్తున్నాడు. సాయి భార్య బియాంక కూడా చాలా అప్యాయంగా మాట్లాడుతుంది. వాళ్లకి పుట్టిన కవలలు ఆడపిల్లలు, ఐదేళ్ల వాళ్ళయ్యారు. చాల ముద్దుగా, అందంగా ఉన్నారు. వాళ్ళమ్మ లాగ ఉండడంతో పాటు సాయి పోలికలూ ఉన్నాయి” అంటూ ఆయన తన వద్దనున్న ఫోన్‌లోని పిల్లల ఫోటోలు, కోడలి ఫోటోలు అందరికీ చూపించారు.

తాము బయలుదేరి, అమెరికా సాయి దగ్గరకి వెళుతున్నామని అందరికి చెప్పారు.

“అమెరికా తిరిగి చూడాలని నా కన్నా మీ బావగారు ఆత్రుతగా ఉన్నారు. నా కీళ్ళ నొప్పుల బాధ ఎక్కువయ్యేలోగా చేతనయినంత తిరగాలని, మనమ

రాళ్ళని ముద్దులాడాలని ఆదుర్దాగా ఉంది" అన్నది నవ్వుతూ మా అక్కయ్య.

వాళ్ళిద్దరూ కాస్త బాగానే తేరుకున్నందుకు సంతోషంగా అనిపించింది.

❖ ❖ ❖

అమెరికాలో కొడుకు సాయి కుటుంబంతో ఆరు నెలలుండాలని వెళ్ళిన అక్కా వాళ్ళు మూడు నెలలకే వచ్చేసారు.

అక్కడి కబుర్లు చెప్పమని అడిగినా, అక్కయ్యకి సుస్తీగా ఉండడంతో, మూడు నెలలు తరువాత గాని అమెరికా విషయాలు చెప్పలేదు ఆమె.

ఓ ఆదివారం నన్ను, తమ్ముడిని లంచ్‌కి పిలిచింది అక్క.

"రోజంతా ఇక్కడే గడపాలి మీరు. నా కిప్పుడు కాస్త ఒంట్లో బాగుంది. అమెరికా కబుర్లు కావాలన్నారుగా, రండి మరి" అంది అక్క.

పొద్దునే కాఫీ పెసరట్టుతో మొదలయ్యాయి మా కబుర్లు.

పెద్దగా ఉత్సాహం కనబడలేదు వారిలో. అయిష్టమో, ఇబ్బందో, ఉదాసీనతో – ఏదయినా అమెరికా విషయాలు చెప్పడం అయితే మొదలెట్టారు.

"ఇక్కడ మన అలవాట్లకి, రోజూవారీ జీవితానికి, అక్కడి వారి విధానాలకి చాలా వ్యత్యాసముంది లతా..." అంటూ చెప్పుకు పోయింది అక్క.

అన్నిటా మరీ అంతటి తేడా, మార్పు తామూహించలేదని అన్నారు బావగారు.

బియాంక వాళ్ళ సంస్కృతి, సంప్రదాయం, తిండి, ఆచార వ్యవహారాలు అన్నీ వేరవడంవల్ల కాస్త సమస్య అని బావ అన్నారు. పైగా బియాంకా వాళ్ళ అమ్మా నాన్న స్పానిష్ తప్ప మరే భాష మాట్లాడేవారు కాదుట. దాంతో ఒకే ఇంట్లో ఉన్నా, ఒకే గదిలో తచ్చాడుతున్నా, వారి మధ్య మాట, పలుకు లేకుండా రోజులు గడిచేవట.

పైగా వాళ్ళింటనే నివసిస్తున్న బియాంక తల్లిదండ్రులకి ఇంటి కింద భాగం లోని పడక గది కేటాయించడంతో, తాము పై అంతస్తులో ఉండవలసి వచ్చిందట. కిందకీ పైకీ తిరగడం కూడా తమకి కష్టమయిందని అన్నది అక్కయ్య.

తమ కలవాటైన టీ, కాఫీల రుచులు కూడా మరోలా ఉండేవని చెబుతూ, తాను వంటింట్లో తిరగడం, కావలసిన వంటకాలు చేసుకోవడం బియాంకకి, వాళ్ళ అమ్మ వాళ్లకి అంతలా నచ్చేది కాదని, ఇబ్బందిగా ఉండేదని అన్నది అక్క.

“చారుపొడి కొట్టినా, ఎల్లిపాయ, ఉల్లిపాయ లాంటివి వంటకి వాడినా, ఇల్లంతా అదే వాసనలతో నిండి, తనకి తలపోటు వస్తుందని కోడలు, వాసన పడడం లేదని వాళ్ళ నాన్న కూడా చిరాకు పడేవారు” – నిట్టూర్చింది మా అక్క.

“తిండి విషయంలోనే కొంత బాధపడ్డాము” అన్నారు బావ.

“మీ బావ చదివే పుస్తకాలు, చెప్పులు, స్వెటరు కూడా ఎప్పటికప్పుడు పైన మా గదిలోనే ఉంచుకోవాలని బియాంక, పిల్లలు కూడా బావని హెచ్చరించే వారు” – చెబుతూ నవ్వింది అక్క – “క్రింద ఏవన్నా పొరపాటున వదిలితే, వాటిని వెంటనే పైకి తెచ్చి, తలుపు వద్ద నుండే, మా గదిలోనికి విసిరేసేది బియాంక” అంది బాధగా.

సాయిరాం పిల్లల కోసం పిల్లిని, రెండు కుక్కల్ని పెంచుతాడట.

పిల్లులు, కుక్కలంటే అంతలా ఇష్టముండేది కాదు ఈ పెద్దవాళ్ళకి. అంతేకాక అక్కకి ఉబ్బసంతో పాటు ఎలర్జీ కూడా ఉంది. అది మరి ఎలాగూ పెద్ద విషయమై పోయిందట అందరికీ.

“మాకు వసతిగా లేదని, మా చిన్న చిన్న ఇబ్బందులు, మొహమాటాలు, సాయికి చెప్పాలనిపించక ఊరకుండిపోయాము” అన్నారు బావ.

“కోడలు బియాంక నడుము నొప్పి వల్ల పిల్లల పనులకి తప్ప ఎక్కడికీ వెళ్ళేది కాదు. సాయిరాం పొద్దుటే ఏడింటికి పనికి వెళ్లి, మళ్ళీ సాయంత్రం ఏడుకి వచ్చేవాడు. అంతగా తీరుబడి లేకపోయినా ప్రతి శనివారం కావలసినవి తీసుకోమని మమ్మల్ని గ్రాసెరీ షాప్‌కి, ఒక్కోసారి గుడికి కూడా తీసుకొని వెళ్ళే వాడు. శనివారాలు వాడితో గడిపిన ఆ సమయంలో తన పని గురించే కాక సరదాగా మరెన్నో కబుర్లు చెప్పేవాడు. హాయిగా నవ్వేవాడు” అన్నారు చిరు నవ్వుతో బావ.

“ఒక్క రెండు వారాలు మాత్రం సెలవు తీసుకొని, మమ్మల్ని కొన్ని చూడవలసిన ప్రదేశాలకి డ్రైవ్ చేసి తీసుకెళ్ళాడు సాయి. పిల్లలు చిన్నవాళ్ళవడంతో, ప్రయాణాలు కూడా ఒక్కోసారి ప్రయాసగా ఉండేవి” అంది అక్క.

అమెరికా కబుర్లుతో మధ్యాహ్నం భోజనాలు కూడా అయ్యి సాయంత్రం నాలుగయింది. లక్ష్మి టీ తెచ్చిచ్చి కబుర్లు వింటూ ఎదురుగా మెట్టు మీద

కూర్చుంది.

"ఇవన్నీ అలా ఉంచితే అసలు సాయిబాబు ఏమన్నా కాస్త వొళ్ళు చేసాడా వదినా? అసలు వాడేమంటాడు? సంతోషంగా ఉన్నాడా?" – అడిగింది లక్ష్మి.

"సాయిరాం, చాలా కష్టపడుతున్నాడనిపించింది నాకు. వాళ్ళ జీవన విధానం మాకు సంతృప్తిని ఇవ్వకపోగా ఎంతో బాధనిపించింది" అంటూ అక్క వాపోయింది.

"కాన్పయ్యి ఐదేళ్లవుతున్నా వాడి భార్య ఇంకా బాలింతలా పడుకొనే ఉంటుంది. ముప్పైఏళ్ళ వయసుకే నడుం నొప్పంటూ బద్ధకం సాగిస్తుంది. పనిచేసి ఇంటికి వచ్చిన సాయిరాంకి  కూతుళ్ళ స్నానాలు వొప్పజెపుతుందంటే నమ్ముతావా?" అంటూ కళ్ళనీళ్ళ పర్యంతమైంది అక్కయ్య.

అక్కని వారిస్తూనే బావ, "వంటింటి పని కూడా వాడే చేస్తుంటాడమ్మా. వాడి జీవితం అలా ఉంటుందని మేమూహించలేదు. రాజాలా పెరిగినవాడు ఇలా పరాయి దేశంలో అగచాట్లు పడుతూ, రోజుకు పన్నెండు గంటలు పనిచేయడమే కాక, ఇంటి పని, వంట పని, పిల్లల ఆలనా పాలనా కూడా రోజువారిగా చేయవలసి రావడం,  బానిసలా వాడు మనుగడ సాగించడంలా అనిపించింది" – తీవ్రంగా నొచ్చుకున్నారు.

అంతే కాదు, మామగారన్న గౌరవంగానీ, అత్తగారన్న ఆపేక్షగానీ ఆ విదేశీ అమ్మాయిలో పూర్తిగా లోపించాయని కూడా నొచ్చుకున్నారు. తమ మనమరాళ్ళు తార, మాయ కూడా బియాంది తల్లిదండ్రులకే అలవాటవడంతో, తాము ఆ పిల్లలకి దగ్గరవలేక పోయామని అన్నారు.

ఇవన్నీ సాయితో అని, వాడిని మరింత వత్తిడికి లోనుచేయడం ఇష్టంలేక మిన్నకుండి పోయామని వారివురూ బాధపడ్డారు.

❖ ❖ ❖

అమెరికాలో, సాయి వాళ్ళింట తామాశించిన ఆప్యాయతగాని, ఆదరణగాని దొరక లేదని మాకు అర్థమయ్యింది. సంప్రదాయాలు, కట్టుబాట్లు, హోదా, పేరు ప్రతిష్టలంటే ప్రాణంగా భావించే మా అక్కయ్యా, బావగారు లాంటి వారికి ఇటువంటి అనుభవాలు, వాస్తవాలు మింగుడు పడని చేదునిజాలే అవుతాయి. విదేశీ చదువులు, పరాయి సంస్కృతుల సంకీర్ణాలు, కొందరికి జీర్ణించుకోలేనివిగా

అయ్యే ఆస్కారముందని అర్ధమయ్యింది. అక్కయ్య వాళ్ళని చూస్తే, ఉత్సాహం నశించి, సంతోషమనేది లేకుండా, చాల నీరసపడిపోయారు. వాళ్ళు చెప్పిన విషయాలు వారి బాధని, మనస్తాపాన్ని సూచించాయి. మాకు విని తల బరువెక్కి పోయింది.

మా అక్కా బావల శేష జీవితమంతా, తమ ఒక్కగానొక్క బిడ్డకి భౌతికంగానే కాక మానసికంగా కూడా దూరమయ్యి, వారసుడి జీవితాన తమకంటూ స్థానమే లేనట్టు భావించి చాలా కృంగిపోయారనడం అసత్యం కాదు. కన్నవారి కలలు చెదరడంతో, తిరిగి, పల్లెకి వెళ్ళిపోయి, మిగిలిన తమ పదెకరాల బత్తాయి, మామిడి తోటని తామే సాగుచేసుకోవడం మేలని కూడా నిశ్చయించుకున్నారు.

రాత్రవడంతో వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని బరువెక్కిన హృదయాలతో ఇంటి ముహం పట్టాము నేను, తమ్ముడు.

చీకటిలో కారు స్పీడుగా సాగిపోతోంది. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నాము.

"కాలానుగుణంగా మారుతున్న పరస్పర మానవ సంబంధాలు, మారే విలువలు అంతగా అర్ధం కాని నాటి తరం వారు అక్కా, బావగారు. మారుతున్న వాస్తవాలు వారిని ఎంతగానో ఇబ్బంది పెడుతున్నాయి అనిపిస్తుంది నాకు" అన్నాను తమ్ముడితో.

"అయినా ఇలాంటి ప్రేమ వివాహాలు చేసుకోవాలనుకున్న యువత, వారి తల్లిదండ్రులతో ఈ విషయం ముందే ప్రస్తావించడమే సబబు. ఏ కొడుకైనా తాను పెళ్ళాడబోయే యువతికి, తన తల్లిదండ్రులకి మధ్య కాస్త పొంతన, అవగాహనా ఏర్పడేలా చిన్న ప్రయత్నం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది" అన్నాడు వాసు సీరియస్‌గా.

"అవును, అప్పుడే స్వదేశీ కోడలైనా, విదేశీ కోడలైనా, అత్తా కోడళ్ళ నడుమ సహవాసం కుదిరి జీవితం మెరుగౌనేమో!" అన్నాను అంతే ఆలోచనతో.

❖




**"మే**జేర్ సాబ్, ఇక మీరు హ్యాపీగా వెళ్ళండి. రెండేళ్లగా మీ పరిచయాన్ని, ఇక్కడ అందరితో మంచి స్నేహితుడిలా మెలిగిన మిమ్మల్ని మిస్ అవుతామని కాస్త బాధ గానే ఉంది. అయినా ఈ ఆర్మీ సైకియాట్రిక్ హాస్పిటల్ నుండి మీరు ఫ్రీ అవడం ఆనందంగా ఉంది. టేక్ కేర్ సార్" – కరచాలనం

చేసారు డాక్టర్‌గారు.

"అర్జెంట్‌గా చూడవలసిన పేషంట్ ఉన్నాడు" అంటూ, "డేవిడ్, ఇలా వచ్చి మేజేర్‌గారికి సాయం చేయి" – ఎసిస్టెంట్‌కి చెప్పి రూం నుండి వెళ్లారు డా. రావు.

"పదండి సార్, ఈ నాటితో మీకు ఈ పిచ్చాసుపత్రి నుండి విడుదల, పిచ్చోడు అన్న ముద్ర నుండి శాశ్వతంగా విముక్తి దొరుకుతున్నాయి" అంటూ నా చేతికర్ర నందించాడు డేవిడ్. తలపైన నా మిలిటరీ కాప్ కూడా సవరించి, సాయం పట్టి సైకియాట్రిక్ చీఫ్ డా. గోపాల్‌రావుగారి గది నుండి బయటకి నడిపించాడు అతను.

హెడ్ నర్స్‌తోపాటు మరికొందరు స్టాఫ్, ఆయాలు, కుర్ర నర్సులు చేతిలో పూల గుచ్చాలతో నా కోసం గది బయట వేచి ఉండడం చూసి నా కళ్ళు చెమర్చాయి.

"ఇకపైన మాకు పామిస్ట్రీ చెప్పేవారుగాని, సలహాలిచ్చేవారుగాని, ఎవరున్నారు సార్?" అని నర్స్ మాల వాపోయింది.

"యెన్.టి.ఆర్ లాగా డైలాగ్ చెప్పేవాళ్ళుగాని, ఆర్మీ ఆఫీసరుగా అనుభవాలు కధలుగా వినిపించేవారుగాని ఉండరు కదా సార్! అయినా మీరిక్కడ ఉండవలసిన వారు కాదు మేజేర్ సాబ్, అందుకే హ్యాపీగా వెళ్ళండి" అంటూ విషెస్ చెప్పాడు తెరపిస్ట్ విష్ణు.

రెండేళ్ళగా అక్కడ ఓ రోగిలా కాక వారి స్నేహితుడులా మెలిగానన్నారు. ఓ ఐదు నిముషాలపాటు వారందరూ నాపై అభిమానంతో ప్రేమగా వీడ్కోలు పలుకుతూ అన్న మాటలవి.

అన్నీ విన్నాను. ఆనందించాను.

అందరితో కరచాలనం చేసి, శెలవు తీసుకొని అప్పటికే కాళ్ళు నొప్పెట్టడంతో, మెల్లగా డేవిడ్ ఆసరాతోనే వరండా దాటుకుంటూ బయటకి వచ్చాను.

జానకి, భర్త మూర్తి నా కోసం తెచ్చిన టాక్సి ముందు నిలబడి ఉన్నారు.

గబగబా నా వద్దకు నడిచి, నా చేయి అంది పుచ్చుకొని, "బాగున్నారా నాన్న?" – కంటతడి పెట్టుకొంది జానకి.

"ముందు సీట్లో కూర్చోండి అంకుల్" అంటూ కార్ డోర్ తీసాడు మూర్తి.

ఈసారి నన్ను ఇంటికి తీసుకెళ్ళడానికి వచ్చిన వారిద్దరినీ చూసి ఆనంద మనిపించింది.

కాని, అసలు నేను ఈ సైకియాట్రిక్ హాస్పిటల్లో ఉండడానికి, నా ఈ స్థితికి కారణమైన మా అమ్మాయి వైశాలి, అల్లుడు ఉమాపతి గుర్తుకొచ్చి మనస్సు బాధతో బరువయ్యింది.

❖ ❖ ❖

నా కిష్టమైన వంటకాలు, కొబ్బరి పచ్చడి చేసి ప్రేమతో దగ్గరుండి వడ్డించిన జానకి గురించి ఆలోచిస్తూ భోజనం ముగించి, అలసటగా పక్క మీద వాలాను.

ఆమెకి మాపట్ల ఉన్న ఆపేక్షలోని అనుభూతి నాకు, చనిపోయిన నా భార్య శాంతకే తెలుసు. మా జీవితాలని జానకి ఎంతలా ప్రభావితం చేసిందో, మా ఆరోప్రాణంగా ఎలా మెలిగిందో గుర్తుకొస్తేనే, నాలుగేళ్ళప్పటి జానకి రూపం నా కళ్ళ ముందు మెదులుతుంది.

జానకి చుట్టూతా తిరుగుతూ సాగింది నా ఆలోచనా స్రవంతి.

❖ ❖ ❖

పెళ్ళై ఏడేళ్ళైనా సంతానం కలగలేదని నా కంటే నా భార్య శాంత దిగులు పడుతుండేది. డెహ్రాడున్‌లో ఇండియన్ మిలిటరీ అకాడెమి నుండి ట్రైనింగ్ అయి ఇంటికి వచ్చి సెలవల్లో అమ్మతో కలిసి నేను, శాంత భద్రాచలం తిరణాలకి వెళ్ళాము. అక్కడ మాకు తటస్థ పడింది నాలుగేళ్ల ఓ అనాధ బాలిక. చిరిగిన బట్టలతో, దెబ్బ తగిలి నెత్తురోడుతున్న ఎడమ మోకాలితో, దీనావస్థలో సత్రం ముందు చేయి చాచి యాచిస్తున్న ఆ పసిదాన్ని చూసి కడుపు తరుక్కుపోయింది మాకు. శాంత విలవిల లాడిపోయింది.

పోస్టింగ్ వచ్చేలోగా నాలుగు వారాల సమయం ఉండడంతో అక్కడే ఉండి, ఆ పసిదాని గురించి ఆరా తీశాము. అనాధ అని తేలింది. పోలిస్ వాళ్లకి ఫిర్యాదు కూడా ఇచ్చి, స్థానిక శిశు సంక్షేమం వారి వద్ద నమోదు అయ్యి, అన్ని లాంఛనాలు ముగించుకొని, ఆ పసిదాన్ని ఇంటికి తెచ్చుకున్నాము.

ఆ తరువాత టెరిటోయల్ ఆర్మీలో కెప్టెన్‌గా ఎ.ఓ.సి (ఆర్మీ ఆర్డినెన్స్ కోర్) సెంటర్‌కి పోస్టింగ్ రావడంతో హైదరాబాద్ చేరాము.

శాంత ఆనందానికి అవధులు లేకుండా పోయింది. శ్రీరామచంద్రుడే తన

మొర ఆలకించి ఇచ్చిన బిడ్డ అని పసిదానికి 'జానకి' అని పేరు పెట్టుకొన్న శాంతకి, ఆ పసిదే ప్రపంచమయి పోయింది. అదే యేడు మేము ఆశించని విధంగా శాంత కడుపు పండి, మాకు ఆడపిల్ల పుట్టింది. వైశాలి అని పేరు పెట్టాము.

మా ఆనందం రెట్టింపయ్యింది.

వైశాలి పుట్టాక మా అమ్మ వైఖరిలో వచ్చిన మార్పు మాత్రం మాకు చాల బాధ కలిగించింది. జానకితో కఠినంగా వ్యవహరిస్తూ, దాన్ని వైశాలికి ఓ పని మనిషిలా చేసింది. జానకిని అనాథ అని, అడుక్కునేదానా అని తను తిట్టి, తిట్టించేది. అక్కా చెల్లెళ్ళలా మెలగవలసిన పిల్లల్లో వైషమ్యాలు పెంచింది.

అమ్మ నోటికి, అధికార దర్పానికి భయపడి జానకికి మా ప్రేమను పంచడం మినహా ఏమీ చేయలేక పోయాము.

జానకి పదేళ్ళ పుట్టినరోజు నాడు వైశాలి, అమ్మ కలిసి, "నువ్వు అసలు మా ఇంటి పిల్లవే కావు – సత్రం దగ్గర దొరికిన అనాథవు" అంటూ గేలి చేసి ఏడిపించారు.

"మిమ్మల్ని వదలను నాన్నా" అంటూ ఏడుస్తూ నా కాళ్ళని చుట్టేసింది ఆ రోజు జానకి. అయినా, అన్నీ తట్టుకొని నన్ను, శాంతని కంటికి రెప్పలా చూసు కొనేది జానకి.

ఒకే ఇంట్లో రెండు భిన్న కుటుంబాలుగా మెలగవలసి వచ్చింది కొన్నేళ్ళు.

చదువుపై ఆసక్తిలేని జానకి అతి కష్టంగా పదవ తరగతి పాస్ అయింది. ఇంట్లో వంటపని చేస్తూ, ఎంబ్రాయిడరీ, కుట్టు నేర్చుకుంది. కన్నతల్లి కన్నా మిన్నగా దగ్గరుండి నాకన్నీ అమర్చేది. ఎంతో క్రమశిక్షణలో పెంచాలనుకున్న నా పాప వైశాలి మాత్రం, మా అమ్మ పెంపకంలో, ఓ రాక్షసిలా తయారయింది. కేవలం జానకి పైనున్న ద్వేషంతో, అమ్మ అవలంభిస్తున్న వైఖరి వల్ల, వైశాలి మొండిగా, మాక్కూడా ఎదురు తిరిగి మమ్మ అగౌరవ పరిచేది.

ఇరవైయేళ్ళ జానకికి, ఆర్మీ కమీషన్డ్ ఆఫీసర్ సుబేదార్ మూర్తితో గుళ్ళో వివాహం జరిపించాము. అత్తారింటికి వెళ్ళినా జానకి మా బాగోగులు చూసు కొనేది.

తరగని ప్రేమతో, ఈ రోజున కూడా డెబ్భై రెండేళ్ళ ముదుసలినయిన నా

కోసం, ఎంతగానో పోరాడి, పిచ్చాసుపత్రి జీవితం నుండి, మేజర్ 'పిచ్చోడు' అన్న ముద్ర నాపై పడనివ్వకుండా పట్టుబట్టి కాపాడి, నన్ను కన్నతల్లిలా ఇంటికి తెచ్చుకొంది జానకి.

చిందర వందరగా శాంత, జానకీల ఆలోచనలతో గుండె భారంగా అనిపించింది. ఆగని కన్నీళ్లతో చూపు మసకబారడంతో, గదిలోకి వచ్చిన జానకి జాడ తెలియలేదు నాకు.

"నాన్నా ఇంకా నిద్ర పోలేదుగా, కాసిన్ని వేడి పాలు తాగి పడుకోండి. రేపు పొద్దుటే పెన్షన్ ఆఫీస్‌కి, డాక్టర్ చెకప్‌కి వెళ్ళాలి. ఓపికుంటే, సాయంత్రం ఏడింటికి లాయర్‌గారి ఇంటికి వెళ్ళాలి" అని చెంగుతో నా కళ్ళు తుడిచి, కప్పుడు పాలు తాగించి మరీ గది నుండి వెళ్ళింది జానకి.

❖ ❖ ❖

*:: ఇండియన్ ఆర్మీ వారి పెన్షన్ ఆఫీస్, ఎ.ఓ.సి సెంటర్ ::*

మేనేజర్ తెప్పించిన కాఫీ సిప్ చేస్తూ, ఆఫీసర్ కోసం వెయిట్ చేస్తున్నాము నేనూ, మూర్తి. పెన్షన్ ఆఫీసర్, ట్రిబ్యూనల్ జడ్జ్ సంతకాల కోసం తెచ్చిన ఫైల్లోని కాగితాలని తేదీల వారీగా అమర్చుతున్నాడు మూర్తి.

"ఏమోయ్ మూర్తి, నన్ను ఒక పిచ్చివాడిగా ముద్రించి, నా పెన్షన్ కూడా నాకు దక్కకుండా చేసి, పిచ్చాసుపత్రిలో పడేసారు నా కన్నకూతురు, దాని భర్త. అలాంటి కిరాతకం నుండి నన్ను కాపాడ్డం కోసం, పోరాడి ఇన్ని సాక్ష్యాలు సంపాదించడానికి ఎంత కష్టపడ్డారో కదా, మీరు. మీ రుణం ఎలాగయ్యా తీర్చుకునేది?" అన్నాను మూర్తితో.

"మేము పరాయి వాళ్ళమనే భావిస్తున్నారు అంకుల్ మీరు. మీకు ఈ వయస్సులో ఈ మాత్రం చేయూత నివ్వడం మా భాగ్యంగానే అనుకుంటున్నాము జానకి, నేనూ కూడా" అంటూ ఫైల్ బల్ల మీద పెడుతుండగా లోనికి వచ్చాడు ఆఫీసర్ శివరాం.

"నమస్తే సార్ మేజేర్‌గారు... మీరు నిజమైన ఫైటర్ సార్. మిమ్మల్ని నేను మళ్ళీ ఇలా ఆరోగ్యంగా చూడగలగడం మహా విశేషం. మీ అల్లుడు... ఇదిగో ఈ మూర్తి, మీ కోసం ఎన్నిసార్లు నా వద్దకు వచ్చాడు? అన్ని సంగతులు చెప్పే

వాడు సార్" – గుక్క తిప్పుకోకుండా నన్ను చూసిన సంతోషాన్ని వ్యక్తపరిచాడు శివరాం.

అంతలో జస్టిస్ అవినాష్ శర్మ కూడా వచ్చారు. హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌గా రిటైర్ అయ్యి, ఆర్మీ ట్రిబ్యూనల్ వారి స్పెషల్ కేసులు చూస్తుంటారు ఆయన.

రెండేళ్లగా నాకు బదులు మా అమ్మాయి వైశాలికి వెళుతున్న నా పెన్షన్ నాకే తిరిగి వచ్చేలా చేయమని నేను వేసిన పిటీషన్‌కి స్పందించి ఆర్మీ ట్రిబ్యూనల్ వారు అనుకూలంగా తీర్పు నిచ్చారు. దాని సంబంధిత డాక్యుమెంట్స్ పరిశీలిస్తూ మాతో రెండు గంటలు గడిపారు, అవినాష్‌గారు.

ఈ పిటీషన్ విషయం, ఏమి జరిగిందో క్లుప్తంగా వివరించమని జడ్జ్ అవినాష్ అడిగారు.

గ్లాసుడు చల్లటి మంచి నీళ్ళు తాగి చెప్పడం మొదలెట్టాను.

*"నాలుగేళ్ళ క్రితం మహవీర్ హిల్స్‌లోని నా 1500 గజాల స్థలంలో 'ప్రశాంత అపార్ట్మెంట్ కాంప్లెక్స్' నిర్మాణం చేపట్టాను. పర్యవేక్షణ నిమిత్తం అవుట్‌హౌజ్‌లో నివసిస్తూ, 68 సంవత్సరాల వయస్సులో ఎంతో కష్టపడి పని చేసాను.*

*రెండేళ్ళకి భారీగా పనంతా పూర్తయిన ఆ భవంతిపై సర్వాధికారాలు తమకి దక్కాలన్న దురుద్దేశంతో నా కుమార్తె వైశాలి, భర్త ఉమాపతితో కలిసి నాపై తప్పుడు కేసు పెట్టి పోలిస్ రిపోర్ట్ ఇచ్చింది.*

*తమ కాంప్లెక్స్ నిర్మాణం పర్యవేక్షణ పేరిట లక్షలకి మోసాలు చేసానని నాపై నిందలు మోపారు వారు. రెండు రోజులు పోలిస్ కస్టడీలో కూడా ఉన్నాను"*

ఓ క్షణం ఆగి, ఊపిరి తీసుకొని, మళ్ళీ చెప్పడం మొదలెట్టాను.

*"వాస్తవానికి ఆస్తి తమదని, మతిస్థిమితం తప్పి, నేను వారి ఆస్తిని నా ఆస్తులుగా భావించి, ఆక్రమించడానికి పయత్నం చేస్తున్నానని నాపై కోర్టులో తప్పుడు కేసు కూడా వేసారు వైశాలి దంపతులు.*

*మతిస్థిమితం కోల్పోవడమే ప్రధాన సమస్యగా చూపి నన్ను సైకియాట్రిక్ హాస్పిటల్‌కి తరలించారు. నిర్మాణ సమయంలో నా కాలుకి, నడుముకీ గాయాలవడంతో శారీరకంగా కూడా బాధలో ఉన్న సమయం అది. అకస్మాత్తు పరిణామాలని తట్టుకునే సమయంగాని, శక్తిగాని లేకపోవడంతో వారి కుట్రని ఎదుర్కోలేకపోయాను"*

నాకు తెలియకుండానే అసహనంగా నిట్టూర్చాను. ఆగి అందరి వంక చూసాను. ఆదుర్దాగా వింటున్నారు.

"బ్యాంక్ లోన్, కాంట్రాక్టర్ల విషయాల్లో మాట సాయం చేసిన వైశాలి ఆధీనంలో నా ఆస్థి దస్తావేజులు ఉండిపోయాయి. అందుచేత ఆరోపణలు అబద్ధమని నిరూపించుకునే అవకాశం వెంటనే అప్పట్లో దక్కలేదు.

"అంతేకాక, నా పెన్షన్ తనకే ఇప్పిస్తే, హాస్పిటల్లో ఉన్న నాకు ఇతరత్రా కావలసిన సదుపాయాలన్నీ చూసుకుంటానని ఆర్మీకి దరకాస్తు వేసుకొంది వైశాలి. ప్రత్యేక పరిస్థితిగా పరిగణించి, ఎడాదిన్నరకి పైగా నెలకి ఇరవైఐదు వేల వరకు నా పెన్షన్ వైశాలికే అందజేస్తున్నారు ఆర్మీ రిటైర్మెంట్ వారు.

"ఆ కోర్ట్ కేసులు, ఆ సైకియాట్రిక్ సమస్య – అంతా నాపై ఆక్రమంగా మోపబడినవే కావున, నా పెన్షన్ తిరిగి వెంటనే నాకే దక్కాలని కోరుతూ అన్ని డాక్యుమెంట్స్ మీ ముందుంచాను సార్" అని ముగించి ఊపిరి తీసుకున్నాను.

ఫైల్‌లోని రిపోర్ట్స్ అన్నీ వరుసగా, మరోసారి పరిశీలించారు, జడ్జిగారు, శివరాంగారు.

వాటిలో సమగ్రంగా పొందుపరిచిన తీర్మానాల్లో, డెబ్భై రెండేళ్ల మేజేర్‌గారికి మానసిక రుగ్మత లేదని నిర్ధారిస్తూ చీఫ్ అఫ్ సైకియాట్రీ డా. వినోద్ వర్మ రిపోర్ట్‌తో పాటు, పోలిస్ డిపార్ట్మెంట్, ప్రభుత్వ న్యాయవాది వారి రిపోర్ట్స్ నాకే అనుకూలంగా ఉన్నాయి.

అంతేకాక, మేజర్ సూర్యనారాయణ 40 యేళ్ళగా ఓ స్థిరమైన గొప్ప వ్యక్తిత్వంతో మెలిగిన ఆఫీసర్ అని బ్రిగేడియర్ శ్రీరాం కోటే, టెరిటోరియల్ ఆర్మీ తరఫున నిర్ధారించారు.

రాజేంద్రనగర్ రిజిస్టార్ ఆఫీస్ నుండి ప్లాట్ కొనుగోలు పత్రాల కాపీ ద్వారా 1500 గజాల ప్లాట్ నం.15 సొంతదారుణ్ణి నేనేనని కూడా నిర్ధారణయ్యింది.

అన్ని పత్రాలు సంతృప్తికరంగా ఉండడంతో తమ సమ్మతి తెలుపుతూ అవినాష్ గారు, శివరాంగారు కాగితాల మీద సంతకం చేసారు.

"చూడండి మేజర్‌గారు, మీ పెన్షన్ మీకే తప్పక అందుతుంది. అంతేకాదు... మీ అనుమతి లేకుండా మీ కుమార్తె ఇటువంటి మోసానికి దిగినందుకు, వైశాలి గారి మీద న్యాయస్థానంలో మీ తరఫున ఆర్మీ కంప్లైంట్ కూడా ఫైల్ చేస్తుంది.

మీరు ప్రశాంతంగా మీ జీవనాన్ని గడపవచ్చు. ఇది అఫీషియల్” అంటూ ఆర్డర్ కాగితాల మీద స్టాంప్ వేసారు.

❖ ❖ ❖

:: మెడినోవలోని, డాక్టర్ రాంప్రసాద్ కార్డియాలజీ క్లినిక్ ::

డైబిటిస్, ఇసిజి, బ్లెడ్ టెస్ట్ అన్నీ ముగించుకొని డాక్టర్‌గారిని కలిసాము.

అంతా సవ్యంగానే ఉందని, బలానికి టానిక్, ఐరన్, విటమిన్స్ ఇచ్చారు. అన్ని మందులు ఎప్పటిలా తీసుకోమన్నారు.

“మీ వయస్సుకి బాగానే ఉన్నారు, మేజేర్‌గారు” అంటూ, “ఆర్మీ యాక్టివిటీ కాక ఆ మధ్య క్రింద పడి తగిలిన దెబ్బల వల్ల మీ రెండు కాళ్ళు, నడుము అప్పుడప్పుడు బాధ పెట్టవచ్చు. థెరపీ మానకండి” అని ముగించారు డాక్టర్ సునీల్.

అప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటయ్యింది.

“ఇంటికే వెళ్లి భోజనం చేద్దాము అంకుల్, రెండు ముఖ్యమైన పనులు ఈ రోజు పూర్తయ్యాయి” అంటున్న మూర్తితో కలిసి టాక్సీ వైపు నడిచాను.

❖ ❖ ❖

క్లినిక్ నుండి ఇంటికొచ్చి, పెరగన్నం మాత్రం కొంచెం తినేసి నాకని కేటాయించిన రూంలో పడక మీద వాలాను. చుట్టూ పరిశీలించాను. ఏవేవో ఫోటోలు, పువ్వులు అమర్చింది జానకి. మంచానికి ఎదురుగా గోడ మీద పెద్ద ఫోటోలో నేనూ, నా ఇరువైపులా జానకి, వైశాలి. తల మీద వైశాలికి బర్తేడే హాట్ ఉంది. పదేళ్ళ పుట్టినరోజు ఆర్మీ క్లబ్‌లో సెలెబ్రేట్ చేసినప్పటి చిత్రం అది.

వైశాలి వంక చూస్తే ఎన్నో మనసుని పిండేసే జ్ఞాపకాలు.

ఆ పుట్టిన రోజు నాడే, వైశాలికి పాయసం ఇష్టమని పొద్దున్నే తలార స్నానం చేసి, వంటింట్లో పనిచేసుకుంటున్న జానకి పొడవాటి జుట్టుని అక్కసుతో వైశాలి వెనక నుండి కత్తిరించేసింది.

వైశాలి పధ్నాలుగేళ్ళకే సింగర్‌గా మ్యూజిక్ బాండ్‌లో చేరి, డ్రింక్ చేసేది. అప్పుడప్పుడు మాదక ద్రవ్యాలు కూడా వాడుతుండేదని నా అనుమానం. బాయ్ ఫ్రెండ్స్, డేటింగ్ – అన్ని అలవాట్లూ ఉండేవి. దాని ఖర్చుకి, మా అమ్మ తన

పొలం, పల్లెటూరిలో ఇల్లు అమ్మేసిన డబ్బు నుండి కొద్ది కొద్దిగా ఖర్చు చేసేది.

వైశాలి గురించి వ్యధ చెంది, బాధతో ఆరోగ్యం క్షీణించి, క్షయ వ్యాధితో పాటు, కంటిచూపు మందగించడంతో శాంత చాల బలహీనమయింది.

వైశాలి మ్యూజిక్ గ్రూప్ ఓనర్ జాన్‌తో మూడేళ్ళ పాటు సహజీవనం చేసింది. అదే సమయంలో అమ్మ హృదోగంతో మరణించాక, డబ్బుకి మమ్మల్ని వేధించేది. గొడవ పడలేక శాంత నగలు ఒక్కోటి ఇచ్చేసేది.

వైశాలికి ఇరవైయేడేళ్ళప్పుడు నేను మేజేర్‌గా రిటైర్ అయ్యి, ఖైరతాబాద్‌లోని మా చిన్న ఫ్లాట్‌లోకి మూవ్ అయ్యాము.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ ఉమాపతిని పెళ్ళిచేసుకున్నానని చెప్పింది వైశాలి.

ఓసారి జానకి, వాళ్ళ పదేళ్ళ కొడుకు రాజు ఇంటికి వచ్చారు. అదే సమయానికి వైశాలి కూడా వచ్చింది. వోర్వలేని వైశాలి నా దగ్గర కూర్చున్న రాజుని లాగి గుమ్మం బయటకి తోసింది. దాని నైజం తెలిసిందే అయినా, వైశాలి మీద ఆ రోజు అసహ్యం వేసింది.

మరోసారి, అనారోగ్యంతో ఊపిరి అందక బాధ పడుతున్న శాంతని, హాస్పిటల్‌కి తరలించబోతున్న సమయంలో వైశాలి వచ్చింది. హాస్పిటల్‌కి వెళ్ళే మనిషి వంటి మీద నగలు ఉంచకూడదంటూ, శాంత చేతి గాజులు, మెడలోని గొలుసు, మంగళ సూత్రం తీసి, తన పర్సులో వేసుకొంది.

మరో వారానికి ఇంటికి వచ్చిన శాంత, జానకి ఆలనలో కొద్ది రోజులు బాగానే ఉన్నా, ఓ అర్ధరాత్రి ఊపిరందక, మళ్ళీ హాస్పిటల్‌కి తరిలించే లోగానే తీవ్రంగా బాధపడి కన్నుమూసింది.

వైశాలి అంటే, మాకు ఓ టెర్రర్, సంకోచం, బాధ, కడుపుకోత, గుండెల్ని పిండేసే గుబులు, చేతగానితనం. మా అమ్మ మనమరాలిపై ప్రేమతో అతిగా వ్యవహరించి, తప్పు దోవలో పయనించి, వైశాలిని పూర్తిగా నాశనం చేసిందనే మా బాధ. అందుగ్గాను అమ్మని నేనేనాడు క్షమించలేను.

వైశాలి ఆలోచనలతో వ్యధ చెంది, వేదనగా పక్క మీద నుండి లేచాను.

బయటకి వచ్చి టివి చూస్తూ కూర్చున్నాను.

టివి పైన అందంగా నవ్వుతూ రాజు ఫోటో. రాజు కూడా పాతికేళ్ళ వాడయ్యి,

ఆస్ట్రేలియాలో ఐ.టి.లో పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుల్లో ఉన్నాడుట.

ఇల్లు నిశబ్దంగా ఉంది.

జానకి, మూర్తి కనబడలేదు. బయటకి వెళ్లుంటారు అనుకున్నాను.

❖ ❖ ❖

టివి చూస్తూ మగతలోకి జారుకుంటున్న నేను, తలుపు తీసిన చప్పుడికి కళ్ళు తెరచి గుమ్మం వైపు చూశాను.

హడావిడిగా రెండు చేతుల నిండా సంచులు, సామానుతో బజార్ నుండి వచ్చారు మూర్తి, జానకి.

“సారీ నాన్నా, ఇదో ఇప్పుడే టీ పెట్టిస్తా” అంటూ వంటింట్లోకి వెళ్ళింది జానకి.

మూర్తి సామానంతా సర్దేసి, ఫ్రెష్ అయ్యి, లాయర్‌గారి కోసం ఫైల్, కవర్స్ కూడా తెచ్చుకొని సోఫాలో కూర్చున్నాడు.

హైదరాబాద్ ట్రాఫిక్ గురించి మాట్లాడుతూ జానకి తెచ్చిన పకోడీ తిని, టీ సిప్ చేస్తుండగా, “లాయర్ ఇంటికి వెళ్లేందుకు ఓపికుందా ఇవాళ?” అని లేచి వెళ్ళి, నా తల పైకి కాప్, చేతికర్ర తెచ్చిచ్చింది జానకి.

❖ ❖ ❖

*:: లాయర్ విశ్వనాధ్‌గారి ఆఫీస్ ::*

మా కోసమే ఎదురు చూస్తున్నారు లాయర్‌గారు. న్యాయవిచారపరంగా ఇప్పటివరకు జరిగినవి, నాకు వివరించారు. నిర్మాణం అయిన 20 అపార్ట్మెంట్స్ అమ్మకాలు కోర్ట్ స్టే ఆర్డర్‌తో ఆపి ఉన్నాయని, వైశాలి వద్ద ఉన్న భూమి ఒరిజినల్ రిజిస్ట్రేషన్, సేల్‌డీడ్ సేకరించామని అర్ధమయ్యింది.

కొత్తగా మరో విషయం మాత్రం తెలియ జేశారు ఆయన.

వైశాలి మళ్ళీ కోర్ట్‌లో కేస్ వేసిందట.

తాను మేజర్ సూర్యనారాయణగారి ఏకైక వారసురాలననీ, తానే తండ్రి బాగోగులు చూస్తున్నానని, ఆయన ఆస్తిపాస్తుల పైనే కాక, వయోభారం పైబడ్డ తండ్రి బాగోగుల విషయంగా కూడా తనకే సర్వాధికారాలు ప్రసాదించవల సిందిగా, కోర్ట్‌లో అఫిడవిట్ ఫైల్ చేసి, విజ్ఞప్తి చేసుకుందట వైశాలి.

అంతేకాక, ఎక్కడి నుంచో వచ్చి, తన తండ్రి ఆస్తులపై ఆశతో, ప్రేమ నటిస్తూ, ఆయన్ని కష్టాల పాలు చేస్తున్న జానకి, మూర్తి గార్లని దూరం పెట్ట వలసిన అవసరం ఎంతైనా ఉందని న్యాయస్థానానికి సూచన చేస్తూ, ఫిర్యాదు కూడా దాఖలు చేసిందంటూ  వివరించారు విశ్వనాథ్‌గారు.

రెండు నిముషాల నిశ్శబ్దం తరువాత, "అయినా ఏ మాత్రం బలంలేని వైశాలిగారి అఫిడవిట్, ఆవిడ చేసిన విజ్ఞప్తికి మనం కౌంటర్ వేయవచ్చు. సొంత తండ్రిని కుట్రతో మోసం చేయడమే కాక, కోట్లు విలువ చేసే ఆస్తుల్ని కైవశం చేసుకోవాలన్న దురుద్దేశంతో తండ్రిని మతిస్థిమితం లేనివాడిగా చిత్రీక రించి, డెబ్భై ఏళ్ల తండ్రిపై ఘోరమైన నేరాలు మోపి, జైలుపాలు చేసిందని నిరూపణ అయిన పలు ఆధారాలు ఒకే అఫిడవిట్లో చేర్చి, సీనియర్ సిటిజెన్‌గా ఫాస్ట్ ట్రాక్ కోర్ట్‌కి నివేదించి, తక్షణమే వైశాలి నుండి సూత్రప్రాయంగా కూడా పూర్తి విముక్తి పొందవచ్చు" అని ముగించాడు.

అన్నీ విని అర్థంచేసుకొన్న నేను, "విశ్వనాథ్‌గారూ, న్యాయస్థానానికి అఫిడవిట్ దాఖలు చేద్దాము. వైశాలికి నా తరఫున ఓ నోటిస్, సెటిల్మెంట్ ఒప్పందం పంపుదాము. అలాగే పెద్ద కూతురు జానకికి కూడా. ఏమని ఎలా రాయాలో నేను చెబుతాను రాసుకోండి" అన్నాను ఆయనతో.

నాకు న్యాయమనిపించిన రీతిలో వాస్తవాలు సమగ్రంగా వివరించి, అన్ని డాక్యుమెంట్స్ రాయించాను.

❖ ❖ ❖

మేము న్యాయబద్ధంగా దత్తత తీసుకున్న మా మొదటి కుమార్తె జానకికి, అపార్ట్‌మెంట్స్ నిర్మాణం వల్ల మరింత నిధులు సేకరించే అవకాశం ఉందని మంచి సూచన నిచ్చిన నా రెండో కుమార్తె వైశాలికి, ప్రశాంత కాంప్లెక్స్‌లో ప్రత్యేకంగా నిర్మించిన మూడవ అంతస్తులోని అపార్ట్మెంట్స్ చెరొకటి రాసి రిజిస్టర్ చేయించే ఏర్పాటు చేయించాను.

మహావీర్ హిల్స్ స్థలంలో అపార్ట్మెంట్స్ కట్టించి విక్రయించగా వచ్చిన నిధు లతో, నా భార్య పేరిట 'ప్రశాంత సేవాసదన్' స్థాపించి, సీతారాముల గుడి కూడా కట్టించాలని నా ఆశ. 'సేవా కుటీరంలో' స్వచ్ఛందంగా వృద్ధులకి సేవ లందించాలన్నది నా ఆశయం. ఆ కార్యసిద్ధి కోసం 'ప్రశాంత సేవా సదన్',

'ప్రశాంత సేవా ట్రస్ట్' సంస్థలు రిజిస్టర్ చేయించాను.

నా తదనంతరం ఖైరతాబాద్ ఫ్లాట్ నా మనవడు రాజుకి చెందేలా ఏర్పాటు చేయించాను.

నే చెప్పిన విధంగా దస్తావేజులు తయారు చేయించి, నా తరఫున విధులు నిర్వహించవలసిందిగా లాయర్‌గారికి ఆదేశాలు ఇచ్చాను.

❖ ❖ ❖

పుష్కర కాలం గడిచి పోయింది. మేజర్‌గారు 'ప్రశాంత సేవా సదన్' నిర్వహిస్తూ సమాజ సేవలో నిమగ్నులయ్యారు.

❖ ❖ ❖

వందలాది కార్లు ఆ రోజు 'ప్రశాంత సేవా సదన్' ఆవరణలోని 'శ్రీ సీతారామ ఆలయం' చుట్టూ ఆగి ఉన్నాయి. ఆ నాటి ఆశ్రమ దశాబ్ది వేడుకలని, జరగబోయే కార్యక్రమాన్ని దగ్గరుండి చూస్తూ అజమాయిషీ చేస్తున్నారు మూర్తి, జానకి.

అంతేకాకుండా మేజేర్ సూర్యనారాయణగారి ఎనభై రెండవ పుట్టిన రోజు పండుగ ఆశ్రమంలోని వృద్ధులు, వికలాంగులు, అనాధలు – అంతా కలిసి గుడి ఆవరణలో జరుపుకుంటున్నారు. ఆవరణ కిక్కిరిసి ఉంది.

పదేళ్ళ క్రితం ఉన్నతమైన ఆశయాలతో స్థాపించిన ఆ ఆశ్రమ సేవల్లో పెద్దాయనకి అండగా నిలవడం తమ అదృష్టంగా భావించిన ఆయన పెద్ద కూతురు జానకి, అల్లుడు మూర్తి అంకిత భావంతో అక్కడే పనిచేస్తూ మేజేర్‌గారిని కనిపెట్టుకొని ఉంటున్నారు.

ఆశ్రమంలోని ఆ నాటి హడావిడికి కారణం మరొకటి కూడా ఉంది.

భారత దేశంలోనే 'ప్రశాంత సేవా సదన్' అత్యుత్తమ వృద్ధ, అనాధ స్వచ్ఛంద సేవా సంస్థగా గుర్తింపు పొందిన సందర్భంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ ప్రత్యేకంగా విచ్చేసి సభాముఖంగా మేజేర్‌గారిని పుట్టిన రోజున అభినందించనున్నారు. సంస్థ సేవలని గుర్తించి, కొనియాడి, ప్రభుత్వం కూడా సంస్థ సేవలో భాగం పంచుకోవాలని ఆశిస్తూ చేయూతనిస్తామని కూడా ప్రకటించనున్నారు.

❖ ❖ ❖

కార్యకమం మొదలయ్యి ప్రసంగాలు కూడా ముగిసాయి. జరగవలసిన అన్ని అంశాలు చక్కగా పూర్తయ్యాయి. సన్మాన కార్యకమం జరగబోతుంది.

మేజేర్‌గారిని వేదిక పైకి ఆహ్వానించారు. అయన జాడ లేదు. జానకి, వైశాలి ఆత్రుతగా నాన్న కోసం చూస్తున్నారు.

కాసేపటికి ఓ పసిగుడ్డుని చేతుల్లో పొదవి పట్టుకొని, ఇరువైపులా అనాధాశ్రమ యువకులు చేయూత నివ్వగా, వేదిక వద్దకు వచ్చారు మేజేర్‌గారు.

"అమ్మా జానకి" అని పిలచి ఓ పసికందుని జానకి చేతుల్లో ఉంచారు.

"సన్మానాలు, సత్కారాలు నాకు కాదు, త్యజించబడి, మనుగడ కోసం కొట్టు మిట్టాడుతున్న ఇటువంటి పసివారికే చెందాలి. నన్ను మన్నించండి" అన్నారు.

"ఇంతకు మునుపే ఆశ్రయం కోసం మన ఆశ్రమం చేరింది ఈ కళ్ళు కూడా తెరవని అనాధ. 'శాంత' అని పేరు పెడదాము" అంటూ జానకిని, వైశాలిని పసిబిడ్డతోపాటు వేదిక పైకి నడిపించి, తాను తెర వెనుక ఉండిపోయారు మేజేర్ సూర్యనారాయణగారు.

"మా నాన్న ఒట్టి పిచ్చివాడు. ఇలాంటి గుర్తింపు, సన్మానాలని కూడా తృణ ప్రాయంగా త్యజించగలవాడు పిచ్చివాడే" అంది వైశాలి అందరికి వినబడేలా.

వెంటనే జానకి, "నీ దృష్టిలో నాన్న పిచ్చివాడు అయితే, మా నాన్న నా దృష్టిలో మహానుభావుడే!" అంది నవ్వుతూ.

అంతలో ఆకలికేమో ఆ పసిది ఏడవడం మొదలెట్టింది.

❖

*జీవితంలోని కష్టనష్టాలని అధిగమించి,*
*సమాజానికి అత్యుత్తమ సేవలందించిన*
*ఓ గొప్ప వ్యక్తి గాధ ఇది!*




**నా**లుగు వేదముల నుండి నాలుగు నాట్యాంగములను గ్రహించి, బ్రహ్మ దేవుడు 'నాట్యవేదము' నిర్మించెనని భరతుని 'నాట్యశాస్త్రము' చెబుతుంది.

త్రేతాయుగములో ఐదవ వేదంగా సృష్టించబడిన నాట్యశాస్త్రాన్ని దేవతలతో పోరాడి శివుని అనుగ్రహంతో మానవకోటికి అందించిన వాడు భరతముని.

'దుఃఖార్తానాం శ్రమార్తానాం శోకార్తానాం తపస్వినాం

**కోసూరి ఉమాభారతి**

*లోకోపదేశ జనన కాలే నాట్యమే తద్భవిష్యతి'*

'నాట్యము' ఉపదేశాత్మకమే కాక, హితమును, ధైర్యమును, క్రీడను, సుఖమును కూడా కలిగించుననీ... దుఃఖార్తులకు, శ్రమార్తులకు, శోకార్తులకు, దీనులకు, విశ్రాంతి కలిగించునని 'నాట్యశాస్త్రము' నందు సూచింపబడినది. ఇంకనూ, భావ రాగ తాళ సమ్మేళనమై, త్రైలోక్య అనుకరణమై, మనసుకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగింపజేసే నవరసభరితమయిన కళ – 'నాట్యమే'నని బ్రహ్మదేవునిచే వివరించబడినది. *(నాట్యశాస్త్రము–నాట్యోత్పత్తి)*

❖ ❖ ❖

పలు యుగాల అనంతరం, భూలోకాన మానవులు నాట్యవేదాన్ని ఎంత మాత్రం సద్వినియోగ పరుస్తున్నారో చూద్దామని, ఓ ఆలోచన కలిగింది స్వర్గ లోకాన ఉన్న భరతమునికి. దానికి రెండు కారణాలు : ఆంధ్రదేశాన 'నాట్యం' యొక్క తీరుతెన్నుల్లో చిత్రవిచిత్రమైన మార్పులు వచ్చాయని వినడం వల్ల కొంత, స్వర్గలోకంలో నండూరివారి భావగీతాలు – ఎంకి – జానపద నృత్యరీతి వర్ణనలు విని ఆసక్తి పెరిగి మరికొంత.

మొత్తానికి మహాశివుని అనుమతితోనే, తన భూలోక పర్యటనకి ముహూర్తం పెట్టాడు భరతముని. ఆయన పర్యటన నిమిత్తం సహాయకురాలిగా 'నర్తకి' అనే కళాకారిణి నియమించబడింది.

ఆవిడ పుడమిన, నృత్య కళాకారిణిగా పేరు ప్రతిష్టలు గడించి, ఓ మంచి జీవనాన్ని సాగించిన పిదప, స్వర్గం చేరి భరతమునికి సహాయకురాలిగా పదవి చేపట్టింది. ప్రస్తుత భూలోక పద్ధతీ, మర్యాదలు బాగా తెలిసిన మనిషి కూడా కావడంతో, తన వెంట 'భూలోక పర్యటన'కి నర్తకినే ఎంచుకున్నాడు భరతముని.

అనుకున్న ప్రకారం, నిర్దేశించిన ముహూర్తానికే 'భూలోక పర్యటన'కి బయలు దేరారు భరతముని, నర్తకి.

అలా పుష్పక విమానంలో పయనించి శివరాత్రి పర్వదినాన, అర్ధరాత్రి సమ యాన, శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో ఆగారు.

భక్తకోటి జాగరణ కోసం, భజన, హరికథ, 'శివలీల' నృత్య నాటిక ప్రదర్శనలు మహా జోరుగా సాగుతున్నాయి.

అందమైన నృత్య కళాకారిణులు కొందరు శివతాండవ నృత్యము, రావణ

బ్రహ్మ నటనము వంటి అంశాలు ప్రదర్శించారు.

ఆలయ ప్రాంగణంలో అదృశ్యంగానే ఉండి, ఆ దృశ్యాలని తిలకించారు వారు.

"సౌందర్య కళా నైపుణ్యంతో యువ నర్తకీమణులు, ఇలా భావ రాగ తాళ యుక్తముగా నర్తించుచున్న దృశ్యము కంటే, సుందరమైనది ఈ ప్రకృతిలో వేరు లేదేమో!" అంటూ ఆ అద్భుతమైన నాట్యాన్ని, ఆ మధుర గానాన్ని మెచ్చు కుంటూ తిరిగి పుష్పక విమానంలో బయలుదేరాడు భరతముని నర్తకితో.

❖ ❖ ❖

స్వర్గాన నండూరివారి భావగీతాలు, ఎంకి వర్ణనలు ఆలకించి ఆనందించిన భరతముని ఆంధ్రదేశానికి ఆయువు పట్టయిన పల్లెసీమల వైపు మళ్ళించాడు పుష్పక విమానాన్ని.

ఆ పచ్చని పొలాల వైపు చల్లగా, హాయిగా ప్రయాణం చేస్తున్న సమయంలో, ఆడుతూ పాడుతూ పని చేసుకొంటున్న పల్లె పడుచులు కొందరు...

చక్కని జానపద గీతాలని ఆలపిస్తూ మరికొందరు...

వీరి పాటలకి లయబద్ధంగా అడుగులు వేస్తూ వయ్యారులు ఇంకొందరు భరతుని కంట పడ్డారు.

అలుపనేది తెలియకుండా పాడుకొంటున్న వారి జానపదాలకి... వారి పల్లె తనపు వేషధారణకి ముగ్ధుడయ్యాడు భరతముని.

మెళ్ళో పూసల పేరు, తల్లో మొగలి రేకులు తురిమిన పల్లెపడుచు అచ్చంగా తాను ఊహించిన నండూరివారి ఎంకిని తలపిస్తుంటే, ఆయనలోని కళాహృద యం స్పందించి కవిత్వం పెల్లుబికింది.

*ముద్దుల మోమున బొట్టెట్టి*
*చక్కని చెక్కిట చుక్కెట్టి*
*నింగిన కదిలే జాబిల్లీ*
*మనసున విరిసే మరుమల్లే*

*సిరిగల జుత్తును సిగగట్టి*

సన్నని నడుముకు గొలుసెట్టి
పుడమిన ఆడే చిరునెమలి
జగతిన నిండిన వెన్నెలలే

తామర కన్నుల కాటుకెట్టి
మెత్తని పదముల మువ్వలెట్టి
చిరు సిరి నగవులు చిందించి
నటనల నర్తన మాడేలే....

– అంటూ సాగి, ఆయన గళం నుండి వెలువడిన చక్కని కవితకి, నర్తకి ముగ్ధురాలయ్యింది.

"స్వర్గంలోని అప్సరలు ముక్కెరలు... మంజీరాలు... పట్టు పీతాంబరాలు ధరించి సాంప్రదాయ నృత్యాలు చేస్తారే తప్ప, ఇలా కాళ్ళకి కడియాలు... మోకాళ్ళ వరకు చేలములు... కొప్పు చుట్టూ బంతిపూలు అలంకరించరు కదా! భావగీతాలకి అడుగులు వేయరుకదా! ఎంకి తీరులోనూ, జానపద రీతిలోనూ నవ్యత ఉంది సుమా!" అంటూ భరతముని నర్తకితోపాటు మళ్లీ పుష్పక విమానంలో బయలు దేరాడు.

తెలుగువారు సాంప్రదాయ నృత్య కార్యకమాల్లో కొంత జానపద నృత్యం కూడా చేస్తూ ఉంటారని, ప్రజాదరణ పొందిన జానపదాల్లో 'మొక్కజొన్న తోటలో' అంటూ సాగే ఓ ఎంకి పాటకి నృత్యం చేసినా, చూసినా ఆహ్లాదకరంగా ఉంటుందని నర్తకి వివరించింది.

❖ ❖ ❖

ఈసారి కళలకి పుట్టిల్లయిన మద్రాసు (చెన్నై) మహానగరం వైపు దారి తీసి, సరాసరి 'వాహిని' సినీ నిర్మాణ స్టూడియోలో దిగారు.

బాల గాయకుల కోసం చిత్ర నిర్మాతలు ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు.

అంతటా కోలాహలం.

ఎందరో బాలబాలికలు ఆ పోటీలో పాల్గొన్నారు.

వాళ్ళ తల్లిదండ్రుల్లో కూడా ఎంతో ఉత్సాహం కనబడింది భరతమునికి.

అందరూ చక్కగా పాడుతున్నారు.

ప్రత్యేకంగా ఓ పదేళ్ళ కుర్రవాడు, 'పల్లెకు పోదాం, పారుని చూదాం' అంటూ తానెంచుకొన్న చక్కని పాట ఆలపించి  ఆ పోటీలో నెగ్గి అందరి అభిమానం పొందాడు.

"బ్రహ్మంగారు చెప్పినట్టు కలియుగాంతానికి ప్రతీ ఇంట పాటా, ఆటా ఉన్నాయన్నమాట. లలితకళలన్నా, నాట్య సంగీతాలన్నా ప్రజలకి ఇంత మక్కువన్న మాట! బాగానే ఉంది, నర్తకీ!" అంటూ కళాభిమానులైన అక్కడి వారిని ప్రశంసిస్తూ నర్తకితో ముందుకు సాగాడు భరతముని.

కొంత దూరంలోనే మరోపక్క కొందరు నర్తకులు విభిన్న రీతుల్లో నృత్య ప్రదర్శన చేయడం తిలకించారు వారిరువురు.

వారు చేస్తున్నది ఓ సినిమాకని వివరించింది నర్తకి.

వారు చేసేవి నూతన నాట్యరీతులని, అవి నృత్య వేదికలపై పదర్శనలకి కాక తెరపై చూసే వినోదానికి – అంటే సినిమాకే పరిమితమని కూడా వివరించింది నర్తకి.

అటనుండి వెడలి చెన్నై పట్టణమంతా తిరుగుతూ, అక్కడ జరిగే ఎన్నో నృత్య ప్రదర్శనలు, సంగీత సాధనములు – అలాగే సర్వోపనిషత్సారమైన భగవద్గీత ప్రబోధనలు తిలకించి, ఆలకించి ఆనందించారు.

నాట్య, కళారంగాలలో క్రమంగా చోటుచేసుకుంటున్న మార్పుల గురించి నర్తకితో ప్రస్తావిస్తూ ప్రయాణం సాగించాడు భరతముని.

"నాట్య సంగీతాలకి కూడా ఎదుగూ బొదుగూ ఉండాల్సిందే! కళ అనేది కాలానుగుణంగా పద్ధతి ననుసరించి పరిధిలోనే ఉంటూ కళాత్మకమైన మార్పులని సంతరించుకోక తప్పదు మరీ" అన్న భరతముని విశ్లేషణ నచ్చింది నర్తకికి.

"భావంలో, గీతంలో, నాట్యంలో నవ్యత రావాల్సిందే కదా! బాగుంది బాగుంది" అని అయన అనడం విశేషం అని నర్తకి భావించింది.

❖ ❖ ❖

సంక్రాంతి చలిలో, అలా వారి పయనం సరదాగానే సాగి విజయనగరం చేరారు.

విజయనగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణం భక్తులతో,

సంక్రాంతి సంబరాలతో, కిటకిటలాడుతున్న సాయం సమయమది. సంక్రాంతికి పిల్లల భోగిపళ్ళు, పెద్దవాళ్ళ గారాబాలు, దేవెనలు అన్నీ తిలకించారు భరతముని, నర్తకి.

ఆ రోజు సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా నాయనమ్మల చుట్టూ చేరి మనవలూ, మనవరాళ్ళూ పాడుతూ ఆడుతూ గింగిరాలు తిరగడం, చాల ముచ్చటేసింది వారివురికీ.

*'నాయనమ్మా, నాయనమ్మా వాడని ప్రేమే నీదమ్మ,*
*అమ్మ నాన్న కొట్టినప్పుడు ఆదరించి, నను లాలించేవు*
*అడగక ముందే అన్నీ ఇచ్చి దేవతలాగా దీవించేవు'*

అన్న పాటకి పిల్లలు నానమ్మల కోసం చక్కగా అడుగులు వేయడం నచ్చింది భరతమునికి. ఇదంతా ప్రతి సంక్రాంతికి ఆ గుడి ఆవరణలో ఆ చుట్టుపక్కల కుటుంబాలన్నీ కలిసి జరుపుకొనే సంబరమని ఆయనకి వివరించింది నర్తకి.

తీర్థ ప్రసాదాలనంతరం తిరిగి పుష్పకంలో బయలుదేరారు వారిరువురు.

❖ ❖ ❖

హైదరాబాద్ మహానగరంలోని అధునాతన నృత్యరీతులందు శిక్షణనిచ్చు స్టూడియోలో అడుగిడిన భరతముని, సంభ్రమాశ్చర్యాల్లో మునిగాడు.

వారు ధరించిన దుస్తులు, అలంకరణలు, కదిలకలు, గమ్మత్తైన సంగీతం గమనిస్తూ ఆలోచనలో పడ్డాడాయన.

"నాట్యము దేశ, కాల, పాత్ర బద్ధమై ఉండదని 'నాట్యశాస్త్రము'లోనే పస్తావించాము కదా! మరి మారుతున్న కాలాలు, చోటుచేసుకొంటున్న మార్పులు, కలిసి పోతున్న సంస్కృతుల ననుసరించి మార్పు తప్పదు కదా! మార్పు మంచిది కావచ్చు కూడా నర్తకీ" అంటూ సాగిపోయాడు భరతముని.

అదే సంగతిపై కొనసాగిస్తూ, "నాట్యాన్ని ఆధారం చేసుకొని పాశ్చాత్య దేశాల్లో, ఆరోగ్య మెరుగుదల కోసం, ఎంతో వినియోగం ఉన్న కార్యక్రమాలు పెద్దెత్తున జరగడమనేది గమనించి, ప్రశంసించవలసిందే, గురువు గారూ" అని నర్తకి మరో తాజా సమాచారం అందించింది.

"అంతే కాదు, 'జూంబా' (Zumba), 'డిస్కో కార్డియో' (Disco Cardio), లాంటి వ్యాయామ పద్ధతులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నృత్యరీతులే ఆధారమయ్యాయి" అంటూ ముగించింది నర్తకి.

ఎంతో ఉత్సుకతతో వింటూ అంతా గమినిస్తున్న భరతమునితో, "అంతేకాదు మునివర్యా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మరెన్నో నృత్య రీతుల్ని, నాట్యపరమైన ఎన్నో విశేషాలు, విషయాలు తెలుసుకోవడానికి మనం వీలుచేసుకొని మరోసారి మరో పర్యటన చేయవచ్చు" అంటూ నింపాదిగా అటనుండి కదిలింది నర్తకి, భరతముని ననుసరిస్తూ.

"కాకపోతే, ఈసారి పర్యటన అంటూ చేసినప్పుడు అదృశ్యంగా కాకుండా, అన్నీ ప్రత్యక్షంగా తిలకించవలె నర్తకీ" అన్నాడు చిరునవ్వుతో భరతముని.

ఇలా మరో వారంపాటు కోనసీమంతా ప్రయాణించి, తిరిగి స్వర్గలోకం వెళ్ళాలని నిశ్చయించుకొని విశ్రాంతి కోసం మైసూర్‌లోని బృందావనం వైపు పుష్పకం మళ్ళించాడు భరతముని.

వారి పర్యటన ఇలా కొనసాగుతూనే ఉంటుంది.

❖

*నాట్యశాస్త్రాన్ని*
*మానవకోటికి అందించిన*
*భరతుని గూర్చి*
*ఓ ఊహాత్మక కథనం!*




'టెక్సాస్ ప్రాంతీయ తెలుగు సంఘం' వారు 'మదర్స్ డే' సెలెబ్రేషన్ నిర్వహిస్తున్నారు. ఇండియా నుంచి వచ్చిన మాలో కొందరు మాతృమూర్తులచేత 'మదర్స్ డే' కేక్ కట్ చేయించి సన్మానించుకున్నాము. పెద్దవాళ్ళని సరదాగా ఆటలు

ఆడించి, పాటలు పాడించాము కూడా!

పసిబిడ్డని వీపున మోస్తూ టీ ఎస్టేట్‌లో పనిచేస్తున్న ఓ తల్లి చిత్రం కవరుగా వేయించి అందరికీ పర్సనల్ డైరీలు కానుకగా ఇచ్చారు. ఆ చక్కని చిత్రం కింద 'అమ్మతనం అద్భుత వరం' అని రాసుంది.

ఎంతో ఆహ్లాదంగా జరుగుతున్న కార్యక్రమంలోని తరువాతి అంశం షడ్రుచుల విందు. విందారగిస్తున్న సమయంలో ప్రత్యేకంగా ఎంపిక చేసిన మంచి 'అమ్మ' పాటలు ఆలపిస్తున్నారు సంఘం వారు.

*'ధరణికి గిరి భారమా?*

*గిరికి తరువు భారమా?*

*తరువుకు కాయ భారమా?*

*కనిపెంచే తల్లికి పిల్ల భారమా?...'*

ఆ పాట నా జ్ఞాపకాల్లో ఉండిపోయిన పాట.

నా చిన్నపుడు రేడియోలో తరచు వినవచ్చిన ఆ పాట నా కెంతో ఇష్టం. అప్పట్లో మా అమ్మని అర్థం అడిగి తెలుసుకున్నాను. ఎప్పుడూ నాలో మెదిలే ఆ పాటలోని అంతరార్థం, సందేశం నా జీవితంలోని ఒక్కో మలుపులో ఒక్కో ప్రాధాన్యతని సంతరించుకొంది. ఒక్కోరకమైన అనుభూతిని కలిగించింది. ఒక్కోరకమైన స్పందన కలిగించింది.

"తల్లి' అనే ఆ రెండక్షరాల్లో ఉన్న మహత్యమేమో! పసితనంలో తల్లిపై ఆధార పడటాలు... వివాహమయ్యాక తల్లినవ్వాలన్న తాపత్రయాలు... తల్లయ్యాక మమ కారాలు, అనుభూతులుగా సాగుతుంది కదా ఓ ఆడపిల్ల జీవితం' అని అను కుంటూ లేచి వెళ్ళి కట్ చేసిన 'మదర్స్ డే' కేక్ ముక్క తెచ్చుకొన్నాను.

ఆలోచిస్తూ కేక్ తింటున్న నన్ను మా ఫ్రెండ్ వసంత వాళ్ళ అమ్మగారు పలకరించారు.

"మంచి పాటలు వేస్తున్నారమ్మా శ్రావణి. ఈ 'అమ్మ' పండుగ బాగా జరుపు కుంటారు మీరిక్కడ. అమ్మ త్యాగాల్ని గుర్తిస్తూ ఒక రోజు కేటాయించారన్నమాట" అంటూ నవ్వారు ఆమె.

ఇంతలో మా తెలుగు సంఘం అధ్యక్షురాలు వసంత మైక్ ముందుకు వచ్చి, 'అమ్మతనం, అమ్మతనంలోని కమ్మదనం' అనే శీర్షిక తీసుకొని చక్కగా ఉపన్య

సించారు. మా అందరిని 'అమ్మ' అనే టాపిక్ మీద రెండు నిముషాలు ఏదైనా చెప్పమన్నారు.

సంఘం సెక్రెటరీ మల్లిక ముందుగా మైక్ తీసుకొంది.

"బిడ్డల కోసం, వారి అభివృద్ధి కోసం ఎంతటి కష్టతరమైన కార్యమైనా తప్పక చేపడుతుంది తల్లి. అందుగ్గాను ఆ తల్లికి తన ఆరోగ్య, ఆర్థిక, మానసిక పరిస్థితులు అడ్డంకులు కలిగించలేవనేది తెలిసిన సత్యమే" అంటూ చక్కని మాటలు పొందు పరిచింది తన ప్రసంగంలో.

నా వంతు వచ్చింది.

'అమ్మ' విషయాలే గుర్తుచేసుకుంటున్న నాకు మాట్లాడ్డం కష్టమనిపించలేదు.

"మా పెద్దమ్మ వాళ్ళ పనిమనిషి పదేళ్ళ కొడుకు ఆరోగ్యం పాడైతే, చికిత్స చేయించడానికి బోలెడంత డబ్బు అవసరమైందట. రత్తాలు అనే ఆ మనిషి తన కిడ్నీ ఒకటి అమ్మేసి కొడుక్కి వైద్యం చేయించిందని పెద్దమ్మ చెబితే విని, అదో తల్లి మాత్రమే చేయగల త్యాగమని పద్నాలుగేళ్ళ వయస్సులో అర్థం చేసుకున్నాను.

"కాస్త ఎదిగిన బిడ్డలు సహకరించక పోయినా, వారి ఉన్నతికి తల్లి అన్వేషించని మార్గం ఉండదని తెలుసుకొన్నాను. చదువుల్లో వెనుక బడిన బిడ్డకి ట్యూషన్ పెట్టించి సహాయం అందేలా చూస్తుంది తల్లి. క్రీడల్లో రాణించకపోతే ప్రత్యామ్నాయాలు చూపిస్తుంది అమ్మ. తల్లి ఓ అమృతవల్లి, ఓ త్యాగమయి" అని నా మాటలు ముగించాను.

వసంత అమ్మగారు మాట్లాడుతూ, "కొందరు బిడ్డలు అన్నిటా అయిష్టత చూపి ఏదీ కుదరదంటే, నిరుత్సాహ పడకుండా అదే అంకిత భావంతో, అప్పు చేసైనా సరే కనీసం బడ్డీ కొట్టయినా పెట్టించి బిడ్డని స్వతంత్రుడిగా నిలబెట్టాలనే చూస్తుంది తల్లి. అంతటి నిస్స్వార్థ ఆలోచన ఓ తల్లికి మాత్రమే ఉంటుంది" అని క్లుప్తంగా ముగించారు ఆవిడ.

తరువాత మా పక్కింటి కారుణ్య వంతు వచ్చింది. ఆవిడ మాటకారి.

"బిడ్డలు అలిగినా, తొలిగినా అమ్మ పట్టించుకోదు. పెరిగి పెద్దవారైన బిడ్డలు ఆదరించక పోయినా చెదరేది కాదు 'అమ్మ ఐదువేళ్ళ సిద్ధాంతం'. 'చేతికున్న ఐదు వేళ్ళు సమానం కాదుగా! ప్రేమించి ఆదరించే పిల్లలున్నట్టే, ద్వేషించి

వ్యధ పెట్టే వారు ఉంటారు. ఆ చేతికి అన్ని వేళ్ళు ఒక్కటే! జీవితం చాలా చిన్నది. బిడ్డల్లో ఎవరెలాంటి వారైనా పట్టించుకోను. నా బిడ్డల సేవలోనే చేతనయినంత కాలం ఉంటాను' అంటుండే మా అమ్మ లాంటి మరి కొందరు తల్లులు నాకు తెలుసు" అని తన ప్రసంగం ముగించింది ఆమె.

❖ ❖ ❖

విందు ముగిశాక ఇంటి దారి పట్టాను. ఓ గంట ప్రయాణం.

సన్నగా పాత హిందీ పాటలు వింటూ డ్రైవ్ చేస్తున్నాను.

పదిహేనేళ్ళుగా అమెరికాలో ఉంటూ ఎంతో చూశాను. మరెంతో నేర్చుకున్నాను. తల్లి, తల్లి ప్రేమ విషయంగా ఓ రెండు సంఘటనలు మాత్రం నా మనసులో ఉండిపోయాయి. ఎన్నేళ్ళయినా ఇప్పుడు జరుగుతున్నట్టుగా మెదులుతాయి నాలో ముద్రించుకు పోయిన ఆ సంఘటనలు.

దారి సాఫీగా ఉండడంతో హాయిగా డ్రైవ్ చేస్తూ తిరిగి ఆ జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయాను.

అది నేను అమెరికా వచ్చిన కొత్తల్లో....

న్యూయార్క్‌లో ఓ లోకల్ సర్జికల్ సెంటర్‌కి ఆఫీస్ మానేజర్‌గా పనిచేసేదాన్ని. మా బాస్, చీఫ్ సర్జన్, వాళ్ళ కొత్తింటి గృహప్రవేశంకి ఆహ్వానించారు. నాతోపాటు అమెరికన్స్ కొందరికి ఇల్లు చూపిస్తూ, కాస్త దూరంగా వేరుగా ఉన్న ఓ విశాలమైన గదిలోనికి తీసుకువెళ్ళారు.

ఆ పొందికైన గదిలో ఓ పెద్దావిడ సోఫాలో కూర్చుని టివి చూస్తున్నారు. సర్జన్‌గారి అమ్మగారట. పలకరించి బయటకి వస్తుంటే, ఆయన తెలుగులో నాతో, "నేను పెళ్ళిచేసుకొన్న అమ్మాయిని చూశారుగా – తెల్లగా, అందంగా ఉంటుంది. నార్త్ ఇండియన్, శాఖాహారి. మంచి కల్చర్ ఉన్న వాళ్ళు. మా అమ్మకేమో చదువు లేదు, దొడ్డుగా మోటు మనిషి, నలుగురితో మెలిగే సంస్కృతి తెలియదు. వాళ్ళందరితో కలవాలంటే ఇబ్బందని, ఈ గదిలోనే ఉండమంటాను. అన్ని సౌకర్యాలు అమర్చాను. ఎన్నో వసతులు కల్పించాను" అన్నాడు మా బాస్.

ఆయన అతిశయానికి, ఆలోచనకి విస్తుపోయాను.

❖ ❖ ❖

ఆ సంఘటన జరిగి రెండేళ్ళయ్యాక, అమ్మ ఎలా ఉన్నారని ఓసారి ఆయన్నే అడిగాను. వృద్ధురాలైన తల్లికి మతి మరుపు ఎక్కువయ్యిందని, పైగా రాత్రిళ్ళు నిద్ర పోకుండా ఇల్లంతా తిరుగుతుండడం వల్ల, గదికి గేటు – అంటే కటకటాలు పెట్టించానని చెప్పారు.

"వృద్ధాశ్రమానికి మాత్రం వెళ్ళను. నీ దగ్గరే ఉంటాను. ప్రతి రోజు ఒక్కసారి వచ్చి నాకు కనపడు కన్నా, నాకంతే చాలు" అందట ఆవిడ కొడుకుతో.

ఆవిడని చూడాలనిపించి ఓరోజు సర్జన్‌గారి అనుమతితో వాళ్ళింటికి వెళ్లాను.

నే వెళ్ళేప్పటికి అమ్మ అప్పుడే లేచి సాయంత్రం వేళ టీ తాగుతున్నారు.

వెళ్ళి దగ్గరే కుర్చున్నాను. కబుర్లాడుతూ మాటల్లో ఆవిడే చెప్పారు.

"ఈ మధ్య రాత్రిళ్ళు గుండెల్లో మంటగా ఉండడంతో కాస్త లేచి ఇంట్లో నడుస్తుంటే, పిల్లలకి, కోడలు పిల్లకి నచ్చలేదమ్మా! చీకట్లో నన్ను చూసి జడుసు కున్నారు కాబోలు పిల్లలు – అందుకే ఈ గేటు పెట్టించారు. ఇక అటుగా వెళ్ళ కుండా గుర్తుపెట్టుకోవచ్చు. ముట్టుకుంటే మాసిపోయేలా అందంగా ఉంటారు నా మనమరాళ్ళు. వాళ్ళని ఎత్తుకోవాలంటే నా కసలు చిక్కరుగా! రోజూ నా గది వరకూ పరుగులు పెడుతుంటారులే... ఒక్కసారైనా కనబడతారు నాకు" అంది ఆ తల్లి.

అవిడని చూసి, 'ఎందుకీ ఖర్మ... హాయిగా స్వేచ్ఛగా తిరుగుతూ, అందరితో మాట్లాడుతూ ఉండచ్చు. ఎంచక్కా వృద్ధాశ్రమంలో చేరక' అనుకున్నాను. అదే అభిప్రాయం ఆవిడ దగ్గర వ్యక్తపరిచాను.

"అలా వెళ్తే, నాకు నెలవారిగా వచ్చే సోషల్ సెక్యూరిటీ డబ్బు అక్కడ వృద్ధాశ్ర మం వాళ్ళకి ఇవ్వాలటగా? అందుకే ఆ వచ్చే డబ్బేదో నా మనమరాళ్ళకి అట్టే పెట్టవచ్చని నేనే ఇక్కడే ఉంటానన్నాను" అంటున్న ఆమెని చూసి నా మనసంతా గుబులుతో నిండిపోయింది.

ఆమెలోని ఆ మాతృత్వపు ప్రేమ పొరల్లోకి తొంగి చూడగలిగాననిపించింది. ఆవిడలోని మమతకి మనస్సులోనే జోహార్లు అర్పించాను.

తన బిడ్డ రోజుకోసారైనా కంటబడితే చాలనుకొనే తల్లి. అందుకోసం తన ఉనికిని, స్వాతంత్ర్యాన్ని కూడా త్యాగంచేసి ఆగర్భ శ్రీమంతులైన బిడ్డలకి ఇంకా తన వంతు సంపదలు అందించాలన్న ఆవిడ తాపత్రయం అర్ధమయ్యి నవ్వొ

చ్చింది కూడా!

❖ ❖ ❖

పెళ్లయ్యాక, హ్యూస్టన్ నగరంలోని ఓ చిన్న హాస్పిటల్లో పేషంట్ మానేజర్గా చేరాను.

ఓ రోజు మధ్యాహ్నం మూడు గంటలకి ఆఫీస్ నుండి ఇంటికి వెళుతున్నాను. భీభత్సంగా వాన, ఈదుపు గాలి. డ్రైవింగ్ కూడా అసాధ్యమనిపించింది.

ఎదురుగా నాలుగు రోడ్ల కూడలిలో తడిసి ముద్దవుతూ మా నైబర్(పక్కింటి) వినీత హడావిడిగా పరుగులాంటి నడకతో వెళుతోంది. ఆమె కార్ డ్రైవ్ చెయ్యదని తెలుసు. ఆమె భర్త జార్జ్ ఆమెని ప్రతిరోజు పనికి తీసుకెళ్ళి తీసుకొచ్చేవాడు. ఇలా డ్రైవ్ చెయ్యని మన మహిళలు కొందరున్నారు అమెరికా దేశంలో. ఆమె చాలా కాలంగా రిజిస్టర్డ్ నర్సుగా గవర్నమెంటు హాస్పిటల్లో పనిచేసి ఈ మధ్యనే రిటైర్మెంట్ తీసుకొంది.

'ఏమిటిలా ఈవిడ తుఫానులో ఈ పరుగులు' అనుకుంటూ ముందుకి వెళ్ళి కార్ ఓ పక్కగా ఆపుకొని, కార్ నుండి దిగి, బిగ్గరగా పిలిచాను. గాలి హోరుకి నా గొంతు నాకే వినబడేలా లేదు. చేసేదిలేక వానలో ఆమె వెనకే పరుగు పెట్టి ఎలాగో చేయందుకొని నా కార్లోకి తెచ్చాను. ఇద్దరమూ ముద్దయిపోయి ఇల్లు చేరాము. కార్లో గమనించాను – ఆమె ముఖాన వర్షపు నీళ్ళు కావు, కన్నీళ్ళని.

మా ఇంట్లోకి వచ్చి కాసేపు కూర్చుంది వినీత.

ఎంతో బాధగా చెప్పింది విషయం. ఇరవై నాలుగేళ్ల కొడుకు ఇంజినీరింగ్ చదువులో ఉన్నాడుట. వాడి అలివి కాని కోరికలన్నీ తీరుస్తూ చదివిస్తున్నారుట. అతని విఫలమైన ప్రేమతో మొదలైన సమస్య చిలికి గాలివానలా అయ్యి, అదుపులేని కోపంగా మారి, అమ్మని కొట్టడం వరకు వచ్చిందట.

చదువు మానేసి ఇంటచేరి తమని బెదిరిస్తూ బయట ఇతర దేశస్తులతో, పోలిస్తో గొడవలు తెచ్చుకొని జైలు పాలయ్యడట కూడా! అష్టకష్టాలు పడి డబ్బు గుమ్మరించి బయటకి తెచ్చి, బతిమిలాడి, బామాలి, కాళ్ళు పట్టుకొని మనస్తత్వవేత్త దగ్గరికి తీసుకువెళ్ళగలిగారట. మందులు వేసుకొంటే నయమయ్యే అవకాశం ఉన్నా తమని చిత్రవధలు పెడుతూ, మందు వేసుకోవడం లేదని వాపోయింది వినీత.

"ఈ రోజు ఇంతటి వానలో..," అని సంశయించాను – "మీవారు ఇంట్లో లేరా?" అని అడిగాను.

భర్త జార్జ్ పొద్దుటే పనికి వెళ్ళిపోయాక, అత్యవసరంగా తనకి పాటలు వినడానికి స్పీకర్స్ కావాలని మంకుపట్టు పట్టాడట కొడుకు. చేసేదిలేక, వాడికి కోపం వస్తుందేమో అన్న భయానికి ఆ వర్షంలోనే బయలు దేరారట. వాల్మార్ట్‌లో స్పీకర్స్ కొని ఇంటికి బయలుదేరి సగం దూరం వచ్చాక, అకారణంగా పోట్లాట పెట్టుకొని తనని దారిలోనే క్రూరంగా కార్లోంచి దింపేసి వెళ్లిపోయాడట ఆ కొడుకు. అందుకే అలా వానలో తడుస్తూ చెదిరిన తలపులతో, ఇంటి దారి పట్టిందిట.

❖ ❖ ❖

చాలా రోజుల తరువాత, ఓ ఆదివారం వాళ్ళ కిచెన్ గార్డెన్ నుండి కాకర కాయ, వంకాయ మా కోసం తీసుకొచ్చింది వినీత.

ఆ మధ్యన కొడుక్కి పెళ్ళి చేసారు వినీత జార్జ్ దంపతులు. పెళ్ళికి నేను వెళ్ళలేక పోయాను. కొడుకు, కోడలు ఎలా వున్నారని అడిగాను.

బాగానే ఉన్నారని చెబుతూ ముభావంగానే ఉండిపోయింది. టీ, సమోస అయ్యాక కాసేపు తమ కూరగాయల మొక్కల గురించి చెప్పింది.

తరువాత సంభాషణ కుటుంబాల వైపు మళ్ళింది. తన మనస్సు విప్పి కొడుకు విషయం చెప్పనారంభించింది వినీత. పెళ్ళిచేస్తే పిచ్చి కుదురుతుందన్న భావనతో, కొడుకు జీవితం ఓ గట్టుకి చేర్చాలన్న తపనతో కొడుక్కి పెళ్ళి చేసానంది. ఎం.బి.ఏ చదివి, మంచి ఉద్యోగం చేస్తున్న ఆ అమ్మాయి అందంగా కూడా ఉంటుందట. కొడుకు ఉద్యోగం విషయంలో, సంపాదన విషయంలో మాత్రం అబద్ధాలు చెప్పారట వీళ్ళు ఆ అమ్మాయికి, వాళ్ళ కుటుంబానికి.

సంపాదన గురించి ఎలా అబద్ధాలు చెప్పగలరో నాకు అర్థం కాలేదు.

గవర్నమెంటు ఉద్యోగం చేసి రిటైర్ అయిన వినీతకి బెనిఫిట్స్‌తో పాటు మంచి పెన్షన్ వస్తుంది. తన పెన్షన్ డబ్బు మొత్తం ప్రతి నెలా కొడుక్కి ఇచ్చేస్తుందట. అది ఆ అబ్బాయి సంపాదించిన రియల్ ఎస్టేట్ రాబడులుగానూ, ఆస్తుల మీద వచ్చే నెలసరి అద్దెలుగానూ నమ్మజూపుతున్నారట అమ్మాయి వాళ్లకి.

'కొడుకుని గొప్పవాడిగా చూపాలన్న ఆశతో అవధులు దాటిన ఆ తల్లి

ప్రేమను అర్థం చేసుకోవాలని ప్రయత్నించాలి ఎవరైనా’ అనుకున్నాను.

ఇలా తమ బిడ్డల జీవితాలని ఎలాగైనా మంచి మార్గాన వెయ్యాలన్న ఆలోచనతో, కొందరు తల్లులు రకరకాల మార్గాలు వెతుక్కుంటారు. తల్లి తన బిడ్డల మంచి, మనుగడ కోసం ఎటువంటి బృహత్తర కార్యాన్నైనా మరో ఆలోచన లేకుండా, శక్తి వంచన లేకుండా అమలు పరుస్తుందని కూడా అర్థమయ్యింది మరోమారు.

ఏమైనా అమ్మ అనే వ్యక్తి తన, పర బేధంలేక అందరినీ తన బిడ్డల్లా భావించ గలగాలి. ఎవరి బిడ్డో ఇలా చేసిందనో, మరెవరికో అలా అయ్యిందనో విమర్శించే వారితోపాటు, ఎవరి బిడ్డయినా మంచి మార్గంలో నడిచి బాగుండాలని మన స్ఫూర్తిగా కోరుకునే అమృతమూర్తులని కూడా చూడగలము ఈ విశాల ప్రపంచంలో.

❖




**తె**ల్లారుజామున నిద్రమత్తులో మెల్లగా కళ్ళు విప్పుతుంటే, మసక మసగ్గా ఆ చీకటిలో చిరునవ్వులు చిందిస్తూ ఎదురుగా ఒక రూపం.

కళ్లు నులుముకుని చూస్తే – 'అమ్మ'.

"ఇంకాసేపు నిద్రపోవచ్చుగా! రాత్రి చాలాసేపు మేల్కొన్నావు" అంటూ

రోజూలాగే తల నిమిరింది.

ఆ చల్లని స్పర్శ, ఆ మెత్తని మాట, తొలకరి జల్లులా సేద తీర్చి, నాలో ఉత్సాహాన్ని నింపుతుంది.

కాని మగతనిద్ర వీడగానే, అమ్మ పైలోకాలకి వెళ్ళిపోయి మూడేళ్ళవుతుందని గుర్తుకొస్తుంది. ఎదురుగా గోడ మీద ఉన్నది అమ్మ ఫోటో. అందులో నుండే అమ్మ రోజూ నా కోసం చిందించే చిరునవ్వులు, చల్లని పలికరింపులు అందు కుంటూ ఉంటాను.

అమృతవర్షిణి ఆమె.

అమ్మ పేరు కూడా అమృత.

❖ ❖ ❖

ఈ రోజు అమ్మ వర్ధంతి.

మూడేళ్లగా చేస్తున్నట్టే పూజకి కావలసినవి, అమ్మకిష్టమైన పువ్వులు, స్వీట్స్, వంటకాలు, పెద్దంచు వెంకటగిరి చీర, పట్టంచు రవిక – అన్నీ రాత్రే తయారుగా ఉంచాను. దేవుడి గదిలోని అమ్మ పటానికి దణ్ణం పెట్టుకొని, కళ్ళ వెంట జారు తున్న భాష్పాలని తుడుచుకోకుండా అలాగే కూర్చుండి పోయాను.

కాసేపటికి పైకి లేచి స్నానాదికాలు ముగించుకొని, దేవుని గదిలో అమ్మ పటానికి పూలమాల వేసి, అమ్మకి ఇష్టమైనవన్నీ పటం ముందుంచి, కళ్ళు మూసుకొని గోడకి జారగిల పడ్డాను.

కళ్ళు మూసినా మనస్సులో చెదరని అమ్మ రూపం, నా కోసం చెరగని అమ్మ చిరునవ్వు మెదులుతూనే ఉంటాయిగా!

అమ్మ రూపం ప్రేమమయమైనదే కాదు, అందమైనది కూడా!

మహారాణిలా, హుందాగా ఉండేది అమ్మ.

నా తరువాత అమ్మకి ఇంకా ముగ్గురు పిల్లలు.

నా పెద్ద తమ్ముడు నా కన్నా మూడేళ్ళు చిన్నవాడు. వాడి తరువాతది చెల్లి. అందరిలో చిన్నవాడు ఆఖరి తమ్ముడు. అమ్మ మమ్మల్ని ప్రేమగా కాపాడుతూ గారాబంగా పెంచింది. ఆమె అమ్మతనంలో ఒక పదోవంతు నేను నా బిడ్డలకి పంచగలిగినా, నేను మంచి అమ్మనే అవుతాను.

“మరీ అంతలా మునిగిపోకే అమృతా, ఏదైనా సమపాళ్ళల్లో ఉండాలి. నీది

మరీ పశు ప్రేమ, కాస్త నీ సంగతి నీవు పట్టించుకో” అని అప్పుడప్పుడు మా అమ్మమ్మ, తన ఒక్కగానొక్క కూతురైన మా అమ్మని మందలించేది.

అమ్మమ్మ గుర్తుకి రాగానే, ఆమె చక్కగా పాడుతూ నన్నూ పాడమని ప్రోత్సహించడం గుర్తొచ్చి నవ్వుకున్నాను.

ఇంతలో నిశబ్దాన్ని ఛేదిస్తూ గంటలా ఫోన్ మోగడంతో, అమ్మ ఆలోచనల నుండి ఉలిక్కిపడి లేచి వెళ్ళి ఫోన్ అందుకొన్నాను.

ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డ్ నుండి ఓ పేషంట్ విషయమై నర్స్ ఫోన్. పేషంట్ పరిస్థితిపై సూచనలిచ్చి, తిరిగి పూజామందిరంకి వెళుతూ దూరంగా ఉన్న పడక గదుల వైపు చూసాను.

‘ఇంకా కిశోర్‌గాని, అమృతగాని లేచినట్టు లేరు’ అనుకుంటూ...

మళ్ళీ అమ్మ ఫొటో ముందు కూర్చుని అలవాటైన లలితా సహస్రనామం చదవడం మొదలెట్టగానే, నాలో అమ్మ గురించే ఆలోచనల అలలు ఉవెత్తున లేచి పడుతున్నాయి.

నాకు బాగా గుర్తు.

“మంచి సంబంధం, పెళ్ళయ్యాక కూడా చదివిస్తామని అంటున్నారుగా” అంటూ మెడిసిన్ పూర్తి కాకుండానే కిశోర్‌తో నా వివాహం జరిపించారు అమ్మా వాళ్ళు.

భర్త వెంట దూరతీరాలకేగినా నా మనస్సు, ఆలోచనలు అమ్మ చుట్టూనే ఉండేవి.

చదువుల్లో, ఆటల్లో – అన్నిటా నా ఉన్నతికి, పురోగతికి అమ్మే ఆయుష్షు పోసింది. నేను గెలుచుకున్న బంగారు పతకాలు, స్కాలర్షిప్ అవార్డుల వెనుక ఆమె కృషి ఎంతో ఉంది. అమ్మ తన జీవన కొలనులో నన్నో తామర పువ్వులా, కష్టనష్టాల బురద అంటకుండా సాకింది. ఓ స్నేహితురాలిలా మెలిగే అమ్మని తలవని క్షణముండేదికాదు.

నేనిల్లు వదిలి అమెరికా వచ్చేసినప్పుడు, ‘నా పెద్ద కూతురు, నా దేవత నను వీడి పోయింది’ అన్నది అమ్మ.

క్రమేపి నా తోబుట్టువుల పెంపకంలో అమ్మ మునిగి పోయింది. చదువుల పరంగా నా కందించిన సహాయ సహకారాలు వారికీ అందివ్వబోయిన అమ్మకి

నిరాశే ఎదురయ్యింది.

సమయమొచ్చేప్పటికి తమ్ముళ్ళకి వ్యాపారాలు, చెల్లికి సోమరితనం, స్నేహాలు తప్ప చదువుల మీద ఆసక్తి లేదని తేలిపోయింది.

అలా సాగిపోతుండగా ఊహించని విధంగా మెల్లమెల్లగా ఆమె జీవితం సుడిగుండాల చిక్కుకొంది.

❖ ❖ ❖

వ్యాపారాలంటూ ఆస్తులని కరిగించేసాడు పెద్ద తమ్ముడు. పరీక్షలు, చదువుల ముసుగులో స్నేహితుల ఇంట రాత్రి, పగలు ఉండిపోయేదట చెల్లి. ఎంత మందలించినా వినేది కాదట. అటు నాన్నకి చెప్పలేక, చేసేది లేక, మారుతుందిలే అని అమ్మ మిన్నకుండిపోయిందట.

అయినా, కొద్ది కాలానికే భయపడినంతా అయింది. ఫ్రెండ్ ఇంట కలసిన వ్యక్తితో ప్రేమలో పడి, చెప్పకుండా ఇంట్లోంచి వెళ్ళిపోయి అమ్మా వాళ్ళకి తల వంపులు తెచ్చింది కూడా ఆ కూతురే!

ఆకులు కాలాక అన్నట్టు అన్ని అనర్థాలు అయ్యాక విషయం నాన్నకి తెలిసి, పెద్ద గొడవలయ్యాయి. చెల్లి ఎక్కడుందో కనుక్కొని పరుగులు పెట్టి దాన్ని బతిమాలి, బామాలి తిరిగి ఇంటికి తీసుకొచ్చారు అమ్మా వాళ్ళు.

❖ ❖ ❖

అప్పట్లో చెల్లి చిరాకుల నుండి మనస్సు మళ్లించి ఒక్క నెల రోజులు చదువు, పరీక్షలు, ట్రైనింగ్‌లో ఉపరాడకుండా గడిపాను.

❖ ❖ ❖

ఓ రోజు హాస్పిటల్ నుండి వచ్చి అలిసిపోయి గాఢనిద్రలో ఉన్న నన్ను గట్టిగా తట్టి లేపుతూ, “ఇండియా నుండి నీకే ఫోన్, చాలాసేపుగా చేస్తున్నారు కీర్తి” అంటూ ఫోన్ అందించారు కిశోర్.

ఫోన్ అందుకొని అతి కష్టం మీద, “హల్లో, ఎవరు?” అన్నాను.

“అమ్మా, కీర్తి” – భోరుమని ఏడవడం మొదలెట్టింది అమ్మ.

ఉలిక్కిపడి లేచాను.

“చెల్లికి మూడోనెల గర్భం... ఏమీ తోచడంలేదు. వాడికే ఇచ్చి పెళ్ళి చెయ్యమని ఏడుస్తుంది. ఇదంతా తెలిసి నాన్నకి కోపమొచ్చి దాన్ని కొట్టినంత పనిచేసి

ఇంట్లోంచి వెళ్ళిపోయారు. నువ్వు తప్ప మీ నాన్నకి ఎవ్వరూ ఏమీ చెప్పలేరు. ఈ పరిస్థితి చక్కబెట్టలేరు. ఏదో ఒకటి చెయ్యమ్మా" అంటూ కుప్ప కూలినట్టుగా అయిపోయింది.

నాన్నని ఒప్పించి చెల్లి పెళ్ళి చేసి కాస్త మా కుటుంబం మళ్ళీ ఊపిరి తీసు కొనేలా అయ్యేప్పటికి నా ప్రాణం పోయినంత పనయ్యింది.

❖ ❖ ❖

గోరుచుట్టు మీద రోకటి పోటులా ఆ తరవాత నెలకే జరిగిన మరో సంఘటన అమ్మా వాళ్ళని తేరుకోలేనంతగా దెబ్బ తీసింది. కాలేజీ కుర్రవాళ్లకి మాదక ద్రవ్యాలు అమ్ముతూ చిన్న తమ్ముడు పట్టుబడి జైలు పాలవ్వడం మా అందరికీ మనస్తాపాన్ని కలిగించింది. చెడు స్నేహాలకి అలవాటుపడి నానా తిప్పలు పెట్టే వాడని అనుకున్నానేగాని, ఇలా ఇంతటి నేరాలకి అలవాటు పడ్డాడనుకోలేదు. ఇక వాడి విషయంలో, వకీలుకి వేలకి వేలు డబ్బులు కుమ్మరించడం మినహా నేనేమీ చేయలేని పరిస్థితి అది.

❖ ❖ ❖

ఈలోగా పెద్దతమ్ముడి పెళ్ళి జరగడంతో ఓ కొత్త అధ్యాయం మొదలయ్యింది. వాడి భార్య వల్ల మరిన్ని కష్టాలు పాలయ్యింది కుటుంబం.

ఖర్చులు, డాబులు పెరిగిపోయాయి.

తమ్ముణ్ణి అదిరించి బెదిరించి ఇల్లు వదిలి పొమ్మనే ధైర్యం లేదు అమ్మా వాళ్లకి.

మరోవైపు పెళ్ళి చేసి పంపిన ఏడాది లోగానే మొగుడు తాగుబోతంటూ, వాడు ఇష్టం లేదంటూ పసిపిల్లతో ఇంట చేరింది చెల్లి.

పెద్దవారైన తల్లితండ్రులపై భారం మోపుతున్న పెద్ద కొడుకు. తాగుడికి బానిసై దొంగతనాలకి అలవాటైన చిన్న కొడుకు. భర్తని వీడి పిల్లతో ఇంట చేరిన కూతురు. వీరంతా ఆర్థికంగా అమ్మ నాన్నల పైనే ఆధార పడడంతో కుటుంబ భారం పెరుగుతూ పోయింది.

చెల్లికి సహాయ పడదామన్న ఉద్దేశంతో, "నేను నిన్ను చదివిస్తానే... ఎం.ఇ.డి చేసి లెక్చరర్‌గా సెటిల్ అవ్వు" అన్నాను. ససేమిరా వద్దంది. అసలు దానికి తన కాళ్ళ మీద తాను నిలబడాలన్న ఆలోచన, ఆసక్తి లేదని తెలిసింది.

❖ ❖ ❖

పిల్లలు తానాశించిన విధంగా మసులుకోకపోతే, చేతి వేళ్ళు అన్నీ ఒకేలా ఉండవుగా అని సర్ది చెప్పుకొంది అమ్మ.

"అందరూ పెద్దవాళ్ళు కదా! నీవింక వారి విషయాల్లో అన్నిటికీ అడ్డం పడ వద్దు. వారి బాధ్యతలు వాళ్ళని తెలుసుకోనివ్వు" అని నేనెంత చెప్పినా, ఎన్ని విధాల ప్రాధేయ పడినా వినేది కాదు. తనకు మాలిన ధర్మంలా, వారి బరువు బాధ్యతలు, కష్టనష్టాలు, అప్పులు, అధోగతులు తాను మోయలేని బరువని తెలిసినా భుజాన వేసుకొని అలాగే సాగిపోయే యత్నంలోనే ఉండేది అమ్మ.

తోబుట్టువులు సోమరిపోతులు అవుతున్నారని తెలిసినా, అమ్మపై ప్రేమతో ఇల్లు గడవడానికి ఆమెకి నేనందిస్తున్న సహాయాన్ని నిలిపివేయలేక పోయాను. తాను నిత్యం బాధపడుతూ, నన్నూ అపరిమితంగా క్షోభ ననుభవింపచేసింది మా అమ్మ.

అసలే అసాధారణ పరిస్థితుల నడుమ నలిగి అలిసిపోతూ బతుకుతున్న వారికి, నాన్న రిటైర్మెంట్ సమ్మెట పోటే అయ్యింది. సూత్రప్రాయంగా ఇకపై నాన్న పెన్షన్ మీదనే సర్దుకోవాలంటే కష్టమే మరి!

ఇలా ఎన్నో ఉపద్రవాలు ఉప్పెనలా అమ్మ ఉనికినే గిరగిరా తిప్పేసాయి.

❖ ❖ ❖

అమ్మ కష్టాలు చూడలేక, నేనున్నానంటూ అమ్మని ఆదుకొన్నాను. చేయూత నిచ్చాను. అన్ని విధాలా సహాయం చేసాను. జీవిత పథంలో కొంత దూరం అమ్మతో నేనూ నడిచాను. నా ఒళ్ళో తల ఆన్చి సేద తీరమన్నాను. వణుకుతున్న చేతుల్లో ఆసరానయ్యాను. సన్నగిల్లుతున్న ఆమె చూపుకి చిరుదీపం వెలిగించ గలిగాను.

❖ ❖ ❖

కొన్నాళ్ళు ఎలాగో గడిచినా నా ఆసరా, నా సానుభూతి, నా సాయం ఏపాటి? బూడిదిలో పోసిన పన్నీరే అయ్యాయి. అమ్మ జీవితంలో మలుపులు, ఎదురీతలు, ఒడిదుడుకులు వాళ్ళని కష్టాల అగాధంలోకి నెట్టాయి. ఆమె ఉనికి ఆమెది కాకుండా పోయింది. అమ్మ జీవితంలో నేనొక్కతినే కానుగా! ఆమెకి ఎన్నో భారాలు, మరెన్నో మజిలీలు, ఇంకెన్నో శక్తులు, మరెన్నో పరాభవాలు. పరిస్థితి

పట్టు తప్పింది.

❖ ❖ ❖

విధిరాతల్ని ఎదురించలేక పోయాను.

నా వద్దకు వచ్చేయమంటే బాధ్యతలని త్యజించలేమన్నారు.

ఇక రాను రాను నేనందించిన సాయం అమ్మా వాళ్ళకి సంతోషాన్నీ, సంతృప్తినీ పంచలేదు. మసకబారిన తల్లి చూపుని, తగ్గిన తండ్రి వినికిడిని మెరుగు పరచాలని అందించిన నా చేయూత తోబుట్టువుల విలాసాలకే ఉపయోగబడిందని తెలిసీ, ఏమీ చేయలేని దుస్థితి దాపురించిందని గుండె జారిపోయింది. నెమ్మదిగా అమ్మ చుట్టూ ఉన్న బురద గట్టిగా పేరుకుపోయి నేను ఛేదించలేని విషవలయ మయ్యింది.

అప్పులు, అపహాస్యాలు, అరమరికలు, దిగుళ్ళు, మోసాలు, ఉచ్చుల్లా బిగిసి పోతున్న విషానుబంధాల వలయం నుండి అమ్మని తొలగించే వీలే లేకుండా పోయింది. ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది.

అమ్మ ఇలా ఇంకా ప్రాణాలతో ఉంటే, ఆమె అనుభవించేది మరెన్నో రెట్లు బాధ, భయం, దౌర్భాగ్యం, దారిద్ర్యమే అవుతుందని వాపోయాను.

❖ ❖ ❖

అమ్మని, నాన్నని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలనుకున్నాను. అందుకోసమే ప్రతి నిత్యం నా జీవితాన్ని అందుకనుగుణంగా మలుచుకున్నాను. ఊహ తెలిసిన నాటి నుండి నేను చేసిన ప్రతి పనిలో నా తల్లితండ్రులు సుఖాన్ని కోరుకున్నాను. ఎంత పయత్నించినా అమ్మకి తృప్తిని, సుఖసంతోషాలని సమకూర్చలేక పోయాను. వారి బాగు కోసం నా తాపత్రయం, నా యత్నం విఫలమవ్వడం నాకు విధించబడిన అర్ధరహితమైన శిక్షలా అనిపించసాగింది.

❖ ❖ ❖

పెళ్ళయిన ఎనిమిదేళ్ళకి తల్లిని అవ్వబోతున్నానని సంతోషంగా అమ్మకి చెప్పా లనుకున్నప్పుడు కూడా ఆరు నెలలు ఆగాను. నేను చెప్పాలని ఫోన్ చేసి నప్పుడల్లా ఇంటనున్న సమస్యలను ప్రస్తావించి దు:ఖంలో మునిగిపోయేది. నా చేయూత నడిగేది. నిస్సత్తువగా తయారయ్యేది.

తనకోసమంటూ జీవించడం మానేసిన అమ్మకి చేయగలిగినంతా చేశాము

నేను, మా వారు కిషోర్.

ఆర్థికంగా, శారీరకంగా అమ్మ దుర్భర స్థితిలోకి తోసివేయబడింది.

అమ్మ కోసం నా ఆర్తనాదాలు, నా చాచిన చేతులు ఆమె వరకు వెళ్ళలేక పోయాయి. నిస్సహాయరాలునయ్యాను.

❖ ❖ ❖

ఓ వేకువ జామున, తొలి సూర్య కిరణాలు మోసుకొచ్చాయి, నాకు, ఓ శుభవార్త... ఔను, శుభవార్తే!

మా అమ్మ ఈ లోకాన్ని విడిచి పోయిందన్న వార్త.

నాకు, ఓ శుభవార్తే!

నన్ను దుర్మార్గురాలు అనుకున్నా సరే, అమ్మ గురించిన ఆ వార్త నిజంగా అది నాకు ఓ శుభవార్తే!

"నువ్వింకా ఈ బాధలు పడకుండా, ఈ విషాలు మింగకుండా, ఈ పాపాన్ని, పాపాత్ములని వదిలిపోతున్నందుకు నాకు సంతోషమేనమ్మా! అమ్మా! నీవు సుఖంగా ఉండాలి, దేవతలాంటి నీకు సరైన స్థానం ఆ స్వర్గాన ఉందమ్మా!".... అని కుప్పకూలిపోయాను, ఆ రోజు.

❖ ❖ ❖

అలా అమ్మ జ్ఞాపకాలతో మోకాళ్ళ నడుమ ముఖం పెట్టుకుని రోదిస్తున్న నన్ను ఓ మెత్తని చేయి తట్టి లేపింది.

తలెత్తి చూస్తే కంటతడి వల్ల మసక బారిన నా కళ్ళకి కనబడింది నా చిట్టి తల్లి 'అమృత'. ఎదురుగా కూర్చుని నా ముఖంలోకి చూడాలని పయత్నిస్తోంది.

దాని వెనకే ఆఫీసుకి తయారయి నిలబడి ఉన్న కిశోర్.

కళ్ళు తుడుచుకొని, "ఇదిగో, వస్తున్నా... సారీ కిశోర్!" అని పూజ గది నుండి బయటకి వచ్చాను.

టైం పొద్దున ఎనిమిదిన్నరయ్యింది.

"నేను ఇవాళ క్లినిక్‌కి వెళ్లడం లేదు" అంటూ కిశోర్‌కి కాఫి ఇద్దామని వంటింట్లోకి వెళ్లాను.

అమృతకి హార్లిక్స్ కలుపుతుంది, బేబీ సిట్టర్ మేరీ.

❖ ❖ ❖

మా ఇద్దరికి కాఫీ తీసుకోచ్చేప్పటికి మూడేళ్ళ అమృత పాలు తాగకుండా మేరీని సతాయిస్తుంది.

నా అందాల పాపకి అమ్మ పేరే పెట్టుకున్నాను.

మా అమ్మ లాగానే ఉంటుందని కిషోర్ కూడా అంటారు.

కిశోర్ ఆఫీసుకి వెళ్ళిపోయాక, మేరీతో కలిసి కేరింతలాడుతూ బొమ్మలన్నీ ముందేసుకొని ఆడుతున్న అమృతని చూస్తూ కూర్చున్నాను.

❖ ❖ ❖

అమ్మ చనిపోయిన మూడు రోజులకి పుట్టింది అమృత.

కష్టమైన ప్రెగ్నెన్సీ అవడంతో అమృత పుట్టే మూడు వారాల ముందే నేను హాస్పిటల్లో అడ్మిట్ అయ్యాను.

అందుకే అమ్మ ఆఖరి చూపులు అందుకోలేక పోయినందుకు తల్లడిల్లి పోయాను.

కాని అమ్మ దూరంగా, సుఖంగా స్వర్గాన ఉందని ఓ తృప్తి!

అంతటి ప్రేమమయి, నిస్వార్ధ జీవి ఎక్కడున్నా సంతోషంగానే ఉంటుందని ఓ సంతృప్తి!

❖

నన్నయాదుల కన్నతల్లికి సన్నజాజుల మాలలు

అర్పిస్తూ

ఆంధ్రకేసరి వీరమాతకు సాంద్రకర్పూర

హారతులందిస్తూ

రాలుకరిగే త్యాగరాజుని రాగసుధలో

పరవశిస్తూ

కూచిపూడి కళామతల్లికి నాట్యాంజలులు

సమర్పిస్తూ

అమెరికాలో తెలుగు తల్లికి

సాహిత్యాలంకరణలు చేస్తూ

మురిసిపోదాం మనందరం

మనందరం తెలుగు భాషాభిమానులం

**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా**

**హ్యూస్టన్ :: టెక్సస్**

Web site : www.vangurifoundation.org

Blog : www.vangurifoundation.blogspot.com

# వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా

## హ్యూస్టన్ :: టెక్సస్

ఉత్తర అమెరికాలో తెలుగు రచయితలని ప్రోత్సహించి తెలుగు భాషా పోషణకి దోహదంచేసే సదుద్దేశంతో 1994లో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంస్థ ప్రారంభించబడింది. మాతృభాషని కనీసం అమెరికాలో స్థిరపడిన మొదటి తరం వారయినా మర్చిపోకుండా తెలుగు సాహిత్యాన్ని వారికి అందుబాటులో ఉంచే ప్రయత్నంలో, తెలుగు భాషాభిమానుల ప్రోత్సాహంతో, లాభాపేక్ష లేకుండా, మేము తలపెట్టిన కార్యక్రమాలు కొన్ని ఈ క్రింద పొందుపరచాం.

## అమెరికాలో మా ఆశయాలు

1. అమెరికా తెలుగు రచయితల రచనలని ప్రచురించి, పాఠకులకి అందచేసి, వారి సృజనాత్మక శక్తిని గౌరవించడం.
2. అనుభవజ్ఞులకి నూతన రచనలు చేసే ఉత్సాహం కలిగించడానికి, ఔత్సాహిక రచయితలని ప్రోత్సహించడానికి ఉత్తమ రచనల పోటీ ప్రతీ ఉగాదికీ నిర్వహించడం.
3. దేశవ్యాప్తంగా కనీసం రెండేళ్ళకొకసారి ఉత్తర అమెరికా తెలుగు సాహితీ సదస్సులను, వీలయినప్పుడల్లా రాష్ట్ర వ్యాప్తంగానూ, స్థానికంగానూ సాహితీ సదస్సులను నిర్వహించడం.
4. తెలుగు పుస్తకాలు చదివే ఆసక్తి ఉన్నవారికి శ్రమలేకుండా ఇంటికే పుస్తకాలు అందించడం.
5. అమెరికాలో పుట్టిన పిల్లలకి తెలుగు నేర్పే పద్ధతులను, పరికరాలను అందించడం.

## ఆంధ్రప్రదేశ్‌లో మా ఆశయాలు

2002వ సంవత్సరం నుండి ప్రారంభించి, అమెరికాలో గత నాలుగు శతాబ్దాలుగా వెలువడుతున్న తెలుగు సాహిత్యాన్ని, అమెరికా తెలుగు రచయితల సృజనాత్మక శక్తిని ఆంధ్రప్రదేశ్‌లో సాహిత్యాభిమానులకి తెలుగునాట తెలియపరచే ప్రణాళికలు తలపెట్టాం. అమెరికా తెలుగు రచయితలు, స్వానుభవంతో, వ్రాయగల విదేశాంధ్ర సాహిత్యాన్ని (డయాస్పోరా తెలుగు సాహిత్యం) కేంద్రీకృతమైన పద్ధతిలో ప్రపంచవ్యాప్తంగా తెలియజేయాలని కూడా మా ప్రయత్నం. అమెరికా తెలుగువారి గ్రాంథిక రచనలు, ఆధునిక కథలు, కవితలు, నాటికలు మొదలైన రచనలను, తెలుగునాట వెలుగు చూడని మంచి రచనలు వీలైనన్ని ప్రచురించడం మా ధ్యేయం. 2006లో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఇండియాలో కూడా రిజిస్టర్డ్ ట్రస్ట్‌గా స్థాపించాం.

**వంగూరి చిట్టెన్ రాజు**, అధ్యక్షులు, హ్యూస్టన్, టెక్సస్
**'వంశీ' రామరాజు**, మేనేజింగ్ ట్రస్టీ, హైదరాబాద్
**ఇంద్రగంటి శ్రీకాంతశర్మ**, గౌరవ సంపాదకులు, హైదరాబాద్

Vanguri Foundation of America, Inc, P.O. Box 1948 Stafford, Texas
Phone : 281 277 0445, e-mail : vangurifoundation@gmail.com
**Vanguri Foundation of America,** Satya Sai Puram, **KUNTLOOR** (Village), Hayatnagar (Mandal), HYDERABAD - 501 505 Ph : 98490 23852

# వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ప్రోత్సహించిన కార్యక్రమాలు

అఖిల భారత తెలుగు రచయితల సమ్మేళనం, విజయవాడ - 1994

ఉగాది ఉత్తమ రచనల పోటీలు (కథ, కవిత, నవల, వ్యాసం) - 1995 నుంచి ప్రతి ఉగాది నాటికీ

ప్రప్రథమ అమెరికా తెలుగు సాహితీ సదస్సు, అట్లాంటా - 1998

ద్వైవార్షిక (ప్రతీ ఆర్నెల్లకీ) టెక్సస్ తెలుగు సాహితీ సదస్సులు - (1998 నుంచి)

రెండవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు, షికాగో - 2000

మూడవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు, డెట్రాయిట్ - 2002

నాలుగవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు, బ్రిడ్జ్‌వాటర్, న్యూజెరి- 2004

ఐదవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు, హ్యూస్టన్ - 2006

మొట్టమొదటి ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు, హైదరాబాద్ (డిసెంబర్ 31, 2006 - జనవరి 1, 2007)

ఆరవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు, ఫ్రీమాంట్, కాలిఫోర్నియా - 2008
రెండవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు - తెలుగు కథా
శతవార్షికోత్సవాలు - మొట్టమొదటి ప్రపంచ మహిళా
రచయిత్రుల సమ్మేళనం, హైదరాబాద్ - ఫిబ్రవరి, 2009
రెండవ అంతర్జాతీయ మహిళా రచయిత్రుల సమ్మేళనం, హైదరాబాద్
- ఆగస్టు 29, 30, 31, 2010
సప్తమ అమెరికా సాహితీ సదస్సు, ఇండియానాపోలిస్ - అక్టోబరు 9-10, 2010
నెలనెలా తెలుగు వెన్నెల - సాహిత్య గోష్టులు, ప్రసంగాలూ
- 2007 నుంచి నిరాఘాటంగా ప్రతీ నెలా!
మూడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు, హ్యూస్టన్, టెక్సస్ - 2011
గురజాడ 150వ జయంతి ఉత్సవాలు, హ్యూస్టన్, టెక్సస్ - అక్టోబర్ 27, 2012

# వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా నిర్వహించిన ఉత్తమ రచనల పోటీలు

ఉగాది ఉత్తమ రచనల పోటీలు (కథ, కవిత, నవల, వ్యాసం) - 1995 నుంచి ప్రతి ఉగాది నాటికీ

"నా మొట్టమొదటి కథ" - నూతన కథకులకు ప్రత్యేక పోటీ - మార్చి, 2010

మొట్టమొదటి అంతర్జాతీయ ఉత్తమ కథల పోటీ - మార్చి, 2009

మొట్టమొదటి అంతర్జాతీయ రచయిత్రుల కథల పోటీ (ఆంధ్రప్రభ సహకారంతో) - ఆగస్టు, 2010

"నా మొట్టమొదటి కవిత" పోటీ - మార్చి, 2011

# వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా

# ప్రచురణలు

1. అమెరికా తెలుగు కథానిక - మొదటి సంకలనం - 1995
2. అమెరికా తెలుగు కథానిక - రెండవ సంకలనం - 1995
3. అమెరికా తెలుగు కథానిక - మూడవ సంకలనం - 1996
4. మదన సుందరి'' *(నృత్య నాటిక)* - మంచిరాజు వెంకట్రావు - 1996
5. మాలకొండ మాట, మంచి మాట *(శతకం)* - ఉండేల మాలకొండారెడ్డి - 1996
6. మియాండరింగ్ మైండ్ *(ఇంగ్లీషు పద్యాలు)* - ఏ.వి.రావు
7. అమెరికా తెలుగు కథానిక - నాల్గవ సంకలనం - 1997

8. కించిత్ భోగే భవిష్యతి *(కథా సంపుటి)* - వేమూరి వేంకటేశ్వరరావు - 1997
9. అమెరికా తెలుగు కథానిక - ఐదవ సంకలనం - 1998
10. అమెరికా తెలుగు కవిత - మొదటి సంకలనం - 1998
11. మెటా మార్ఫసిస్ *(రచనా సంపుటి)* - వేలూరి వెంకటేశ్వరరావు - 1998
12. తిరుప్పావై *(పద్య కావ్యం)* - శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులవారు, పెమ్మరాజు వేణుగోపాలరావు *(ఆంగ్లంలో అనువాదం)* - బాపు రంగుల బొమ్మలు - 1998
13. ప్రప్రథమ అమెరికా తెలుగు సాహితీ సదస్సు - సభా విశేష సంచిక - 1999
14. అమెరికా తెలుగు కథానిక - ఆరవ సంకలనం - 2000
15. మా ఊరి కథలు - దామరాజు సచ్చిదానందమూర్తి కథలు - 2000
16. అమెరికా ఇల్లాలు *(రచనా సంపుటి)* - కమల చిమట - 2000
17. లోకానికి చాటింపు *(కవితా సంపుటి)* - పెమ్మరాజు వేణుగోపాలరావు - 2000
18. అమెరికా తెలుగు కథ *(మొదటి సంకలనం)* - ఇండియా ప్రచురణ - ఫిబ్రవరి, 2002
19. రెండవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు (ఆగస్ట్ 19-20, 2000) - సభా విశేష సంచిక - మే, 2002.
20. గేయ రామాయణం - చెరుకూరి రమాదేవి - ఆగస్టు, 2002
21. అమెరికా తెలుగు కథానిక - ఏడవ సంకలనం - అక్టోబర్, 2002
22. నేనూ - నా రచనలు - *'కళాప్రపూర్ణ'* డా॥ అవసరాల (వింజమూరి) అనసూయా దేవి - డిసెంబర్ 2003.
23. అమెరికా తెలుగు కథానిక - ఎనిమిదవ సంకలనం - అక్టోబర్ 2004
24. పడమటి గాలులు *(నవల)* - వడ్లమాని కార్తీక్ - ఆగస్టు 2005
25. అమెరికామెడీ కథలు - వంగూరి చిట్టెన్ రాజు - జూలై, 2006
26. ప్రవాసాంధ్రుల ఆశాకిరణం *(కథా సంపుటి)* - శ్రీమతి పూడిపెద్ది శేషుశర్మ, ఆగస్టు, 2006
27. శృంగార భర్తృహరి - పెమ్మరాజు వేణుగోపాలరావు - ఆగస్టు, 2006
28. అమెరికా తెలుగు కథానిక - తొమ్మిదవ సంకలనం - అక్టోబర్ 2006
29. గతానికి స్వాగతం - *'కళాప్రపూర్ణ'* డా॥ అవసరాల (వింజమూరి) అనసూయా దేవి - జనవరి 2007
30. బాలి కార్టూన్లు - జనవరి 2007
31. అమెరికాలక్షేపం - వంగూరి చిట్టెన్ రాజు - జనవరి 2007
32. అమెరికా తెలుగు కథానిక - పదవ సంకలనం - జూలై, 2008

33. అమెరికామెడీ కథలు - వంగూరి చిట్టెన్ రాజు *(అమెరికా ప్రచురణ)*
34. అమెరికామెడీ నాటికలు - వంగూరి చిట్టెన్ రాజు - జూలై, 2008
35. మూడవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు (డెట్రాయిట్) - సభా విశేష సంచిక - సెప్టెంబర్, 2008
36. నాలుగవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు (బ్రిడ్జ్‌వాటర్, న్యూజెర్సీ) - సభా విశేష సంచిక - అక్టోబర్, 2008
37. అమెరికామెడీ కబుర్లు *(హాస్య కథావ్యాసాలు)* - వంగూరి చిట్టెన్ రాజు - ఫిబ్రవరి, 2009
38. పరిపరి పరిచయాలు - ఇంద్రగంటి శ్రీకాంతశర్మ - ఫిబ్రవరి, 2009
39. 20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా సాహితీవేత్తల పరిచయ గ్రంథం - ఫిబ్రవరి, 2009
40. సిప్రాలి - మహాకవి శ్రీశ్రీ స్వదస్తూరీలో - శ్రీశ్రీ శతజయంతి ప్రత్యేక ప్రచురణ - సెప్టెంబర్, 2009
41. అమెరికా ఇల్లాలి ముచ్చట్లు *(కథాసంపుటి)* - శ్యామలాదేవి దశిక - అక్టోబరు, 2010
42. అమెరికా తెలుగు కథానిక - పదకొండవ సంకలనం - అక్టోబరు, 2010
43. శ్యామ్‌యానా *(కథాసంపుటి)* - మెడికో శ్యామ్ - అక్టోబరు, 2010
44. 20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా సాహితీవేత్తల పరిచయ గ్రంథం *(అమెరికా ముద్రణ)*
45. అమెరి'కాకమ్మ'కథలు - వంగూరి చిట్టెన్ రాజు - అక్టోబరు, 2011
46. Lakshmi's Table (*A Collection of Vegetarian Recipes from South India*) - P.S. Lakshmi Rao - February, 2012
47. ఒక అమ్మ ఆక్రోశం *(నవల)* - డా. ఉమా ఇయ్యుణ్ణి - మార్చ్, 2012
48. వర్షించవే నీలి మేఘమా *(కవితా సంకలనం)* - ఉమ పోచంపల్లి గోపరాజు - మార్చ్, 2012
49. తూర్పు గుడి-పడమర బడి *(నవల)* - కలశపూడి శ్రీనివాసరావు - మార్చ్, 2012
50. వంగూరి చిట్టెన్ రాజు చెప్పిన నూటపదహారు అమెరికామెడీ కథలు - జనవరి, 2013
51. విదేశీ కోడలు *(కథాసంపుటి)* - కోసూరి ఉమాభారతి - మార్చి, 2013

❖ ❖ ❖

**VANGURI FOUNDATION OF AMERICA**, Inc
Houston, Texas
e-mail : vangurifoundation@gmail.com
Web site : www.vangurifoundation.org
Blog : www.vangurifoundation.blogspot.com

# VIDESEE KODALU

*(Anthology of Short Stories)*

*by*

*Kosuri Uma Bharathi*



**'నాట్యభారతి' శ్రీమతి. ఉమాభారతి**

**Director - Archana Fine Arts Academy, U.S.A**

కూచిపూడి నృత్య కళాకారిణి, నాట్య గురువు, నటి, నిర్మాత, దర్శకురాలు, రచయిత్రి, ఆంధ్రప్రదేశ్ నుండి సాంస్కృతిక రాయబారిగా ఉమాభారతి దేశవిదేశాలు పర్యటించారు.

కళ ద్వారా స్వచ్ఛంద సమాజసేవకి అంతర్జాతీయంగా కూడా గుర్తింపు, అవార్డులు పొందారు. చలన చిత్రాల్లో నటించి, నృత్య సంబంధిత చిత్రాలు నిర్మించి, దర్శకత్వం వహించారు.

1982లో హ్యూస్టన్, టెక్సాస్‌లో 'అర్చనా డాన్స్ అకాడెమి' స్థాపించారు. శాస్త్రీయ నృత్య రూపక రచనలకి అవార్డులు పొందారు.

2012లో వంగూరి ఫౌండేషన్ వారి 'ఉగాది ఉత్తమ రచన పురస్కారం' పొందారు. గత ఏడాది ముప్ఫయ్‌కి పైగా వ్యాసాలు, కథలు, కవితలు ప్రచురణయ్యాయి.

గుంటూరులో జన్మించి, హైదరాబాదులో పెరిగి ఉస్మానియా నుండి ఎం.ఏ. డిగ్రీ పొందారు.

భర్త డా. మురళీమోహన్ కోసూరి.

నివాసం హ్యూస్టన్, యు.యస్.ఎ.

కుమారుడు సత్యజిత్, కుమార్తె శిల్ప.

చదువరులకు సమస్యలతో సాహితీ ప్రపంచంలో ముందుకు సాగాలని ఆశ పడుతున్నారు.


www.ArchanaFineArtsAcademy.com

ukosuri@hotmail.com


Price : ₹ 150/-